www.andhrajyothy.com పేజీలు: 12 వెల (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 346

మంగళవారం | 1-4-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం తిథి: చవితి రా.2:33 తదుపరి పంచమి, నక్షత్రం: భరణి ఉ.11:07 తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.9:05-రా.11:25, దుర్ముహూర్తం: ఉ. 8:39-ఉ.9:28, రా.10:16-రా.11:02, అమృతఘడియలు:: ఉ.6:50-ఉ.8:16, రాహుకాలం: మ.3:00-సా.4:30, సూర్యోదయం: 6:13, సూర్యాస్తమయం: 6:24 | విజయవాడ సిటీ**

ఈ 3 నెలలూ మంటలే!



పెరగనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు
సాధారణం కంటే అధికంగా వడగాడ్పులు
అనేకచోట్ల 45 డిగ్రీలు, కొన్నిచోట్ల అంతకుమించి
హీట్‌వేవ్ జోన్‌లో అనేక రాష్ట్రాలు 12
వేసవి ఉపశమన ప్రణాళికలు అవసరం: ఐఎండీ
ప్రజలను అప్రమత్తం చేయాలని సూచన


కరువు గుప్పిట 51 మండలాలు
6 జిల్లాల పరిధిలో గుర్తింపు
37 మండలాల్లో తీవ్రం, 14 చోట్ల మధ్యస్థం
నోటిఫికేషన్ జారీ

పల్లెల్లో ప్రగతి హరివిల్లులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పడకేసిన పల్లె పాలన.. కూటమి హయాంలో పరుగులు పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పది నెలల కాలంలోనే గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి దిశగా నడిపిస్తోంది. జగన్ సర్కార్ ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనుల కంటే మిన్నగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు పలు అభివృద్ధి పనులు చేపట్టి గ్రామీణ ప్రాంతాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాయి. ఓవైపు పంచాయతీరాజ్, మరో వైపు గ్రామీణాభివృద్ధిశాఖలో అధికారులకు టార్గెట్లు పెట్టి గ్రామాలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నారు.



ఇది కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెళ్లలోని ఒక వీధి. ఎన్నో ఏళ్లుగా సీసీ రోడ్డు లేదు. వర్షం పడినప్పుడు నడవాలన్నా నరకమే. కూటమి ప్రభుత్వం రాగానే.. ఇక్కడ పరిస్థితి మారింది. 'పల్లె' నిధులతో కడివెళ్లలో సీసీ రోడ్డుతోపాటు డ్రైనేజీ పనులు చకచకా జరిగిపోతున్నాయి.

పల్లెల్లో పనుల సందడి!



అభివృద్ధి దిశగా గ్రామాల పరుగు

గ్రామాలకు వీడిన ఐదేళ్ల గ్రహణం
పది నెలల్లోనే మారిన ముఖచిత్రం
ఉపాధిలో రూ.10 వేల కోట్ల వ్యయం
గ్రామాల్లో 26 వేల మినీ గోకులాలు
4 వేల కి.మీ. సిమెంట్ రోడ్ల నిర్మాణం
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో వినూత్న మార్పులు తెచ్చిన ప్రభుత్వం
2028 నాటికి మొత్తం 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కొళాయి నీరు
కేరళ ఆదర్శంగా పవన్ ప్రణాళికలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా అభివృద్ధి పనులు లేక వెలవెలబోయిన పల్లెసీమలకు మళ్లీ కళ వస్తోంది. సీసీ రోడ్లు, మినీ గోకులాలు, తాగునీటి కొళాయిలు, ఇతర పనులతో గ్రామాల్లో సందడి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. ఒకప్పుడు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో చేపట్టిన పనులు గత జగన్ పాలనలో నిర్వీర్యమయ్యాయి. ఇప్పుడు ఆ గ్రహణం వీడింది. సీఎం చంద్రబాబు చొరవ, స్వయంగా గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చర్యలతో పరిస్థితి మారుతోంది. ఐదేళ్లలో వైసీపీ సర్కార్ 884 కిలో మీటర్ల సిమెంట్‌రోడ్లను నిర్మిస్తే, ప్రస్తుత ప్రభుత్వం పది నెలల్లో ఐదు రెట్లు ఎక్కువగా, అంటే 4 వేల కిలో మీటర్ల మేరకు సిమెంట్ రోడ్లు నిర్మించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా

మిగతా 11వ పేజీలో...

భూదందాలో బాస్‌లు!



అసైన్డ్ చట్టాన్ని కాపాడాల్సిన ఐఏఎస్‌లే నాడు అడ్డగోలుగా దోచిపెట్టారు

జిల్లాల్లో అసైన్డ్ చట్టాన్ని కాపాడాల్సినవారే అడ్డగోలుగా వ్యవహరించారు. ఫ్రీహోల్డ్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను నాడు వైసీపీ పెద్దలకు దోచిపెట్టారు. వైసీపీ ప్రభుత్వ చివరి ఏడునెలల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 13,59,805 ఎకరాల భూములను జిల్లా కలెక్టర్లు ఫ్రీ హోల్డ్ చేశారు. ఇందులో 5,74,306 ఎకరాలకు చట్టాలను ఉల్లంఘించి మరీ , జిల్లాల్లో కీలక పోస్టుల్లోని కొందరు ఐఏఎస్ అధికారులు నిషేధ విముక్తి కల్పించారని రెవెన్యూ విచారణలో తేలింది. ఇందులో 2.64 లక్షల ఎకరాలకు అసలు రెవెన్యూ రికార్డులే లేకపోవడం గమనార్హం. ఇందులో ఏదో గ్యాంబ్లింగ్ జరిగి ఉండొచ్చని, లోతైన విచారణ చేస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయంటూ రెవెన్యూశాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది.

వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గారు
ఎక్కడంటే అక్కడ సంతకాలు పెట్టారు
పీవోటీ చట్టం, జీవో 596ల ఉల్లంఘన
ఏడు నెలల్లోనే 13,59,805 ఎకరాలకు 'విముక్తి'
5,74,306 ఎకరాల్లో ఉల్లంఘనల గుర్తింపు
ఇందులో రికార్డుల్లోనే లేని 2.64 లక్షల ఎకరాలు
13 జిల్లాల్లో అక్రమాలు.. టాప్‌లో 4 సీమ జిల్లాలు
లోతైన విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు
ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ సిఫారసు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ అండ్ కో పెట్టిన భయమో, మరేమో తెలియదుగానీ, గత ప్రభుత్వంలో కొందరు అధికారుల భూ అక్రమాలు శ్రుతిమించి సాగాయి. నాడు నేతలు కోరుకున్న భూములను అసైన్డ్ కింద చూపించి ఫ్రీ హోల్డ్ చేశారు. రికార్డులే లేని భూములను సైతం అసైన్డ్ కోటాలో నిషేధం నుంచి విడిపించారు. అసైన్డ్ చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే నేతల కొమ్ముకాసి విలువైన భూములకు స్వేచ్ఛ కల్పించారు.. ఇది

మిగతా 12వ పేజీలో...

ఎవరేమనుకుంటే మాకేంటి?

ఏసీబీ కేసు ఉన్న అధికారికే విజిలెన్స్
సీసీఎల్ఏలో తహసీల్దార్లు, ఇతర ఉద్యోగుల సర్వీసు, విజిలెన్స్ కేసుల పరిష్కార బాధ్యతలు
పోలవరం ప్రత్యేక అధికారిగా ఉండగా 2017లో తీవ్రమైన అవినీతి ఆరోపణలు
ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరిన ఏసీబీ
ఏమీ తేల్చకుండా నాన్చిన గత ప్రభుత్వం
ఆ అధికారి విచారణకు ఇటీవలే అనుమతి
ఇంతలోనే అదే అధికారికి కీలక పోస్టింగ్
రెవెన్యూ శాఖలో సరికొత్త వివాదం 12

వేతన జీవులకు పన్ను ఉపశమనం

ఏప్రిల్ 1 విడుదల



రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఉండదు
టీడీఎస్, టీసీఎస్ నిబంధనలు, బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ తదితరాల్లోనూ మార్పులు

న్యూఢిల్లీ, మార్చి 31: కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పన్ను చెల్లింపుదారులు, వేతన జీవులు, వినియోగదారులకు సంబంధించిన కొన్ని మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని భారీగా పెంచడంతోపాటు సవరించిన ఆదాయ పన్ను శ్లాబులు అమల్లోకి రానున్నాయి. యూపీఐ మార్గదర్శకాల్లో మార్పులు, ఇతర మార్పులు అమల్లోకి రాబోతున్నాయి. వాటి గురించి చూద్దాం...

వేతన జీవులకు పెద్ద ఊరట..

దేశంలోని వేతన జీవులు ఊహించని విధంగా 2025 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాయ పన్ను మినహాయింపునకు సంబంధించిన ప్రకటన చేశారు. రూ.12 లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జించే వారు ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను కలిపితే

మిగతా 2వ పేజీలో...

వృద్ధులకు ఆఫ్‌లైన్‌లో శ్రీవారి దర్శన టోకెన్లు!

పాత విధానం పునరుద్ధరణకు టీటీడీ బోర్డు తీర్మానం 3
వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్పుపై వారాంతంలో ట్రయల్ రన్

ఈద్ ముబారక్



రంజాన్ సందర్భంగా విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు 12



ఎవర్నీ వదలం

అన్ని దేశాలపైనా ప్రతీకార సుంకాలు
ట్రంప్ పునరుద్ఘాటన
రేపటి నుంచే మోత ప్రారంభం
'మినహాయింపు'పై భారత్ ఆశలు
ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉత్కంఠ

వాషింగ్టన్, మార్చి31: అన్ని దేశాలపైనా ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన ఏప్రిల్ 2 లిబరేషన్ డే నుంచి అన్ని దేశాలపైనా టారిఫ్‌లు విధిస్తామన్నారు. 10, 15 దేశాలపై మాత్రమే సుంకాలు విధిస్తారనే ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. అమెరికా పూర్వ వైభవం పొందాలంటే తమతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్యం జరిపే అన్ని దేశాలపైనా సుంకాలు విధించాల్సిందేనని, ఏం జరుగుతుందో చూద్దామన్నారు. ఇప్పుడు అందరి చూపూ అమెరికావైపే. బుధవారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏ దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తారు? ఏ దేశాలకు

మిగతా 2వ పేజీలో...




కొడాలి నాని ఆరోగ్యం తీవ్ర ఆందోళనకరం!

మూడు రక్త నాళాలు బ్లాక్ 12
సర్జరీ కూడా చేయలేని పరిస్థితి
హైదరాబాద్ ఏఐజీ నుంచి డిశ్చార్జి
ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి

'సిస్కో' నుంచి రవీంద్రారెడ్డి ఔట్!

రాష్ట్ర ప్రాజెక్టుల నుంచి పక్కన పెట్టిన సంస్థ
ఇటీవల సిస్కో బృందంతో లోకేశ్ వద్దకు రవీంద్ర
గతంలో టీడీపీ నేతలపై దూషణలు చేసిన ఇప్పాల
విషయం తెలిసి సీరియస్ అయిన లోకేశ్ 11
సిస్కో యాజమాన్యానికి మంత్రి ఓఎస్డీ లేఖ

ఇది నారా వారి ఊరు



సీఎం సొంతూరులో సర్వతోముఖాభివృద్ధి

అదొక మారుమూల పల్లెటూరు..! కానీ అక్కడి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు ఐఐటీ మద్రాసు నిపుణులు ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నారు. ఆ పల్లెలోని దుకాణాలకు ఈజీ మార్ట్ సరుకులు చేరవేస్తోంది. కోరుకున్న రంగంలో యువతకు శిక్షణ.. ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెళ్లు.. గడపగడపకూ తాగునీరు, వంట గ్యాస్.. ఎటుచూసినా సిమెంటు, తారు రోడ్లు.. ఎక్కడికి వెళ్లాలన్నా కాలుష్య రహిత ఎలక్ట్రిక్ ఆటోలు... వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగుల కోసం కామన్ వర్క్ సెంటర్, విద్యార్థుల కోసం స్టడీ సెంటర్... ఇలా ప్రతి రంగంలోనూ అభివృద్ధికి చిరునామాగా మారుతున్న ఆ మారుమూల ప్రాంతం స్వర్ణయుగం దిశగా అడుగులు వేస్తోంది. అదే.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని సీఎం చంద్రబాబు జన్మస్థలమైన నారావారిపల్లి. సీఎం ఇప్పుడు స్వగ్రామ సర్వతోముఖాభివృద్ధిపై దృష్టి సారించారు. దీంతో నారావారిపల్లి రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి.

6

జడ్పీ హైస్కూలులో ఐఐటీ మద్రాసు పాఠాలు
యువతకు నచ్చిన అంశాల్లో నైపుణ్య శిక్షణ
పల్లెలో ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్
గడపగడపకూ తాగునీరు, వంట గ్యాస్
ఈజీమార్ట్‌తో పల్లె దుకాణాల ఒప్పందం
వర్క్ ఫ్రమ్ హోమ్ కోసం కామన్ వర్క్‌స్టేషన్
స్వర్ణయుగం దిశగా నారావారిపల్లి అడుగులు



నారావారిపల్లిలో ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు

దంతెవాడలో ఎన్‌కౌంటర్ 2



మహిళా మావోయిస్టు రేణుక మృతి
ఆమె శాఖమూరి అప్పారావు భార్య.. 45 లక్షల రివార్డు

సీబీజీ ప్లాంటుకు 'తొలి' అడుగు 11

రేపు కనిగిరిలో లోకేశ్, అనంత్ అంబానీ శంకుస్థాపన
రాష్ట్రవ్యాప్తంగా 500 సీబీజీ ప్లాంట్లు: గొట్టిపాటి

నేడు టెన్త్ సోషల్ యథాతథం 12

దంతెవాడలో ఎన్‌కౌంటర్

» మహిళా మావోయిస్టు రేణుక మృతి

» ఆమె దివంగత మావోయిస్టు శాఖమూరి అప్పారావు భార్య

జనగామ, చర్ల, చింతూరు, అల్వాల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దు అడవుల్లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన మహిళా మావోయిస్టు గుమ్మడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ చైతే అలియాస్ సరస్వతి అలియాస్ దమయంతి మృతి చెందారు. దివంగత కేంద్ర కమిటీ సభ్యుడు శాఖమూరి అప్పారావు భార్య, మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ సభ్యురాలైన రేణుకపై తెలంగాణలో రూ.20 లక్షలు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.25 లక్షల రివార్డులు ఉన్నాయి. బీజాపూర్, దంతెవాడ సరిహద్దులోని ఇకేలీ బెలీనార్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో బలగాలు సోమవారం కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య రెండు గంటల పాటు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో రేణుక మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఇన్సాస్ రైఫిల్, పేలుడు పదార్థాలు, ల్యాప్‌టాప్, ఇతర వస్తువులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కాగా, జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన రేణుక ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన తర్వాత 1996లో మావోయిస్టు పార్టీలో చేరారు. మంగళవారం ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురానున్నారు.


దైవదర్శనానికి వచ్చిన వివాహితపై గ్యాంగ్‌రేప్!

» ఆమె బంధువును చెట్టుకు కట్టేసి ఏడుగురి అత్యాచారం

నాగర్‌కర్నూల్/ఊర్కొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఓ వివాహితపై ఏడుగురు సామూహిక అత్యాచారం జరిపిన దారుణ ఘటన ఇది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలానికి చెందిన వివాహితకు ముగ్గురు పిల్లలు. భర్తతో విభేదాల కారణంగా కొన్నాళ్లుగా అతడికి దూరంగా ఉంటోంది. శనివారం రాత్రి తన బంధువుతో కలిసి ఊర్కొండపేటలోని ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చింది. దర్శనం అయ్యాక ఇద్దరూ చెట్టు కింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఆ ఆలయంలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగి... అతడి ఆరుగురు స్నేహితులు కలిసి.. బంధువును చెట్టుకు కట్టేసి.. ఆమెను పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం జరిపారు. ఘటనపై బాధితురాలు సోమవారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

సెప్టెంబర్‌లో మోదీ రిటైర్మెంట్!!

» ఆయన టైం అయిపోయింది: సంజయ్ రౌత్



నాగపూర్/ముంబై, మార్చి 31: ప్రధాని మోదీ సెప్టెంబర్లో పదవీవిరమణ చేయనున్నారని ఉద్ధవ్ శివసేన సీనియర్ నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సంఘ్ పరివార్ దేశంలో నాయకత్వ మార్పు కోరుకుంటోందని.. రిటైర్మెంట్ ప్రణాళికలు, తన వారసుడెవరో చర్చించడానికే మోదీ ఉగాదినాడు నాగపూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారని సోమవారం ముంబైలో విలేకరులతో అన్నారు. 75 ఏళ్ల వయసు దాటిన బీజేపీ నేతలు పదవీ విరమణ చేస్తున్నారని.. సెప్టెంబర్లో మోదీకి కూడా 75 ఏళ్లు వస్తాయని గుర్తుచేశారు. గత 10-11 ఏళ్లలో ఆయన ఇక్కడకు రాలేదని.. ఇప్పుడు సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్‌కు టాటా, బైబై చెప్పడానికే వచ్చారని వ్యాఖ్యానించారు. 'మోదీ టైం అయిపోయింది. ఆయన వారసుడు మహారాష్ట్ర నుంచే ఉంటారు' అని రౌత్ తెలిపారు. అయితే, రౌత్ వ్యాఖ్యలను మహారాష్ట్ర సీఎం, బీజేపీ సీనియర్ నేత ఫడణవీస్ తోసిపుచ్చారు. 2029లోనూ ప్రధాని మోదీయేనన్నారు.

వేతనజీవులకు
పన్ను ఉపశమనం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తంగా రూ.12.75 లక్షల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. కొత్త పన్ను విధానంలో శ్లాబులను కూడా సవరించారు. ఈ ప్రకటనలు వేతన జీవులకు భారీ ఊరటను కల్పించాయి. కొత్త పన్ను విధానంలో సెక్షన్ 87ఏ కింద లభించే పన్ను రిబేటును రూ.25 వేల నుంచి రూ.60 వేలకు పెంచారు. ఏప్రిల్ 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి.

టీడీఎస్, టీసీఎస్‌ల్లో మార్పులు..

బ్యాంకు ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను చెల్లించేవారికి ఊరట కల్పిస్తూ ఏప్రిల్ 1 నుంచి టీడీఎస్ పరిమితిని ప్రభుత్వం పెంచింది. సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ వర్తింపు పరిమితి రూ.లక్షకు పెరగనుంది. దీంతో వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష దాటితే టీడీఎస్ వర్తిస్తుంది. 60 ఏళ్ల లోపు వారికి రూ.40 వేల నుంచి రూ.50వేలకు పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) పరిమితి కూడా పెరగనుంది. ఇది విదేశీ ప్రయాణాలు, పెట్టుబడులు, ఇతర లావాదేవీలను ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం రూ.7 లక్షలకు పైగా విదేశాలకు పంపే సొమ్ము పై ఏ అవసరం కోసం పంపుతున్నారన్న ఆధారంగా 0.5 శాతం నుంచి 20 శాతం వరకు టీసీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి ఈ పరిమితి రూ.10 లక్షలకు పెరగనుంది.

నూతన పెన్షన్ స్కీమ్..

పాత పెన్షన్ స్కీమ్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమల్లోకి రానుంది. ఇది దాదాపు 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను ప్రభావితం చేయనుంది. కనీసం 25 ఏళ్ల సర్వీసు ఉన్న ఉద్యోగులు చివరి 12 నెలల సగటు బేసిక్ వేతనంలో 50 శాతానికి సమానంగా పెన్షన్‌ను పొందడానికి అవకాశం ఉంటుంది.

వినియోగంలోలేని నంబర్లకు యూపీఐ సేవల నిలిపివేత

యూపీఐ లావాదేవీలకు కొత్త భద్రతా చర్యలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అమల్లోకి తెస్తోంది. ఇందులో భాగంగా వినియోగంలోలేని నంబర్లకు అనుసంధానమైన యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఫోన్ నంబర్లు చాలా కాలం పాటు పని చేయకుండా ఇనాక్టివ్‌గా ఉంటే వాటికి అనుసంధానంగా ఉన్న గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్స్ సేవలు రద్దు కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తుంది. ఇనాక్టివ్ ఫోన్ నంబర్లతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇనాక్టివ్ నంబర్లను బ్యాంకులు, థర్డ్ పార్టీ యూపీఐ ప్రొవైడర్లయిన ఫోన్ పే, గూగుల్ పేలు తప్పనిసరిగా తొలగించాల్సి ఉంటుంది. యూపీఐ లైట్‌లోని బ్యాలెన్స్‌ను తిరిగి బ్యాంక్ ఖాతాకు బదిలీచేసుకునే సదుపాయం కూడా ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వస్తుంది.

ఎన్‌పీఎస్ వాత్సల్యకు పన్ను ప్రయోజనాలు

పిల్లల భవిష్యత్తు దృష్ట్యా దీర్ఘకాలం పెట్టుబడి పెట్టే వారి కోసం తెచ్చిన ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం కింద 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు పొందడానికి అవకాశం ఉంది. సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50వేల పన్ను ప్రయోజనాలు కల్పించారు. పాత పన్ను విధానంలో పన్ను చెల్లించే వారు దీన్ని వినియోగించుకోవచ్చు. కొత్త పన్ను విధానంలో ఈ మినహాయింపు ఉండదు.

బ్యాంకుల్లో కనీస నిల్వ...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ), కెనరా బ్యాంకు సహా ప్రధాన బ్యాంకులు ఏప్రిల్ 1 నుంచి ఖాతాల్లో కనీసంగా ఉండాల్సిన నిల్వను సవరించనున్నాయి. కస్టమర్లు తమ ఖాతాలో కనీస నిల్వను ఉంచని పక్షంలో అందుకు పెనాల్టీలను చెల్లించాల్సి ఉంటుంది.

మయన్మార్‌పై మరో పిడుగు!

» నేటి నుంచి భారీ వర్షాలు

» భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఇక్కట్లే

» సహాయక చర్యలకూ ఆటంకాలు



సైౖవిల్లా భవన శిథిలాల నుంచి గర్భిణిని కాపాడుతున్న సహాయక బృందాలు

నేపిదా(మయన్మార్), మార్చి 31: భూప్రకోపానికి గురైన మయన్మార్‌పై ఇప్పుడు మరో పిడుగు పడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.. బంగాళాఖాతంలో గల్ఫ్ ఆఫ్ మర్తబాన్‌కు సమీపంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా.. ఏప్రిల్ 1 నుంచి మయన్మార్ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. ఇప్పటికే భూకంపం ప్రభావం దేశవ్యాప్తంగా ఉండడం.. 60-70% ఇళ్లు, ఆస్పత్రులు, ప్రార్థన మందిరాలు, మఠాలు దెబ్బతినగా.. పునరావాస కేంద్రాలు లేక.. పౌరులు ఆరుబయటే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే.. భూకంప బాధితుల పరిస్థితి గోరుచుట్టుపై రోకటిపోటుగా మారే ప్రమాదముందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సహాయక చర్యలకు కూడా భారీ వర్షాలు ఆటంకంగా మారే ప్రమాదముంది. భూకంప ప్రభావిత ప్రాంతాలైన ముయి, ఖోట్సాంగ్ మినహా.. సికాయ్, మాంటాలే, నాంగ్, పఖో, షామ్ ప్రావిన్సుల్లో సోమవారం సాయంత్రం నుంచే వర్షాల ప్రభావం మొదలైందని మయన్మార్ విపత్తు నిర్వహణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏప్రిల్ 4-6 తేదీల్లోనూ మరో అల్పపీడన సూచన ఉందని, అప్పుడు గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ నుంచి గల్ఫ్ ఆఫ్ మర్తబాన్ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలుంటాయని మయన్మార్ వాతావరణ విభాగం అధికారి ఓవెన్ నై హెచ్చరించారు.

సహాయానికి.. మిలటరీ అడ్డంకులు

భూకంప విధ్వంసం కవరేజీకి వచ్చే అంతర్జాతీయ మీడియాను నిషేధిస్తూ మయన్మార్ మిలటరీ సర్కారు(సైనిక మండలి) ప్రతినిధి జనరల్ ఝావో మ్యుంగ్‌థాంగ్ ఉత్తర్వులు జారీ జారీచేశారు. పలు అంతర్జాతీయ మీడియా సంస్థల నుంచి మిలటరీ ప్రభుత్వానికి అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. విదేశీ మీడియా ప్రతినిధులకు ప్రస్తుతం సౌకర్యవంతమైన వసతులు లేవని, దాంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. కాగా.. రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించిన మిలటరీ సర్కారు.. రెబల్స్ ప్రాంతాల్లో వైమానిక దాడులను యథావిధిగా కొనసాగిస్తోంది. హెలికాప్టర్లు, డ్రోన్లతో జరిపిన దాడుల్లో పదుల సంఖ్యలో రెబల్స్ చనిపోయారని థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేస్తున్న మయన్మార్ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. ఆస్పత్రులన్నీ భూకంప బాధితులతో నిండిపోగా.. మిలటరీ సర్కారు ఆంక్షలను విధిస్తోందని.. ఈ విధానం సరికాదంటూ ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆగ్రహం వ్యక్తం చేసింది. సహాయక బృందాలను అడ్డుకోవొద్దని కోరింది.

మసీదుల్లో 700 మంది మృతి

భూకంపం సంభవించిన రోజు రంజాన్ మాసంలో చివరి శుక్రవారం(జుమాతుల్‌విదా) కావడంతో ముస్లింలు పెద్ద సంఖ్యలో మసీదులకు వెళ్లారు. భూకంపం కారణంగా దేశంలోని 60కి పైగా మసీదులు కూలిపోగా.. వాటిల్లో ప్రార్థనలు చేస్తున్న 700 మంది మృతిచెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క రభై మసీదులోనే 59 మంది మృతిచెందారని తెలిపింది.

మృత్యువుతో గర్భిణి పోరాటం

సైౖవిల్లాలో భూకంప శిథిలాల కింద చిక్కుకున్న 29 ఏళ్ల ఓ గర్భిణి.. 12 గంటల పాటు మృత్యువుతో పోరాడింది. చైనా రెస్క్యూ బృందాలు ఈ ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టగా.. శనివారం రాత్రి ఆ గర్భిణి మూలుగు వినిపించడంతో జాగ్రత్తగా స్లాబును కట్ చేసి, ఆమెను కాపాడారు. మాండలేలోని 'గ్రేట్‌వాల్' హోటల్‌లో మరో గర్భిణిని మయన్మార్ అగ్నిమాపకశాఖ కాపాడింది. మరోవైపు, మాండలే సమీపంలోని బంగారు గనిలో 27 మృతదేహాలను వెలికి తీశామని పియర్స్ టౌన్‌షిప్ మిలటరీ కౌన్సిల్ అధికారులు చెప్పారు. భూకంప మరణాల సంఖ్య 3,034కు చేరుకుందని, థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేస్తున్న డెమోక్రాటిక్ వాయిస్ ఆఫ్ బర్మీస్(డీవీబీ) వెల్లడించింది.

ముగ్గురు మనవరాళ్లను కాపాడిన బామ్మ

మాండలేలోని 11అంతస్తుల సైౖవిల్లా భవనం ఆరో అంతస్తులో 75 ఏళ్ల వయసున్న ఓ బామ్మ తన కొడుకు, కోడలు, ముగ్గురు మనవరాళ్లతో ఉంటోంది. శుక్రవారం నాటి భూకంపంతో ఆ భవనం కుప్పకూలిపోయింది. ఆ సమయంలో బామ్మ, ఆమె మనవరాళ్లు మాత్రమే ఫ్లాట్‌లో ఉన్నారు. శిథిలాలు మీదపడి రక్తపు గాయాలైనా.. ఆ బామ్మ భయపడలేదు. బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఓ సుత్తి ఆమె చేతికి దొరికింది. దాన్ని మనవరాళ్లకు ఇచ్చి, గోడలను పగులగొట్టి.. బయటపడాలని సూచించింది. ఆ మనవరాళ్లు కష్టపడి ఓ రంధ్రం చేసి, బయటకు రాగలిగారు. అయితే.. ఆ రంధ్రం చిన్నదిగా ఉండడంతో బామ్మ మాత్రం బయటకు రాలేకపోయారు. అంతలో తదనంతర ప్రకంపనలతో శిథిలాలు మరింత కుంగాయి. అయితే.. బయటకు వచ్చిన ముగ్గురు మనవరాళ్లు సోమవారం రెస్క్యూ బృందాలను వెంట తీసుకొచ్చి, తమ బామ్మను కాపాడుకున్నారు.

బాంబులేస్తారా.. మేమూ తడాఖా చూపిస్తాం


» భూగర్భ కేంద్రాల వద్ద లాంచ్‌ప్యాడ్స్‌పై క్షిపణులను సర్వసన్నద్ధం చేశాం

» ట్రంప్‌కు ఖమేనీ ఘాటు హెచ్చరిక



న్యూఢిల్లీ, మార్చి 31: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇరాన్ ఘాటు హెచ్చరిక చేసింది. అణు ఒప్పందానికి ఇరాన్ దిగిరాకుంటే బాంబుల మోత మోగిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలను ఖండిస్తూనే.. ఏం జరిగినా ఎదురుదాడి చేసేందుకు, తమ తడాఖా చూపించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. "అణు ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే బాంబు దాడులు చేస్తాం. ఈ దాడులు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఉంటాయి." అని అమెరికా అధ్యక్షుడు ఆదివారం హెచ్చరించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇరాన్ కూడా అంతే తీవ్రంగా స్పందించింది. "అయితే... మేం కూడా సిద్ధంగా ఉన్నాం. మా తడాఖా చూపిస్తాం. ఎదురుదాడులు చేస్తాం. అమెరికా బాంబులు వేస్తే చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చోం. అన్ని భూగర్భ కేంద్రాల వద్ద లాంచ్ ప్యాడ్‌లపై క్షిపణులను సర్వసన్నద్ధం చేశాం. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాతో సంబంధం ఉన్న ఏ ఒక్క ప్రాంతాన్నీ వదిలి పెట్టబోం" అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ వ్యాఖ్యానించినట్టు ఇరాన్ మీడియా 'టెహ్రాన్ టైమ్స్' పేర్కొంది. అమెరికా కాలు దువ్వితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఖమేనీ హెచ్చరించినట్టు తెలిపింది. "ఎలాంటి వైమానిక దాడులనైనా తిప్పికొడతాం. అమెరికాతో సంబంధం ఉన్న ఏ ఒక్క ప్రాంతాన్నీ వదిలిపెట్టేది లేదు" అని ఖమేనీ అన్నట్టు 'టెహ్రాన్ టైమ్స్' వెల్లడించింది. మరోవైపు, అణు ఒప్పందంపై అమెరికాతో నేరుగా చర్చించేందుకు ఇరాన్ నూతన అధ్యక్షుడు పెజెష్కియాన్ విముఖత వ్యక్తం చేశారు. అయితే, ఒమన్ ద్వారా మధ్యవర్తిత్వ చర్చలు మాత్రం కొనసాగుతాయని ఆయన సంకేతాలు ఇచ్చారు.

లోకం తీరు



19 నుంచి శ్రీనగర్‌కు వందేభారత్ రైలు

న్యూఢిల్లీ, మార్చి 31: కశ్మీర్‌లోయలో పొడవైన సొరంగాలు, ఎత్తయిన బ్రిడ్జిలు, సొగసైన ప్రకృతి అందాల మధ్య రయ్..మని దూసుకుపోవడానికి వందే భారత్ రైళ్లు సిద్ధమవుతున్నాయి. కశ్మీర్‌ను నేరుగా దేశంలోని ఇతర రైల్వే లైన్లతో కలపడానికి రెడీ అవుతున్నాయి. ఉదంపూర్-కశ్మీర్-బారాముల్లా మధ్య 272 కి.మీ. రైల్ లింక్ ప్రాజెక్టు పూర్తయిన నేపథ్యంలో జమ్మూ-కట్రా-శ్రీనగర్ మధ్య వందే భారత్ రైలును నడపాలని నిర్ణయించారు. ఈనెల 19న ప్రధాని మోదీ కాట్రాలో ఆ రైలును ప్రారంభించనున్నారు. ప్రస్తుతం జమ్మూ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్న కారణంగా తొలుత కట్రా నుంచి ఈ రైలు సేవలు మొదలుకానున్నాయి. వందేభారత్ ప్రారంభమైతే కశ్మీర్‌కు నేరుగా రైలు నడపాలన్న డిమాండ్ నెరవేర్చినట్లు అవుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు!

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

ఎవర్నీ వదలం

(మొదటటి పేజీ తరవాయి)

మినహాయింపు ఇస్తారు? అనేది ఇపుడు అందరి మెదళ్లను తొలిచేస్తున్న ప్రశ్న. మన దేశమూ ఇందుకు మినహాయింపు కాదు. 'మోదీజీ మీతో ఎంత దోస్తానా ఉన్నా, మీరు కూడా మా వస్తువులపై సుంకాలు తగ్గించాల్సిందే. లేకపోతే మీ దేశ ఉత్పత్తులపైనా అదే స్థాయిలో సుంకాలు తప్పవు' అని ట్రంప్..ప్రధాని నరేంద్ర మోదీకి ఇప్పటికే స్పష్టం చేశారు. దాంతో ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపులకు సిద్ధమైంది. అందులో భాగంగానే గూగుల్, ఫేస్‌బుక్ వంటి ఆన్‌లైన్ యాడ్స్‌పై విధిస్తున్న 6 శాతం ఈక్వలైజేషన్ ట్యాక్స్‌ను ఏప్రిల్ 1 నుంచి ఎత్తివేసింది.

నోరు మెదపని అమెరికా

అయినా ట్రంప్ సర్కారు నుంచి ఉలుకూ పలుకు లేదు. దీంతో ఏప్రిల్ 2న ప్రకటించే 'పరస్పర సుంకాల' దేశాల జాబితాలో మన దేశం పేరు ఉంటుందా? లేదా? అని అటు ప్రభుత్వం ఇటు పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ సుంకాలతో తీవ్రంగా నష్టపోతామని ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఆందోళన వ్యక్తం చేశాయి. వీలైనంత త్వరగా అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదుర్చుకుని తమను రక్షించాలని కోరాయి. లేకపోతే అమెరికా మార్కెట్లో పోటీపడడం మా వల్ల కాదని స్పష్టం చేశాయి. కొన్ని రంగాలు మాత్రం ఈ సుంకాలతో తమకు పెద్దగా వచ్చే ముప్పేమీ లేదని నింపాదిగా ఉన్నాయి. ఒకవేళ ట్రంప్ సర్కారు ఏప్రిల్ 2న అనుకున్న విధంగానే మన దేశంపైనా ప్రతీకార సుంకాలు విధిస్తే వివిధ రంగాలపై ఆ ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

అమెరికా ప్రాధాన్యత

మన అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా చాలా కీలకం. 2021-24 మధ్య కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే మన మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 18 శాతం, దిగుమతుల్లో 6.22 శాతం. గత ఆర్థిక సంవత్సరం రెండు దేశాల మధ్య 19,000 కోట్ల డాలర్ల విలువైన వస్తు ఎగుమతి, దిగుమతులు జరిగాయి. ఇందులో మన దేశానికి దాదాపు 4,500 కోట్ల డాలర్ల మిగులు ఉంది. ట్రంప్ సుంకాలతో ఈ మిగులుకు ఎక్కడ గండి పడుతుందోనని ప్రభుత్వం భయపడుతోంది.

వ్యవసాయం

వ్యవసాయ ఉత్పత్తులపైనా భారత్ సుంకాలు గణనీయంగా తగ్గించాలని ట్రంప్ సర్కారు కోరుతోంది. బీటీఏపై ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల్లోనూ ఇందుకోసం అమెరికా పట్టుబట్టినట్టు సమాచారం. ముఖ్యంగా గోధుమ, బియ్యం వంటి ఆహార ధాన్యాలతో పాటు పాడి ఉత్పత్తుల దిగుమతులపైనా భారత్ సుంకాలు తగ్గించాలని పట్టుబట్టింది. ప్రభుత్వం ఇందుకు ససేమిరా అనడంతో కనీసం తమ దేశం నుంచి దిగుమతయ్యే యాపిల్స్, బాదం, పిస్తా వంటి ఉత్పత్తులపైనైనా తగ్గించాలని కోరింది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఒక మెట్టు దిగి గోధుమ, బియ్యం, పాడి ఉత్పత్తులపై తప్ప మిగతా వాటిపై సుంకాల ఎత్తివేత లేదా కనీస స్థాయికి తగ్గించేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

మత్స్య పరిశ్రమ

భారత మత్స్య పరిశ్రమకు అమెరికా పెద్ద మార్కెట్. ముఖ్యంగా రొయ్యలు, ప్రాసెస్ చేసిన ఇతర మత్స్య ఉత్పత్తులు మన దేశం నుంచి ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. ఇప్పుడు అమెరికా ఈ దిగుమతులను జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మనం మాత్రం అమెరికా మత్స్య దిగుమతులపై 30 శాతం సుంకం విధిస్తున్నాం. ప్రతీకార సుంకాలు అమల్లోకి వస్తే అమెరికా మార్కెట్లో మన ఎగుమతులపైనా 30 శాతం డ్యూటీ పడుతుంది. అప్పుడు అక్కడ మన ఎగుమతులు ఈక్వెడార్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాలతో పోటీపడడం కష్టమని ఆక్వా పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మన దేశం అమెరికా మత్స్య దిగుమతులపై సుంకాన్ని జీరోకి తగ్గించినా.. ఉత్పత్తి ఖర్చులు కారణంగా అమెరికా మత్స్య ఉత్పత్తులు మన పరిశ్రమకు ఎలాంటి నష్టం కలిగించలేవని పరిశ్రమవర్గాలు ప్రభుత్వాన్ని కోరాయి.

ప్రస్తుత సుంకాలు

ప్రస్తుతం మన ఎగుమతులపై అమెరికా సగటున 2.8 శాతం చొప్పున సుంకాలు విధిస్తోంది. మనం మాత్రం అమెరికా దిగుమతులపై సగటున 7.7 శాతం చొప్పున సుంకాలు విధిస్తున్నాం. రంగాల వారీగా చూస్తే ప్రస్తుతం మన దేశం సగటున అమెరికా పారిశ్రామిక దిగుమతులపై 5.9 శాతం చొప్పున, వ్యవసాయ దిగుమతులపై 37.7 శాతం చొప్పున సుంకాలు విధిస్తోంది. అమెరికా మాత్రం సగటున మన పారిశ్రామిక ఉత్పత్తులపై 2.6 శాతం, వ్యవసాయ ఉత్పత్తులపై 5.3 శాతం చొప్పున సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు ట్రంప్ ఈ లోటు పూడ్చేందుకు అన్ని భారత ఎగుమతులపై మన స్థాయిలోనే సుంకాలు విధిస్తే మనకు తీవ్ర నష్టం తప్పదని పారిశ్రామిక వర్గాల ఆందోళన.

ఫార్మా రంగం

ట్రంప్ ప్రతీకార సుంకాలతో నష్టపోయే రంగాల్లో ఫార్మా ఒకటి. ప్రస్తుతం అమెరికాలో అమ్మే జెనరిక్ ఔషధాల్లో 40 శాతం మన దేశ కంపెనీల నుంచే సరఫరా అవుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్, సిప్లా, నాట్కో వంటి హేమా హేమీ కంపెనీలకు కూడా అమెరికానే ప్రధాన మార్కెట్. ప్రస్తుతం ఈ దిగుమతులను అమెరికా జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మనం మాత్రం అమెరికా ఔషధ దిగుమతులపై 10 శాతం వరకు దిగుమతి సుంకం విధిస్తున్నాం. మన కంపెనీలు ఎగుమతి చేసే జెనరిక్ ఔషధాలపై లాభాలు చాలా తక్కువ. ట్రంప్ అన్నంత పని చేస్తే ఏప్రిల్ 1 నుంచి మన ఎగుమతులపైనా అమెరికాలో 10 శాతం డ్యూటీ అమల్లోకి వస్తుంది.

ఇంకా సస్పెన్స్

మరోవైపు ట్రంప్ ఏప్రిల్ 2న ప్రతీకార సుంకాల దేశాల జాబితా ప్రకటిస్తారా? లేక వాయిదా వేస్తారా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. కొత్త పెట్టుబడులు వచ్చి దేశీయ ఉత్పత్తి పెరగడం దేవుడెరుగు. ముందు ఈ సుంకాలతో అమెరికాలో వస్తు, సేవల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం కొండెక్కే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో వివిత్ర దేశాలకు మాత్రం కొద్దిగా విరామం ఇచ్చి చైనాపై మాత్రం భారీగా సుంకాల భారం మోపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

- (ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్)

వివాహ బంధంపై కత్తి!

వివాహేతర సంబంధాలు, క్షణికావేశంలో జీవిత భాగస్వాముల హత్యలు

» ఇలా భారత్‌లో ఏటా 275 మంది భర్తలు, 225 మంది భార్యల మరణాలు

» ఐక్యరాజ్య సమితి అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 31: భార్యాభర్తల మధ్య జగడాలు, గిల్లికజ్జాలు మామూలే. టీవీలో ప్రోగ్రామ్ చూడటం దగ్గర నుంచి రిమోట్ కంట్రోల్, మొబైల్ ఫోన్, సోషల్ మీడియా వరకు.. చిన్న పెద్ద విషయాలకు దంపతులు గొడవ పడుతూనే ఉంటాయి. కానీ, భార్యభర్తల మధ్య పొరపొచ్చాలు ఇటీవలికాలంలో అత్యంత అపాయకర వైషమ్యాలుగా రూపుదాల్చి.. చివరకు హత్యలకు సైతం దారితీస్తున్న తీరు తీవ్ర కలవరం కలిగిస్తోంది. వివాహ బంధం గతంలో ఎన్నడూ లేనంతగా నెత్తురోడటం ఈ రోజున ప్రపంచవ్యాప్త ధోరణిగా మారింది. అదీ అత్యంత దారుణంగా, క్రూరమైన పద్ధతుల్లో ఈ హత్యలు జరుగుతున్నాయి. ఈ ధోరణుల పట్ల ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వెలిబుచ్చింది. భారతదేశంలో ఏటా 275 మంది భర్తలు, 225 మంది భార్యలు వేర్వేరు ఘటనల్లో జీవిత భాగస్వాముల చేతుల్లో హతమవుతున్నారని ఐరాస అధ్యయనం తేల్చింది. ప్రస్తుతం మన దేశ జనాభా 140 కోట్లు. ఇంత జనాభా ఉన్న చోట ఎన్నెన్నో నేరాలు జరుగుతుంటాయి. అందులో కొన్ని ఘటనలు ప్రత్యేకంగా ప్రజల దృష్టిని తమ వైపు తిప్పుకొంటాయి. ఈ జాబితాలో భార్యాభర్తల పరస్పర హత్యాకాండలు చేరడం భయాందోళనలకు గురి చేస్తున్నదని ఐరాస వ్యాఖ్యానించింది. ఐరాస నివేదికను అనుసరించి.. 2023లో ప్రపంచవ్యాప్తంగా యాభై వేలమంది మహిళలు, ఆడపిల్లలు కడతేరారు. ఇందులో 60% కేసుల్లో వారిని భర్తలు, సహచరులు లేక కుటుంబసభ్యులే హతమార్చారు. సహ భాగస్వామిని చంపిన తర్వాత మృతదేహాలను డ్రమ్ముల్లోనూ, ఫ్రిజ్‌ల్లోనూ, సూట్‌కేసుల్లోనూ, భూమి అడుగున, మంచం కింద దాచేస్తున్నారు. చాలా సందర్భాల్లో అవశేషాలను మాయం చేయడానికి మృతదేహాన్ని ముక్కలు చేసి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికిస్తున్నారు. కత్తించిన శరీర భాగాలను సూట్‌కేసుల్లో సర్ది మారుమూల, నిర్మానుష్య ప్రదేశాల్లోనూ, నీటి కుంటల్లోనూ పడేస్తున్నారు. దీంతో మీడియా ఇటువంటి ఘటనలను రిపోర్టు చేయడం ఒక సవాల్‌గా మారిందని ఐరాస అధ్యయనం తెలిపింది. ఇటీవలి నేరాల నుంచి ఇటువంటి ఉదాహరణలు కొన్ని ప్రస్తావించింది. తాను ప్రేమించిన అనురాగ్ అనే వ్యక్తి కోసం, తాను పెళ్లాడిన దిలీప్‌ను ప్రగతి అనే యువతి చంపించింది. వారి పెళ్లి జరిగిన 15 రోజులకే ఈ హత్య జరిగింది. వివాహానంతర హిందూ క్రతువులో భాగంగా తనకు లభించిన నగదును సుపారీగా ఇచ్చి ప్రగతి ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ కేసును ఐరాస తన అధ్యయనంలో ప్రస్తావించింది.

ప్రతి 11 నిమిషాలకు ఒక మహిళ బలి

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మహిళల, ఆడపిల్లల హత్యల గురించి ఐక్యరాజ్యసమితి అనుబంధ డ్రగ్స్ అండ్ క్రైమ్ విభాగం ఒక అధ్యయనం జరిపింది. ఇందులో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతి 11 నిమిషాలకు ఒక మహిళ హత్యకు గురవుతున్నట్టు గుర్తించింది. సగటున రోజుకు 140 మంది యువతులు, ఆడపిల్లలు ఇలా తమ గృహాల్లో కడతేరుతున్నారు. ఇవి 2023 లెక్కలు. 2022లో ఇటువంటి కేసులు ఆఫ్రికాలో అధికంగా నమోదయ్యాయి. అయితే, ఏడాది తిరిగేటప్పటికి ఆఫ్రికాను ఆసియా రెండోస్థానానికి నెట్టివేయడం గమనార్హం. 58 శాతం హత్యా ఘటనలు వివాహ బంధంతో ముడిపడి ఉండగా, అందులో 42 శాతం ఘటనల్లో పురుషులే బాధితులుగా ఉన్నారు. స్త్రీల విషయంలో కనిపించే లింగ వివక్ష కోణం భారత్‌లో జరుగుతున్న నేరాల్లో పెద్దగా కనిపించడం లేదని ఐరాస వ్యాఖ్యానించింది.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ కృపాసాగర్

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ సోమవారం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు బాపట్ల జిల్లాలో సీఎం పర్యటన

» చినగంజాం మండలంలో పింఛన్ల పంపిణీ

బాపట్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారు. చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. షెడ్యూల్ ప్రకారం.. ఉదయం 11.10కి కొత్తగొల్లపాలేనికి హెలికాప్టర్‌లో రానున్న చంద్రబాబు 11.45కు ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12.25కు గ్రామంలో ఏర్పాటు చేసే స్టాళ్ల సందర్శన, ఇద్దరు దివ్యాంగులకు ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ చేపడతారు. 12.35కి గ్రామస్థులతో ప్రజావేదిక కార్యక్రమం, 2.15కు టీడీపీ క్యాడర్‌తో సమావేశం నిర్వహిస్తారు. తిరిగి సాయంత్రం 3.40కి హెలిప్యాడ్ వద్దకు రానున్న ఆయన 4.15కల్లా ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారు.



బియ్యం ఎగుమతులకు జెండా ఊపుతున్న తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి ఓడల ద్వారా తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఆ రాష్ట్ర జలవనరులు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కాకినాడ పోర్టులో జెండా ఊపి ప్రారంభించారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వానికి, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందం మేరకు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు అంగీకారం కుదిరినట్టు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమకుమార్ తెలిపారు. దానిలో భాగంగా తొలిసారి 12 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని(ఎంటీయూ 1010 రకం) కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి చేస్తున్నట్టు పేర్కొన్నారు. -కాకినాడ

శ్రీవారి దర్శన టోకెన్లు వృద్ధులకు ఆఫ్‌లైన్‌లోనూ..



దర్శనం కోసం దక్షిణ మాడవీధిలోని షెడ్‌లో వృద్ధులు, దివ్యాంగులు



» పాత విధానం పునరుద్ధరణకు టీటీడీ బోర్డు తీర్మానం
» త్వరలో అమలుకు అధికారుల ప్రణాళికలు
» పూర్వపు పద్ధతిలోనే వీఐపీ బ్రేక్!
» ఉదయం 5.30గంటలకు మార్చాలని టీటీడీ నిర్ణయం
» సాధ్యాసాధ్యాలపై ఈవారంలోనే ట్రయల్ రన్

తిరుమల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరుడి దర్శనం విషయంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు తొలగించేలా టీటీడీ నిర్ణయం తీసుకుంది. వీరికి జారీచేసే దర్శన టోకెన్లను ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం చేసిన గత అధికారుల నిర్ణయాన్ని మారుస్తూ బోర్డు తాజాగా తీర్మానం చేసింది. పాత ఆఫ్‌లైన్ విధానాన్ని కూడా పునరుద్ధరించాలని నిర్ణయించింది. దీంతో నాలుగేళ్ల తర్వాత ఆఫ్‌లైన్ టోకెన్ల ద్వారా కూడా దర్శన భాగ్యం లభించనుంది. 65 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులతో పాటు శారీరక, మానసిక వైకల్యం.. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న భక్తులకు టీటీడీ కొవిడ్ ముందు వరకు రోజుకు 1,400 మందికి దర్శనం చేయించేది. తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఎదురుగా ఉండే కౌంటర్ల ద్వారా ఉదయం 10 గంటల స్లాటుకు 700 మందికి, మధ్యాహ్నం 3 గంటలకు 700 మందికి కరెంట్ బుకింగ్ ద్వారా టోకెన్లు ఇచ్చేవారు. కొవిడ్ నేపథ్యంలో ప్రత్యేక దర్శనాలతో పాటు ఈ విధానాన్ని కూడా టీటీడీ రద్దు చేసింది. కరోనా ప్రభావం తగ్గిన తర్వాత 2021 ఏప్రిల్ 9 నుంచి పునరుద్ధరించింది. అయితే టోకెన్ల కోసం భక్తులు భారీగా రావడం, కోటా పూర్తయిన తర్వాత నిరసన వ్యక్తం చేస్తుండడంతో కొవిడ్ సమయంలో గుంపులుగా ఉండటం సరికాదనే కారణంతో కరెంట్ బుకింగ్‌ను అప్పట్లో రద్దు చేశారు. అప్పటి నుంచి రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ల తరహాలో ఈ టోకెన్లను ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాలనే నిబంధన పెట్టారు. ఉదయం 10 గంటల స్లాట్‌ను రద్దు చేసి, మధ్యాహ్నం 3 గంటల స్లాట్‌కు మాత్రమే వెయ్యి టోకెన్లు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి దర్శన టికెట్లు, టోకెన్లు లేకుండా తిరుమలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు సర్వదర్శనం క్యూలైన్‌లోకి వెళ్లే ధైర్యం చేయలేక తిరిగి వెళ్లిపోతున్నారు. పలు మార్లు సిబ్బందితో వాగ్వాదానికి దిగిన సందర్భాలూ ఉన్నాయి.

3 నెలల తర్వాత ఆఫ్‌లైన్ విధానం

ప్రభుత్వం మారిన తర్వాత వచ్చిన అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించారు. వృద్ధులు, దివ్యాంగులు సాధారణ భక్తులతో కలిసి దర్శనానికి వెళ్లడం సరికాదని, చాలా మందికి ఆన్‌లైన్ బుకింగ్ తెలియదని గ్రహించారు. ఆఫ్‌లైన్‌లోనూ టోకెన్లు జారీ చేయాలని గత నెల 24న జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానించారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఆదేశించారు. కాగా, రానున్న 3 నెలలకు సీనియర్ సిటిజన్ల టోకెన్ల జారీప్రక్రియ ఆన్‌లైన్‌లో పూర్తయింది. ఆ తర్వాత ఆఫ్‌లైన్ విధానం అమలు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రోజుకు ఎన్ని టోకెన్లు ఇవ్వాలి, ఏ సమయంలో ఇవ్వాలి, ఎలాంటి నిబంధనలు ఉండాలి?అనే అంశాలపై 2-3 వారాల్లో నిర్ణయించనున్నారు.

వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్పుపై వారాంతంలో ట్రయల్ రన్

తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాల సమయం మార్పుపై రానున్న శని, ఆదివారాల్లో టీటీడీ ట్రయల్ రన్ నిర్వహించనుంది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను మొదటి గంట అంటే ఉదయం 5.30 గంటలకు కేటాయించేవారు. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో వేచిఉండే భక్తులకు ఉదయం త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో వీఐపీ బ్రేక్‌ను ఉదయం 10.30 గంటలకు మార్చారు. ఈ విధానంపై పలువురు వీఐపీల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఉదయం కల్యాణోత్సవం, ఉదయం టైంస్లాట్‌లు కలిగిన రూ.300 ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కారణాలతో వీఐపీ బ్రేక్‌ను తిరిగి పూర్వపుపద్ధతిలో వేకువజాము 5.30 గంటలకే ప్రారంభించాలని టీటీడీ నిర్ణయించింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలనే బోర్డు ఆదేశం మేరకు టీటీడీ ఉన్నతాధికారులు ఆలయ అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగా రానున్న శని, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయానికి మార్చి ట్రయల్ రన్ నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 15 నుంచి జూన్ 30వ తేదీ వరకు సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది.

పూర్తిస్థాయి ప్రక్షాళన దిశగా..

» రేపు సీఎంతో టీటీడీ అధికారుల భేటీ
» గత ప్రభుత్వ నిర్ణయాలు, భక్తుల సౌకర్యాలపై సమీక్ష

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో పూర్తిస్థాయి ప్రక్షాళనతో పాటు అభివృద్ధి, భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై బుధవారం టీటీడీ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ కానున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో పాటు ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర ముఖ్య అధికారులు విజయవాడలో సీఎంతో సమావేశమై గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించనున్నారు. గతంలో హడావుడిగా, అనవసరంగా కోట్లాది రూపాయలతో నూతన భవన నిర్మాణాలు చేపట్టడం, తిరుమలలో అనధికారికంగా వెలసిన దుకాణాలు, టీటీడీలో ఇప్పటికీ పాతుకుపోయిన అధికారుల బదిలీలు, అధికారుల పనితీరుపై చర్చించనున్నారు. పవిత్రతను పెంచేలా చేపట్టాల్సిన చర్యలు, ఏఐ సహకారంతో దర్శన సమయం కుదింపుపై చర్చ జరగనుంది. ఇక, అన్యమతస్థులను వివిధ ప్రభుత్వ శాఖలకు బదిలీ చేస్తామని ఇప్పటికే టీటీడీతో పాటు ఇటీవల దర్శనంకోసం వచ్చిన సీఎం కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని కూడా సీఎంతో చర్చించనున్నారు. అన్నప్రసాదాల నాణ్యత పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం ఏర్పాటు చేయనున్న నూతన ట్రస్టు, అలిపిరిలో శ్రీవారి కొండల వెంబడి ఉన్న ప్రాంతాలను టెంపుల్ కారిడార్‌గా ఏర్పాటు చేయడంతో పాటు ఒబెరాయ్ హోటల్‌కు మరో ప్రాంతాన్ని కేటాయించడం, శ్రీవారి ఆస్తుల పరిరక్షణ, అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం వంటి వివిధ అంశాలపై చర్చించనున్నారు. తిరుమలలో భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనపైనా చర్చ జరగనుందని తెలిసింది.

రాజపాళయం పరకామణి ఘటనపై విచారణ: టీటీడీ ఈవో

చెన్నైలోని రాజపాళయం ఆలయ పరకామణిలో గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. విదేశీ కరెన్సీ లెక్క చెప్పకుండానే టీటీడీకి రికార్డులు పంపడంపై..'రాజపాళయం ఆలయ పరకామణిలో గోల్‌మాల్!' శీర్షికన మార్చి21న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో చర్చ జరిగింది. ఈవో శ్యామలరావు కూడా స్పందిస్తూ ఆరోపణలపై విచారణకు ఆదేశించామని, నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

బసవతారకం ట్రస్ట్ కేసులో లక్ష్మీపార్వతికి ఎదురుదెబ్బ

» విల్లును నిరూపించడంలో కోర్టు ప్రొసీజర్ పాటించలేదు
» 'సాక్షి' మరణిస్తే ఆధారమేదీ?
» నోటిమాటగా ఆయన కొడుకును సాక్షిగా పరిగణించ కూడదు
» తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యలు.. దిగువ కోర్టు ఆదేశాలు కొట్టివేత

హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 'బసవతారకం ట్రస్టు'కు తనను మేనేజింగ్ ట్రస్టీగా నియమించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో లక్ష్మీపార్వతికి ఎదురుదెబ్బ తగిలింది. 1995, నవంబరు 18న నందమూరి తారకరామారావు ఎగ్జిక్యూట్ చేసినట్లుగా పేర్కొంటున్న సప్లిమెంటరీ విల్లుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విల్లును నిరూపించే క్రమంలో సిటీ సివిల్ కోర్టు(దిగువ కోర్టు) చట్టం నిర్దేశించిన ప్రొసీజర్‌ను అనుసరించలేదని స్పష్టం చేసింది. సప్లిమెంటరీ విల్లుపై సాక్షి సంతకం చేసిన జె. వెంకటసుబ్బయ్య వారసుడు.. జేవీ ప్రసాద్‌రావును సాక్షి(పీడబ్ల్యూ-3)గా గుర్తిస్తూ దిగువ కోర్టు 2018లో ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టేసింది. విల్లుపై సాక్షి సంతకాలు చేసిన జె. వెంకటసుబ్బయ్య, వై తిరుపతిరావులకు సమన్లు ఇవ్వకుండా.. వారు ఇద్దరూ చనిపోయినట్లు ఎలాంటి ఆధారాలు లేకుండా వారి వారసులను సాక్షులుగా స్వీకరించడం చెల్లదని పేర్కొంది. విల్లుపై సాక్షి సంతకం చేసిన వెంకటసుబ్బయ్య మరణించినట్లు నోటి మాట ఆధారంగా ఆయన కుమారుడు జేవీ ప్రసాద్‌రావును పీడబ్ల్యూ-3గా గుర్తించడం చెల్లదని పేర్కొంది. 1995లో రామారావు రాసినట్లు పేర్కొంటున్న సప్లిమెంటరీ విల్లు ప్రకారం బసవతారకం ట్రస్టుకు తనను మేనేజింగ్ ట్రస్టీగా నియమించాలని 2009లో లక్ష్మీపార్వతి సిటీ సివిల్ కోర్టులో ట్రస్టు ఓపీ(పిటిషన్) దాఖలు చేశారు. సప్లిమెంటరీ విల్లులో సంతకం చేసిన వెంకట సుబ్బయ్య మరణించిన నేపథ్యంలో ఆయన కుమారుడు ప్రసాద్‌రావును విట్‌నెస్‌గా గుర్తించాలని పిటిషనర్ లక్ష్మీపార్వతి కోరారు. అలాగే, తన తండ్రి వెంకట సుబ్బయ్య మరణించారని.. రామారావు విల్లు రాసిన విషయం నిజమేనని, తన తండ్రి తనకు సమాచారం ఇచ్చారని జేవీ ప్రసాద్‌రావు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీంతో దిగువ కోర్టు పీడబ్ల్యూ-3గా ప్రసాద్‌రావును విచారించేందుకు అంగీకరించింది. అయితే.. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ.. బసవతారకం ట్రస్ట్, నందమూరి బాలకృష్ణ, నందమూరి హరికృష్ణలు 2019లో హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. జేవీ ప్రసాద్‌రావును విట్‌నెస్‌గా అంగీకరించడం చెల్లదని.. 2018లో దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి ధర్మాసనం విచారణ చేపట్టింది. "సప్లిమెంటరీ విల్లును నిరూపించే క్రమంలో చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించలేదు. విల్లుపై ప్రత్యక్షంగా సంతకాలు చేసిన ఇద్దరు సాక్షులకు అసలు సమన్లు జారీచేయలేదు. వారు ఎక్కడ ఉన్నారు? జీవించే ఉన్నారా? మరణించారా? మరణిస్తే డెత్ సర్టిఫికెట్ రికార్డుల్లోకి వచ్చిందా? అనే అంశాలు పరిశీలించలేదు. విల్లుపై సంతకాలు చేసిన ఇద్దరు సాక్షులు మణించారని కేవలం నోటి మాట ద్వారా చేసిన విజ్ఞప్తిని అంగీకరించి వారి వారసులను సాక్షులుగా గుర్తించడం చెల్లదు" అని పేర్కొంది.

నీరసంగా.. మగతగా ఉన్నారు!

» ప్రవీణ్ అని తెలియదు: ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు

విజయవాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తులో పోలీసులు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. విజయవాడలో నాలుగు గంటలు ఎక్కడున్నాడో తేలిపోవడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలో బైక్‌పై నుంచి కిందపడిన ప్రవీణ్‌ను పైకిలేపిన ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు సోమవారం మీడియాతో మాట్లాడారు. 24వ తేదీ సాయంత్ర జరిగిన పరిణామాలను వివరించారు. "ఆయన ఎవరో నాకు తెలియదు. నీరసంగా కనిపించారు. మగతగా ఉన్నారు. నేను ట్రాఫిక్ బూత్ వద్దకు తీసుకొచ్చాను. సమీపంలోని గార్డెన్‌లో ఆయన నిద్రపోయారు" అని తెలిపారు. రామవరప్పాడు రింగ్ వద్ద పాస్టర్ ప్రవీణ్ ఫొటోలను ఎస్ఐ సుబ్బారావు తీసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మాట్లాడుతూ బుల్లెట్‌పై వచ్చిన వ్యక్తి ప్రవీణ్‌కుమార్ అనే విషయం తనకు తెలియదని, తలపై హెల్మెట్, మూతికి నలుపు రంగు మాస్క్ ధరించి ఉన్నారని చెప్పారు. గార్డెన్‌లో నిద్రపోతున్న ఆయన్ను.. తాను డ్యూటీ దిగి వెళ్లిపోతున్న సమయంలో లేపానని వివరించారు. ముఖం కడుక్కున్న తర్వాత టీ తాగడానికి తీసుకెళ్లానని చెప్పారు. తర్వాత బుల్లెట్ హెడ్‌లైట్ ఊడిపోవడంతో.. టీస్టాల్‌లో పనిచేసే యువకుడిని పిలిచి, సరిచేయమని చెప్పానన్నారు. మగతగా ఉండడంతో రాత్రికి హోటల్‌లో బస చేసి వెళ్లమని సలహా ఇచ్చానని, అయినా ఆయన వెళ్లిపోయారని పేర్కొన్నారు. టీ స్టాల్‌లో పనిచేసే నాగార్జున అనే యువకుడు మాట్లాడుతూ దారంతో హెడ్‌లైట్ కట్టేందుకు ప్రయత్నించానని, అయితే అది ఆగకపోవడంతో ఇనుప తీగ తీసుకురావడానికి వెళ్లానని తెలిపారు. ఎస్ఐ సుబ్బారావు జీపులో తాడు ఉంటే తీసుకురావడానికి వెళ్లారని, ఇద్దరం తిరిగి వచ్చేటప్పటికీ ప్రవీణ్ ట్రాఫిక్ బూత్ వద్ద కనిపించలేదని తెలిపారు.

ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ తుమ్మల రామకృష్ణ మృతి



కుప్పం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ తెలుగు కథా రచయిత, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ(67) సోమవారం ఉదయం కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్‌లో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో సోమవారం ఉదయం మృతి చెందారు. తుమ్మల రామకృష్ణ స్వస్థలం చిత్తూరు జిల్లా సోమల మండలంలోని ఆవులపల్లె. ఎస్వీ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేసిన ఆయన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆచార్యునిగా చేసి పదవీ విరమణ చేశారు. 2020లో ద్రవిడ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులయ్యారు. 2023 నవంబరు దాకా ఈ పదవిలో ఉన్నారు. బహుజన జీవితాన్ని కథలుగా రాశారు. 'మట్టి పొయ్యి' పేరుతో వెలువడ్డ ఆయన కథల సంపుటి తెలుగు సాహిత్యంలో మంచి స్థానం పొందింది. తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటూ మరాఠీ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి ఆయన కథలు అనువాదం అయ్యాయి. ఆయన సాహిత్య వ్యాసాలు రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. తుమ్మల రామకృష్ణ సాహిత్య ప్రస్థానంపై పలువురు రచయితల వ్యాసాలతో 'సీమ సంతకం' అనే సంకలనం ప్రకటితమైంది. తుమ్మల రామకృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హైదరాబాదు లింగపల్లిలోని స్వగృహం వద్ద మంగళవారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.

పేదల ఇళ్లకు రూ.439.5 కోట్ల అదనపు నిధులు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల గృహ నిర్మాణానికి రుణ ప్రాతిపదికన రూ.439.5 కోట్ల అదనపు నిధుల విడుదలకు పరిపాలనాపరమైన అనుమతినిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని డ్రా చేయడానికి గృహ నిర్మాణశాఖ కమిషనర్‌కు అధికారం ఉందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

దండకారణ్యంలో మారణకాండను నిలిపివేయాలి

» సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి
» పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్

నరసరావుపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో జరుగుతున్న మారణకాండను వెంటనే నిలిపివేయాలని, దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నరసరావుపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసులను, మావోయిస్టులను హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలల పసిపిల్లల నుంచి యువకులను, మహిళలను కాల్చి చంపడం, 2026 మార్చి 31 నాటికి అందరినీ నిర్మూలిస్తామని బహిరంగ ప్రకటన చేస్తూ సవాల్ విసరటం చట్టబద్ధం కాదన్నారు. ఈశాన్య రాష్ట్రాలలో ఉన్న మిలిటెంట్ సంస్థలతో కాల్పుల విరమణ ఒప్పందాలు చేసుకొని, వారి సమస్యలు పరిష్కారిస్తామని ప్రకటిస్తున్న పాలకులు మావోయిస్టులు, ఆదివాసుల విషయంలో... వారిని నిర్మూలించడమే తమ లక్ష్యం అనటంలోనే దుర్బుద్ధి కనిపిస్తోందన్నారు.



కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో సోమవారం సంప్రదాయ 'పిడకల సమరం' హోరాహోరీగా జరిగింది. ఈ సమరంలో సుమారు 45 మందికి స్వల్ప గాయాలయ్యాయి. భద్రకాళి, వీరభద్రస్వామి ప్రేమాయణంలో తలెత్తిన వివాదానికి గుర్తుగా ఇది జరుపుకొంటారు. - ఆస్పరి

నాటి నిర్లక్ష్యానికి నేడు మూల్యం!

'రాజధాని' పునర్నిర్మాణంలో సవాళ్లెన్నో..

» జంగిల్ క్లియరెన్స్.. నీటి తోడకం పనులకు భారీ వ్యయం
» దెబ్బతిన్న పైపుల తొలగింపు ప్రక్రియ
» 9 కి.మీ. మేర తిరిగి పైపులు వేయడానికి రెట్టింపు ఖర్చు



తొలగించిన పైపులను ఒకచోటకు చేర్చుతున్న పొక్లెయినర్లు

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి విషయంలో గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యానికి ప్రస్తుత ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వమేదైనప్పటికీ చెల్లించే డబ్బు ప్రజాధనం కావడమే ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే రాజధాని పరిధిలో జంగిల్ క్లియరెన్స్, సచివాలయ, ఐకానిక్ భవనాల వద్ద నీటి తొలగింపు పనులకు కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు పైపులైను తొలగింపు పనులపై కూడా కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

వైసీపీ సర్కార్ నిర్లక్ష్యం!

2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేపట్టింది. దాదాపు 10వేల కోట్ల మేర ఖర్చు చేసి ప్రభుత్వ భవనాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పన చేసింది. ఆ క్రమంలోనే రాజధాని పరిధిలో రహదారులు, అంతర్గత పైపులైను పనులు చేపట్టింది. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను పూర్తిగా పక్కనపెట్టేసి, నిర్లక్ష్యంగా వదిలివేసింది. దీంతో రాజధాని మొత్తం అడవిలా మారిపోయింది. ఆ అడవి కంప చెట్లను తొలగించడానికి ప్రభుత్వం అక్షరాల రూ.36.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. అమరావతిలో ఐకానిక్ టవర్లుగా చెప్పుకుంటున్న సచివాలయ భవన సముదాయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలను పట్టించుకోకపోవడంతో వాటి పునాదుల్లో నీరు చేరింది. ఐదేళ్లపాటు 18 అడుగుల లోతు మేర నీటిలో మునిగి ఉన్న నిర్మాణాలు పనికి వస్తాయో.. లేదో తెలుసుకోవడానికి నిపుణుల అధ్యయనాలు, పునాదుల్లో చేరిన నీటిని తొలగించడం కోసం కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. అవి రెండూ పూర్తవగానే పైపులైన్ల సమస్య తెరమీదకు వచ్చింది.

9 కి.మీ మేర దెబ్బతిన్న పైపులు

రాజధాని నిర్మాణంలో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం భూగర్భ పైపులైను నిర్మాణం చేపట్టింది. గడచిన ఐదేళ్లలో వాటిని కూడా వైసీపీ సర్కారు పట్టించుకోకుండా వదిలేయడంతో నిర్వహణ కొరవడి పైపులు దెబ్బతిన్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి వెలగపూడి, ఐనవోలు వరకూ వేసిన 9 కి.మీ. మేర పైపులైను దెబ్బతింది. అత్యంత కీలకమైన పైపులైను దెబ్బతినడంతో దాన్ని తొలగించి, తిరిగి పైపులైను వేయాల్సిన పరిస్థితి రావడంతో ఖర్చు రెట్టింపయింది. దీనికి సంబంధించి కాంట్రాక్టు తీసుకున్న బీఎస్ఆర్ సంస్థ పది రోజులుగా ముమ్మరంగా పనులు నిర్వహిస్తోంది.

రుణం ఇవ్వలేదని బ్యాంకుకే కన్నం వేశాడు

» ఎస్‌బీఐలో చోరీ కేసులో ఆరుగురు అరెస్టు
» బావిలో 17 కేజీల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

బెంగళూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రుణం అడిగితే ఇవ్వలేదన్న కక్షతో బ్యాంకుకే కన్నం వేశాడు ఓ దుండగుడు. ముఠాను ఏర్పాటు చేసుకుని, రూ.కోట్ల విలువైన బంగారాన్ని అపహరించాడు. పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. దక్షిణ భారతదేశంలో సంచలనం రేపిన దావణగెరె జిల్లాలోని న్యామతి పట్టణంలోని ఎస్‌బీఐ శాఖలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12.95 కోట్ల విలువైన 17.750 కిలోల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను తూర్పు విభాగం ఐజీ డాక్టర్ బీఆర్ రవికాంతే గౌడ సోమవారం దావణగెరెలో మీడియాకు తెలిపారు. ఈ కేసులో విజయకుమార్(30), అభిషేక్(23), అజయకుమార్(28), చంద్రు(23), మంజునాథ్(32), పరమానంద(30)ను అరెస్టు చేశారు.

ఆధారాలు దొరక్కుండా...

విజయకుమార్ తమిళనాడువాసి. సోదరుడు అజయకుమార్‌తో కలసి కొన్నేళ్ల క్రితం న్యామతికి వలస వచ్చాడు. బేకరీ నిర్వహిస్తున్నాడు. రుణం కోసం విజయకుమార్ స్థానిక ఎస్‌బీఐ శాఖకు వెళ్లాడు. బ్యాంకు అధికారులు తిరస్కరించారు. రుణ తిరస్కరణతో కక్ష పెంచుకొన్న విజయకుమార్ బ్యాంకును కొల్లగొట్టాలని నిర్ణయించుకున్నాడు. తమ్ముడు అజయకుమార్, బావమరిది పరమానంద, న్యామతికే చెందిన చంద్రు, దావణగెరు జిల్లా హొన్నాళ్లికి చెందిన మంజునాథ్, అభిషేక్‌తో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. పథకం ప్రకారం 2024, అక్టోబరు 26న రాత్రి ఎస్‌బీఐ బ్యాంకు భవనం కిటికీని తొలగించి, లోపలికి చొరబడ్డారు. లాకర్లలో భద్రపరచిన బంగారాన్ని చోరీ చేశారు. 509 మంది ఖాతాదారులు తాకట్టుపెట్టిన బంగారం 17.750 కేజీలు అపహరించారు. బ్యాంకు పరిసరాల్లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, డీవీఆర్‌ను తీసుకెళ్లారు. బ్యాంకులో కారప్పొడి చల్లి ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. చోరీ చేసిన బంగారాన్ని తమిళనాడు రాష్ట్రం మదురైలోని ఓ తోటలో పాడుపడిన బావిలో దాచారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పలు కోణాల్లో విచారించారు. ఎటువంటి క్లూ దొరకలేదు. ఈ నేపథ్యంలో విజయకుమార్‌పై పోలీసులకు అనుమానం వచ్చింది. అతడిని అదుపులోకి తీసుకుని, విచారించగా.. చోరీ గుట్టు రట్టయింది. అతడు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు వెళ్లి పాడుబడ్డ బావిలో దాచిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.



పాతబావి నుంచి లాకర్లను వెలికితీసి పరిశీలిస్తున్న దృశ్యం

సైబర్ కి'లేడీ' అరెస్టు

» తెలుగు రాష్ట్రాలకు చెందిన ముఠా
» ముఠాలో ఫిజియోథెరపిస్టులు



రితిక

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరుతో అమాయకులను నిలువుదోపిడీ చేస్తున్న తెలుగు రాష్ట్రాల సైబర్ ముఠా ఆటను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కట్టించారు. డీసీపీ ధార కవిత కథనం ప్రకారం.. కొంపల్లికి చెందిన కొత్తపల్లి రితిక, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఫిజియోథెరపిస్టులు జీవన్‌కుమార్, తోట శ్రీనివాసరావు, ఇదే జిల్లా అగ్రహారానికి చెందిన టి.రఘువీర్, మరో ఇద్దరు సైబర్ ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నారు. రితికపై దేశవ్యాప్తంగా 32, తెలంగాణలో మూడు కేసులున్నాయి. గత ఏడాది నవంబరులో చోటుచేసుకున్న ఓ డిజిటల్ అరెస్టు కేసులో దర్యాప్తు ప్రారంభించిన హైదరాబాద్ సిటీ క్రైమ్ పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో ఈ ముఠాను గుర్తించారు. గత మంగళవారం శ్రీనివాసరావు, జీవన్‌కుమార్, రఘువీర్‌ను అరెస్టు చేశారు. రితికను శనివారం అరెస్టు చేసినట్లు డీసీపీ వివరించారు.

భోజనం చేస్తుండగానే గొంతు కోశారు!

» యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని సరిగా ఏలుకోవడంలేదని తూర్పులో దారుణం



పేరం శివ

నల్లజర్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బావమరిది అంటే బావ బతుకు కోరేవాడని అంటారు!. కానీ.. యువతిని ప్రేమ పెళ్లి చేసుకుని సక్రమంగా ఏలుకోవడంలేదని బావను సొంత బావమరిది, అతడి తండ్రి (మామ).. మరో ముగ్గురు కలిసి అత్యంత పాశవికంగా హత్య చేశారు. గొంతులో ముద్ద దిగుతుండగానే గొంతుకోశారు. పోలీసులు, ఇరు కుటుంబాల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన పేరం శివ(27) తన ఇంటి పక్కనే ఉన్న రేగుల వెంకటేశు కుమార్తె భానుని నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల పాప ఉంది. తరచూ దంపతుల మధ్య గొడవలు జరగడం పెద్దల్లో పెట్టి మళ్లీ రాజీ చేస్తూ వస్తున్నారు. శివ తరచూ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడేవాడు. పెళ్లయినప్పటి నుంచి ఇదే తంతు. ఈ క్రమంలో మూ డు రోజుల కిందట భార్యభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో ఆమె పాపను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం తన భార్యను పంపించాలని శివ అత్తింటికి వెళ్లి కోరగా వారు నిరాకరించారు. దీంతో శివ తిరిగి ఇంటికి వెళ్లిపో యాడు. సోమవారం సాయంత్రం శివ మామ రేగుల వెంకన్న, బావమరిది శ్రీరామ్, బంధువులు మంగయ్య, రత్తయ్య, రాజు ఆయిల్ పాం గెలలు కోసే రెండు కత్తులు పట్టుకుని శివ ఇంటికి వెళ్లారు. భోజనం చేస్తున్న శివను వెనక నుంచి పట్టుకుని బావమరిది, మిగిలిన వారు ఒక్కసారిగా కత్తులతో పీక కోసి అత్యంత పాశవికంగా హతమార్చారు. రక్తపు మడుగులో గిలగిలలాడుతూ శివ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొరుగు ప్రళయం

ప్రకృతి విపత్తుల ప్రియధాత్రి మయన్మార్ సుస్థిర ప్రజాస్వామ్య పాలనకు నోచుకోలేకపోతున్న దురదృష్ట దేశమది. ఈ రెండు వాస్తవాలూ, మయన్మార్ ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న దుస్థితికి నిలువెత్తు దర్పణాలు.

గత వందేళ్లలో మయన్మార్ 14 భూకంపాలను చవి చూసింది. వాటిలో కొన్ని గత శుక్రవారం నాటి భూ ప్రళయం లాంటివే. మయన్మార్ భౌగోళిక ఉనికి, భూభౌతిక వ్యవస్థ ఆ దేశాన్ని తరచు భూకంపాల తాకిడికి గురిచేస్తుంది. మార్చి 28 నాటి మహా ఉత్పాతం 1956 అనంతరం మయన్మార్‌ను కుదేలు చేసిన భూ కంపాలలో తీవ్రమైనది. భూమాత ఆగ్రహం వందలాది ప్రజల ప్రాణాలను హరించి వేసింది, భౌతిక ఆస్తులను, చారిత్రక కట్టడాలను ధ్వంసం చేసింది. ఆధ్యాత్మిక సంస్కృతికీ తీవ్ర విఘాతం కలిగించింది. భూకంప కేంద్రానికి చేరువలో ఉన్న మాండలే నగరంలో ప్రతి రెండో గృహమూ కూలి పోవడమో లేక తీవ్రంగా దెబ్బతినడమో జరిగింది. రిక్టర్ స్కేల్‌పై 7.7 పాయింట్ల తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం పొరుగుదేశం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌ను కూడా కుదిపివేసింది.

అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతూ రెండు కోట్ల మంది ప్రజలు దైనందిన మనుగడకు అంతర్జాతీయ మానవతాపూరిత సహాయ చర్యలపై ఆధారపడి ఉన్న క్లిష్ట సమయంలో మయన్మార్ ఈ పెను భూకంపానికి గురయింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని నాలుగేళ్ల క్రితం కూల్చివేసి అధికారాన్ని కైవసం చేసుకున్న సైనికాధికారుల దుర్మార్గ పాలనతో మయన్మార్ ఎడతెగని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. సైనిక పాలకులను సాయుధంగా వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామ్య శక్తుల అధీనంలోని ప్రాంతాలను స్వాధీనం చేసుకునేందుకు సైనిక పాలకులు నిరంతర యుద్ధం చేస్తున్నారు. గత శుక్రవారం నాడు భూ ప్రళయం సంభవించిన మూడు గంటల వ్యవధిలోనే ప్రతిఘటనా శక్తుల నియంత్రణలోని ప్రాంతాలపై వైమానిక దాడులు నిర్వహించారు. ఆ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గత నాలుగేళ్లుగా సైనిక పాలకుల చేతుల్లో హతమయి సమాధుల్లో ఉన్న వారి ఎముకలు సైతం సైనిక పాలకుల ఈ ప్రస్తుత దుర్మార్గానికి వణికిపోతున్నాయని ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

తొలుత కోవిడ్ విలయం, ఆ వెన్వెంటనే అంతర్యుద్ధం ప్రారంభమవడంతో మయన్మార్‌లో ప్రతి నలుగురిలో ఒకరు పేదరికంతో కునారిల్లుతున్నారు. దాదాపు నలభై లక్షల మంది అంతర్గత నిర్వాసితులుగా బతుకులు ఈడుస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితిలో మయన్మార్ మరో భూ ప్రళయంతో మాటల్లో వర్ణించలేని దురవస్థల పాలయింది. 1948లో స్వాతంత్ర్యం పొందిన తరువాత అత్యధిక కాలం అధికారంలో ఉన్న సైనిక పాలకులు బయటి ప్రపంచంతో సంబంధాలను నిరాకరించే విచిత్ర వ్యక్తులు. 2008లో కనీసం లక్షన్నర మందిని బలిగొన్న పెను తుపాను సంభవించిన ఆపత్సమయంలో కూడా అంతర్జాతీయ సహాయాన్ని నిరాకరించిన జడబుద్ధులు. అయితే ఈసారి ప్రళయం సంభవించిన వెంటనే అంతర్జాతీయ సహాయాన్ని అంగీకరిస్తామని సైనిక పాలకుడు మిన్ అంగ్ హ్లాయింగ్ ప్రకటించాడంటే పరిస్థితి ఎంత ఘోరంగా, మరెంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో మయన్మార్‌లో యుఎస్ ఎయిడ్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో సహాయ కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మయన్మార్‌లో భూకంపం సంభవించిన రోజునే యుఎస్ ఎయిడ్ సంస్థలో ఉద్యోగులు అందరినీ తొలగించనున్నట్టు , ప్రపంచ వ్యాప్తంగా ఆ సహాయ సంస్థ కార్యకలాపాలను నిలిపివేయనున్నట్టు ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్‌కు చెప్పింది. 2024లో యుఎస్ ఎయిడ్ మయన్మార్‌లో సహాయ సేవలకు 240 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇది ఆ దురదృష్టకర దేశవాసులకు అందించిన మొత్తం మానవతాపూరిత సహాయంలో మూడోవంతుగా ఉన్నది. అయితే గత జనవరి 20న రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మయన్మార్‌లో యుఎస్ ఎయిడ్ సహాయ కార్యక్రమాలు 18 నుంచి 3కు తగ్గిపోయాయి. కొన్ని దేశాల దిగుమతులపై సుంకాల విధింపును నెలరోజుల పాటు వాయిదా వేసిన ట్రంప్ ప్రభుత్వం మయన్మార్‌లోని మానవతా సంక్షోభం దృష్ట్యా కనీసం కొన్ని నెలల పాటు అయినా ఆ దేశంలో తమ సహాయ కార్యక్రమాలను పునరుద్ధరించి ఎందుకు కొనసాగించకూడదు? వాతావరణ మార్పు యుగంలో సంభవిస్తున్న ప్రాకృతిక విపత్తులు మన నైతిక వివేకానికి సవాళ్లు విసరడం లేదూ?

సమీప, సుదూర దేశాలలో ఎక్కడైనా ప్రాకృతిక విపత్తులు సంభవించినా అత్యవసర సహాయాన్ని అందించడంలో ముందుండే భారత్ ఇప్పుడు మయన్మార్ విషయంలోనూ అంతే జరూరుగా ప్రతిస్పందించింది. వసుధైవ కుటుంబకం అన్న భారతీయ నాగరికతా ఆదర్శాన్ని పౌదలదాల్చిన న్యూఢిల్లీ 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట భారీ ఎత్తున సహాయ కార్యకలాపాలకు పూనుకున్నది. ఇప్పుడు మయన్మార్ కష్టాల్లోనూ అదే విధంగా వ్యవహరిస్తూ మరింత సమున్నత బాధ్యతను నిర్వర్తించాల్సిన బాధ్యత న్యూఢిల్లీపై ఉన్నది. మయన్మార్‌లో సుస్థిర ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు పూనుకోవడమే ఆ కర్తవ్యం. దూరాలు కరిగిపోయి, వాస్తవ కాలాలు ఏకమైపోతున్న ప్రస్తుత యుగంలో ఆపత్సమయాలలోనే కాకుండా సాధారణ రోజుల్లో సైతం ఇరుగు పొరుగు దేశాలలోని ప్రజల బాగోగుల విషయమై శ్రద్ధ చూపడం 'విశ్వగురు'గా ప్రభవించేందుకు ఆరాటపడుతున్న భారత్ విధ్యుక్త ధర్మం కాదూ?

జనగణనకు జై కొడదాం!

మన దేశంలో దశాబ్దానికి ఒకసారి జనగణన జరగడం సర్వసాధారణం. పరిపాలనా సౌలభ్యం, ఆర్థికాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, వనరుల సమ పంపిణీ, దేశాభివృద్ధికి ప్రణాళిక రచించడం తదితర అంశాల దృష్ట్యా జనగణన ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. మన దేశంలో 2011లో చివరిసారిగా జనగణన జరిగింది. ఆ తర్వాత 2021లో జరగాల్సిన జనాభా లెక్కల ప్రక్రియ కరోనా మహమ్మారి కారణంగా వాయిదా పడుతూ వస్తున్నది. దేశంలో పరిస్థితులు చక్కబడటంతో ఈ ఏడాది లేదా వచ్చే ఏడాది మొదట్లో కచ్చితంగా జనగణన ప్రక్రియ చేపట్టాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే, దేశ జనాభా లెక్కలపై ఒక స్పష్టత వస్తేనే డీ లిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు మార్గం సుగమం అవుతుంది. అయితే ఇప్పటికీ జనగణనపై ఎలాంటి ప్రకటన చేయలేదంటే కేంద్ర ప్రభుత్వానికే ఈ అంశంపై స్పష్టత లేదని మనకు అర్థమవుతున్నది.

దేశంలో జనగణనతో పాటు డీ లిమిటేషన్ ప్రక్రియలకు ఎంతో చరిత్ర ఉన్నది. ప్రతి పదేండ్లకోసారి జనగణన జరిగినట్టే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నాలుగుసార్లు డీ లిమిటేషన్ ప్రక్రియ జరిగింది. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో ఆసేతు హిమాచలం వరకు అన్ని ప్రాంతాలకు సమన్యాయం, సమ ప్రాతినిధ్యం కల్పించేందుకు, సమతుల్యత పాటించేందుకుగాను డీ లిమిటేషన్ ప్రక్రియను అమలుచేశారు. స్వాతంత్ర్యానంతరం 1951లో మొదటిసారి జనగణన ప్రక్రియ చేపట్టారు. ఆ మరుసటి ఏడాది 1952లో జస్టిస్ చంద్రశేఖర అయ్యర్ నేతృత్వంలో మొట్టమొదటి డీ లిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ సిఫారసుల ఆధారంగా 1952లో మొదటిసారిగా నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1961 జనాభా లెక్కల ఆధారంగా 1962లో రెండోసారి నియోజకవర్గాల పునర్విభజన చేశారు. ఈసారి 494 నియోజకవర్గాలను 522కు పెంచారు. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలలో అసెంబ్లీ నియోజకవర్గాలను కూడా పెంచారు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి ఏపీ ఏర్పడినాక జరిగిన మొదటి డీ లిమిటేషన్ ప్రక్రియ ఇదే కావడం గమనార్హం, అనంతరం 1971 జనగణన ఆధారంగా 1976లో మూడోసారి నియోజకవర్గాల పునర్విభజన చేశారు. జస్టిస్ జేఎల్ కపూర్ నేతృత్వంలోనే డీ లిమినేషన్ కమిషన్ సిఫారసు ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 522 నుంచి 543కు పెంచారు. అంతేకాదు, 2001 వరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. అప్పటికే 1971 జనగణన ఆధారంగా ఉత్తర, దక్షిణ రాష్ట్రాలలో జనాభా వ్యత్యాసాన్ని గ్రహించిన నాటి కేంద్ర ప్రభుత్వం కొన్నేండ్ల పాటు యథాతథ స్థితిని కొనసాగించాలని 42వ రాజ్యాంగ సవరణ చేసింది. పాతికేండ్ల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా డీ లిమిటేషన్ చేపట్టారు. జస్టిస్ కుల్దీప్ సింగ్ కమిషన్ సిఫారసుల మేరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగానే ఉంచారు. దాంతోపాటు 2026 తర్వాత జరిగే మొదటి జనగణన ఆధారంగా మాత్రమే డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని 84వ రాజ్యాంగ సవరణ చేశారు.




జనాభా లెక్కలు తీస్తేనే డీ లిమిటేషన్ అయినా, మహిళా రిజర్వేషన్లు అయినా అమలుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల రాజకీయ పార్టీలు, మేధావులు, ఆలోచనాపరులు తొలుత జనగణన జరపాలని డిమాండ్ చేయాలి. అలా చేస్తేనే రాజ్యాంగ సవరణ చేసి 2031కు ముందే డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను సులభంగా అమలు చేసుకోవచ్చు.

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం జనగణన చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుండటంతో సరి కొత్త వివాదం రాజుకున్నది. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తుండటంతో దక్షిణాదిన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల సంఖ్య పెంచితే దక్షిణాదికి భారీ నష్టం జరుగుతుందన్నది నూటికి నూరుపాళ్లు నిజం. జనాభా నియంత్రణను పాటించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయి. గత రెండు దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విజయం సాధించగా, ఉత్తరాదిలో భారీగా జనాభా పెరిగింది. ఈ నేపథ్యంలో దక్షిణాదిలో నియోజకవర్గాల సంఖ్య చాలా తక్కువగా, ఉత్తరాదిలో భారీగా పెరిగే ఆస్కారం ఉన్నది. ఇదే జరిగితే జనాభా నియంత్రణను పాటిస్తూ, అభివృద్ధిలో దూసుకువెళ్తున్న దక్షిణాదికి అన్యాయం జరిగినట్టవుతుంది. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గుతుంది. దక్షిణాది అవసరం లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఏర్పడుతుంది. తద్వారా ఢిల్లీలో మన వాణి వినిపించే అవకాశం లేకుండా పోతుంది. అందుకే, 1971 జనగణన ఆధారంగా ప్రస్తుతం కొనసాగుతున్న నిష్పత్తి ప్రకారమే ఆయా రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్యను పెంచాలని వాదనలు వినిపిస్తున్నాయి.

దేశంలో ఇప్పటికీ 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలు కొనసాగుతున్నాయి. 2026 తర్వాత జరిగే జనగణన వరకు దీని పొడిగించారు. వాస్తవానికి 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 2026 తర్వాత జరిగే మొదటి జనగణన ఆధారంగా డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి. ఇప్పుడు జరుగబోయేది 2021 జనాభా లెక్కలు. అంటే రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీల్లేదు. అందుకు రాజ్యాంగం అనుమతించదు.

2026 తర్వాత జరుగబోయే జనగణన అంటే 2031 లెక్కల ప్రకారం పునర్విభజన జరగాల్సి ఉన్నది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా పెరగాల్సి ఉన్నది. అందుకు ముందుగా జనగణన జరగాలి. జనాభా లెక్కలు తీస్తేనే డీ లిమిటేషన్ అయినా, మహిళా రిజర్వేషన్లు అయినా అమలుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల రాజకీయ పార్టీలు, మేధావులు, ఆలోచనాపరులు తొలుత జనగణన జరపాలని డిమాండ్ చేయాలి. అలా చేస్తేనే రాజ్యాంగ సవరణ చేసి 2031కు ముందే డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను సులభంగా అమలు చేసుకోవచ్చు. ఇదంతా జరగాలంటే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం 2025లో జనగణన మొదలు పెట్టి 2026లో ప్రకటించాల్సిందే. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆశిద్దాం.




○ బోయినపల్లి వినోద్‌కుమార్
న్యాయవాది, పార్లమెంట్ మాజీ సభ్యులు

‘జాతీయ విద్య’లో త్రిభాషా సూత్రం తిరకాసు!

త్రిభాషా సూత్రం ఇప్పుడు మళ్లీ ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పి.ఎమ్.శ్రీ ఒప్పందంపై సంతకం పెట్టకపోవడం, త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించడం, అసలు 'జాతీయ విద్యా విధానం–2020'ని తిరస్కరించడంతో కేంద్రం తమిళనాడుకు ఇవ్వవలసిన విద్యారంగ నిధులు రెండువేల కోట్ల రూపాయిలు నిలిపివేసింది. దీంతో ఇది పెద్ద చర్చగా మారింది. కేంద్రం ఒక విద్యా విధానాన్ని రూపొందించి, దానిని రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు జరపాలని నిర్బంధించడం, అమలు చేయకపోతే నిధులు ఆపివేస్తామనడం అన్యాయమైన విషయం. ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదు. రాజ్యాంగకర్తలు విద్యను రాష్ట్ర జాబితాలో పెట్టారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను ఉమ్మడి జాబితాలోకి మార్చింది. తిరిగి విద్యను రాష్ట్ర జాబితాకు మార్చాలనే డిమాండు ముందుకు వస్తున్న తరుణంలో కేంద్ర విద్యావిధానాన్ని ప్రతి రాష్ట్రం విధిగా అమలు జరపాలని నిర్బంధం చేయడం ప్రస్తుత చర్చకు కారణం అయింది.

కేంద్ర ప్రభుత్వం జూలై 29, 2020న 'జాతీయ విద్యా విధానం–2020' (ఎన్.ఇ.పి–2020) పేరున ఒక విధాన పత్రాన్ని ప్రకటించింది. దీనిని ఏ దశలో కూడా పార్లమెంటులో చర్చకు పెట్టలేదు. అటువంటప్పుడు వివిధ రాష్ట్రాల చట్టసభల్లో చర్చకు పెట్టడం అనే సమస్యే తలెత్తదు. దీనిని జాతీయ విద్యా విధానం అనడం కంటే కేంద్ర ప్రభుత్వ విద్యా విధానం అనడం సబబుగా ఉంటుంది. ఈ విద్యా విధానంలో చాలా సమస్యలున్నాయి. ఎ) ఇది విద్యా వ్యాపారాన్ని రద్దు చేయలేదు సరికదా, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధులు నిరాకరిస్తూ, ప్రతి విశ్వవిద్యాలయం తనకు అవసరమైన నిధులను తానే సమకూర్చుకోవాలని చెప్తుంది. ఇది ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫీజుల పెంపుదలకు, పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య నిరాకరణకు కారణమవుతున్నది. ఈ మధ్య విడుదల అయిన యు.జి.సి ముసాయిదా విధానంలో విశ్వవిద్యాలయాల్లో పదోన్నతులు కోరే అభ్యర్థులు విశ్వవిద్యాలయాలకు నిధులు సమకూర్చే ప్రాజెక్టులను చేపట్టాలని, పదోన్నతి కల్పించడంలో వివిధ రూపాల్లో వారు సమకూర్చగల నిధులు ఒక ప్రధాన అంశంగా ఉంటాయని ప్రతిపాదించిన విషయం విదితమే. బి) ఈ విధానం విద్యారంగ విషయాలపై అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కేంద్రీకరిస్తుంది. పాఠశాల పాఠ్యపుస్తకాలను సొంతంగా రాసుకునే హక్కు కూడా రాష్ట్రాలకు లేదు. వాటిని కేంద్రమే రూపొందిస్తుంది, రాష్ట్రాలు ఉపయోగించుకోవాలి. ఈ కేంద్ర విద్యా విధానం ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో కోర్సులు, చివరికి పరిశోధనలు (నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా) కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. ముందుగా సూచించిన యు.జి.సి సర్క్యులర్ 'రాష్ట్రాలు స్థాపించి నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల నియామకంలో' రాష్ట్ర ప్రభుత్వాలకు పాత్రలేని విధానాన్ని ప్రతిపాదించింది. అయితే ఈ విషయం కొత్తది కాదు. ఇది ఎన్.ఇ.పి–2020లో ఉంది. సి) ఈ విద్యావిధానం సామాజిక న్యాయానికి పాతర వేసింది. 66 పేజీల విధాన పత్రంలో 'సామాజిక న్యాయం' అన్న పదబంధంగాని, రిజర్వేషన్లు అనే పదంగాని కనిపించదు. మరల యు.జి.సి సర్క్యులర్‌లోనే రిజర్వేషన్లు నీరుగార్చడానికి సాక్ష్యాలు కనిపిస్తాయి. యు.జి.సి సర్క్యులర్‌లో ఎస్సీ, ఎస్టీ, నాన్ క్రీమీలేయర్ బీసీ, ఇ.బిసి, అంగవైకల్యం ఉన్న వారికి నిర్దిష్ట శాతాల్లో రిజర్వేషన్ ఇస్తున్నట్లు పేర్కొనలేదు. 5శాతం మార్కులు వెసులుబాటు మాత్రం ప్రతిపాదించారు. డి) ఈ విద్యా విధానం 'భారత జ్ఞాన వ్యవస్థ' పేరుతో కాషాయీకరణకు, చరిత్ర వక్రీకరణకు, కాలం చెల్లిన భావాల వ్యాప్తికి, చివరికి భూత వైద్యానికి ప్రాతిపదికలు ఏర్పాటు చేసింది. ఇ) ఎన్.ఇ.పి–2020 పాలక పార్టీ వ్యక్తులు వారికి ఎటువంటి విద్యా సంబంధమైన అర్హతలు లేకపోయినా ప్రొఫెసర్‌లు కావడానికి దారులు వేసింది. ఈ విషయానికి కూడా మనం జాతీయ విద్యా విధానం పత్రం చదవవలసిన అవసరం లేదు. యు.జి.సి సర్క్యులర్‌లోనే 'ఎటువంటి విద్యా సంబంధమైన అర్హతలు లేని వారికి' వారి 'ఇతర సమర్థతలను' దృష్టిలో ఉంచుకుని 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్'గా విశ్వవిద్యాలయాలు నియమించవచ్చని ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాల్లో పాలక పార్టీ వ్యక్తుల (ప్రస్తుతం బి.జె.పి; ఆర్.ఎస్.ఎస్) చొరబాటుకు ఇది రాజమార్గం. మరి ఇది ఒక్క తమిళనాడు సమస్య ఎలా అవుతుంది. ఈ సమస్యలతో పాటు భాషా విధానం కూడా ప్రధానంగా ఉంది.



srini

'ఎన్.ఇ.పి–2020' చట్టం కాదు, దానిని రాష్ట్రాలు అమలు చేయవలసిన అవసరం లేదు. దీనిని అమలు చేయమని తమిళనాడును కాని మరొక రాష్ట్రాన్ని కాని బలవంతం పెట్టే అధికారం కేంద్రానికి లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ హిందీని, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించడం ద్వారా దేశ ప్రజల ఐక్యతకు, ప్రాదేశిక సమగ్రతకు నష్టం కలిగిస్తున్నది.

భాషా విధానం దీర్ఘకాలంగా మన దేశంలో ఒక సమస్యగా ఉంది. 'వైవిధ్యంలో ఐక్యత' అనే భావం ఔన్నత్యం చూడలేకపోవడం, ఏకత్వం ద్వారానే ఐక్యత సాధ్యమవుతుందని అనుకోవడం వల్ల సమస్య వస్తున్నది. దేశ ప్రజలందరూ హిందీ నేర్చుకుంటే దేశ ప్రజల ఐక్యత, ప్రాదేశిక సమగ్రత సాధ్యం అవుతాయనే భావన ఆనాటి కాంగ్రెస్‌లో కూడా ఉన్నది. కమ్యూనిస్టులు ఈ భావనకు గురి కాలేదు కాని, కొన్ని రకాల సోషలిస్టులు కూడా ఈ భావజాలానికి నీరు పోశారు. అనేక చర్చల తరువాత 'భారత రాజ్యాంగ పరిషత్' హిందీని అఖిల భారత అధికార భాషగా గుర్తించి, 1965 వరకు ఆంగ్లం కూడా అధికార భాషగా కొనసాగించవచ్చని పేర్కొంది. సహజంగానే 1965లో ఈ సమస్య మళ్లీ ముందుకొచ్చింది. తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం తీవ్రంగా పెరిగింది. ఇతర దక్షిణాది రాష్ట్రాల ప్రజలు కూడా గొంతు కలిపారు. కేంద్రం వెనక్కి తగ్గింది. అధికార భాష అనే సమస్యతో పాటు మరి రెండు సమస్యలున్నాయి ఒకటి బోధనా మాధ్యమం, రెండవది భాషల బోధన. బోధనా మాధ్యమం విషయానికి వస్తే కొఠారీ కమీషన్, '1986 నాటి జాతీయ విద్యా విధానం' మాతృభాషా మాధ్యమాన్నే అత్యున్నత స్థాయి వరకు సిఫారసు చేశాయి. 2010 ఏప్రిల్ 1 నుంచి అమలులో ఉన్న 'బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం–2009' ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్నే నిర్దేశిస్తున్నది. 'జాతీయ విద్యా విధానం 2020' మాత్రం 5వ తరగతి వరకు మాత్రమే మాతృభాషా మాధ్యమాన్ని సిఫారసు చేసి, 'వీలయితే 8వ తరగతి వరకు' అనే మాట చేర్చింది.

కొఠారీ కమిషన్, ఇంకా 1986లో వచ్చిన జాతీయ విద్యావిధానం కూడా త్రిభాషా విధానాన్నే సిఫారసు చేశాయి. కొన్ని ప్రధానమైన, ఆపైన ప్రమాదకరమైన వెసులుబాట్లతో మోడీ 2.0 కాలంలో వచ్చిన 'జాతీయ విద్యావిధానం–2020' కూడా త్రిభాషా విధానాన్ని ప్రతిపాదించింది. ఈ త్రిభాషా విధానంలో మాతృభాష కాని ఆంగ్లం కాని తప్పనిసరి కాదు! తాము తమిళ్, ఆంగ్లం విద్యార్థులకందిస్తామని, మూడవ భాష (హిందీ, సంస్కృతం, ఇంకా దేనినీ) తప్పనిసరి చేయమని తమిళనాడు తెగేసి చెప్పింది. ఎన్.ఇ.పి–2020లో కనీసం రెండు దేశీయ భాషలు నేర్చుకోవాలని ఉంది గాని, అందులో ఒకటి వాడుకలో లేని సంస్కృతం కూడా కావచ్చు. సంస్కృతాన్ని ప్రోత్సహించడానికే ఇటువంటి విధానాన్ని తీసుకువచ్చారు. విశ్వవిద్యాలయ స్థాయిలో సంస్కృత సాహిత్యాన్ని పరిశోధించడానికి కొద్ది మంది ఆసక్తి ఉన్న విద్యార్థులు సంస్కృతం నేర్చుకోవడం వేరు, బాలబాలికలందరికీ సంస్కృతాన్ని ఒక సబ్జెక్ట్ చేయడం వేరు.

ఈ పాలసీ కింద ఇప్పటికే అవకాశవాద విధానాలనవలంబిస్తున్న తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మార్పేమీ ఉండదు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, హిందీ (మూడు భాషలు, అందులో కనీసం రెండు దేశీయ భాషలు) అందిస్తున్నారు. ఇది 'ఎన్.ఇ.పి–2020' మూసలోనే ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు బోధించరు, ఆంగ్లం, హిందీ, సంస్కృతం బోధిస్తారు. సంస్కృతం 'స్కోరింగ్ సబ్జెక్టు'!

కొత్త 'జాతీయ విద్యా విధానం'లో విద్యార్థులకు మాతృభాషను తప్పనిసరిగా అందించాలనే సిఫారసు లేనందున మార్కెట్ శక్తులకు ఇబ్బంది లేదు. కొత్త విద్యా విధానంలో ఆంగ్లం కూడా తప్పనిసరి కాదు, కాబట్టి గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రధానంగా పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో, కాలక్రమంలో, విద్యార్థులకు ఆంగ్ల భాషా బోధనను పూర్తిగా తిరస్కరించి గుజరాతీతో పాటు హిందీ, సంస్కృతాలను వారిపై రుద్దవచ్చు. సంఘ్‌పరివార్ అజెండా ముందుకు తీసుకు వెళ్ళవచ్చు. భోజ్‌పురి, మగధి, మైథిలి వంటి సుమారు 25 భాషలను మింగివేసి విస్తరించిన హిందీ అనేక రాష్ట్రాల్లో ప్రజల మాతృభాషగా చలామణి అవుతున్నది. ఆ రాష్ట్రాలు 'ఎన్.ఇ.పి–2020' వరకు ద్విభాషా విధానాన్నే అమలు చేశాయి. కొత్త త్రిభాషా విధానం కింద సంస్కృతం బోధన ప్రారంభించారు.

'ఎన్.ఇ.పి–2020' చట్టం కాదు, దానిని రాష్ట్రాలు అమలు చేయవలసిన అవసరం లేదు. దీనిని అమలు చేయమని తమిళనాడును కాని మరొక రాష్ట్రాన్ని కాని బలవంతం పెట్టే అధికారం కేంద్రానికి లేదు. హిందీని, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దకూడదు. కేంద్ర ప్రభుత్వం మాట అలా ఉంచి.. వైవిధ్యాన్ని ఆమోదిస్తేనే, గౌరవిస్తేనే ఐక్యత బలపడుతుందని హిందీ బెల్ట్ ప్రజలు తెలుసుకోవడం ఎంతైనా అవసరం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ హిందీని, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించడం ద్వారా దేశ ప్రజల ఐక్యతకు, ప్రాదేశిక సమగ్రతకు నష్టం కలిగిస్తున్నది.

■ డి. రమేష్ పట్నాయక్
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ

ఎవరు బాగున్నారని?

లోకంలో ఏది బాగుందని
దేశంలో ఎవరు బాగున్నారని
దిగువనోళ్లు దిగబడి దారిద్ర్యంలో
ఎగువనోళ్లు ఎగబాకుతూ సంపదల్లో
విషాదాల కొమ్మలకు తలకిందులుగా
వేళ్లాడబడిన జీవితాశలు
మాయామోహాల సంకెళ్లలో
గోసగోసగా గడ్డురోజులు

రాజ్యం! రచ్చల రగడల లొల్లి
అబద్ధాల అత్యాచారాల గల్లి
ఉచితాల ఊరడింపులు ఫ్రాడ్‌లు
హామీల సయ్యాటలు స్కామ్‌లు
తెగబలిసిన లంచావతారాలు
బురదల్లో కూరుకుపోయిన విలువలు

వినోదమంటూ వికృత చేష్టలు
క్రైమ్ అండ్ వయలెన్స్!
వ్యాపార మృగాల చిత్రప్రదర్శనలు
కోట్ల కలెక్షన్లకు తెరిచిన
రాబడుల మృత్యువు గేట్లు
జీవన నైతికత్వానికి తూట్లు

ఇన్సానియత్ ముర్దాబాద్!
గుండాగర్దీ జిందాబాద్!
ఉన్మాదించిన వెర్రివేషాలు
బూతుపురాణాలు తిట్ల వడగళ్లు
వ్యభిచార రాకెట్లు డ్రగ్స్ మాఫియాలు
అకాలం కౌగిట్లో 'మనిషి' శిలాజాలు

అసహన జ్వాలలు అశాంతి మంటలు
యుద్ధం! యుద్ధం! విధ్వంసం!
అగులు బుగులుపుట్టి ఆగమయ్యి
అంగళ్ళ చెరల్లో ఆక్రోశిస్తూ
గాయాలను తడుముకుంటూ అడుగుతున్నా
ఏది బాగుంది ఈ లోకంలో
ఎవరు బాగున్నారని దేశంలో?

— అనిశెట్టి రజిత

విస్మరణల ‘యువవీరులు’!

నరేష్ జాటోత్ వ్యాసం 'స్వాతంత్ర్య సమరంలో యువవీరులు' (మార్చి 23)లో కొన్ని పొరపాట్లు, కొన్ని విస్మరణలు ఉన్నాయి. భగత్ సింగ్ పుట్టిన ఊరు, ఉరి తీయబడిన ఊరు కూడా పొరపాటుగా పేర్కొన్నారు. 'ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న పంజాబ్ హుస్సేనివాలా ప్రావిన్స్ జైలులో ఆ వీరులను ఉరికంబానికి బలిచ్చారు' అని రాశారు. హుస్సేనివాలా ప్రస్తుతం ఇండియాలోనే ఉన్నది. మన ఫిరోజ్‌పూర్‌కు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో సట్లెజ్ నదికి పడమటగా ఆ ఊరు ఉంటుంది. 1849లో లాహోరు రాజధానిగా ఏర్పడిన పంజాబ్ ప్రావిన్స్‌లో ఒక చిన్న గ్రామం. లాహోరుకు దక్షిణ దిక్కున 20 కిలోమీటర్ల లోపు ఉంటుంది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఉరితీసింది లాహోర్ సెంట్రల్ జైల్లోనే. ఉరితీత అనంతరం వారి భౌతిక కాయాలను ఆ రాత్రి పూటే హుస్సేనీవాలా సట్లెజ్ నది ఒడ్డుకు తెచ్చి ముక్కుబడిగా కర్మకాండలు నిర్వహించి, త్వరగా కాలిపోవటానికని ముక్కలుగా చేసి, కిరసనాయిల్ పోసి దహనం చేశారు. ఇప్పటికీ వారి విగ్రహాలు, సమాధులు అక్కడే ఉన్నాయి. బటుకేశ్వరదత్తు, భగత్ సింగ్ తల్లి విద్యావతి సమాధులు కూడా అక్కడ ఉన్నాయి. (నేను 1998లో హుస్సేనివాలా వెళ్లి అమరవీరుల సమాధులు దర్శించి వచ్చాను)

భగత్ సింగ్ జన్మించిన ఊరు పేరు 'బంగ'. అది ఆనాడు లాయల్‌పూర్ జిల్లాలో ఉండేది. విభజన అనంతరం దానికి ఫైసలాబాద్ అని పేరు మారింది. అది లాహోరు నుండి రావల్పిండి వేపు సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వ్యాస రచయిత పేర్కొన్నట్లు ఆయన పుట్టింది లాహోర్‌లో కాదు, 'బంగ'లో. ఉరి తీయబడింది హుస్సేనీ వాలాలో కాదు, లాహోర్‌లో!

ఢిల్లీ సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు వేయటానికి భగత్‌సింగ్‌కు తోడుగా వచ్చినది బటుకేశ్వర దత్తు. వ్యాసరచయిత పేర్కొన్నట్లు రాజ్‌గురు, సుఖదేవ్‌లు కాదు. అలాగే వారికి ఉరిశిక్ష పడింది లాలా లజపతిరాయ్ హత్య కేసులో. వ్యాస రచయిత పేర్కొన్నట్లు బాంబులు వేసిన కేసులో కాదు. సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు వేసిన కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 'స్కాట్స్ అనుకుని మరో ఎస్‌ఐ సాండర్స్‌ను హత్య చేశారు' అని ఆ వ్యాసంలో రాశారు. స్కాట్ లాహోర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అయితే సాండర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్. ఎస్సై లాంటి చిన్న పోస్టులలో తెల్లవారు ఉండేవారు కాదు. 1986లో మేము వెలువరించిన 'నా నెత్తురు వృధా కాదు' పుస్తకంలో భగత్ సింగ్ నిరాహారదీక్ష చేసినది 114 రోజులు అని పేర్కొన్నాం. దానిపై కొందరు ప్రశ్నించటంతో నిర్ధారించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేను భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్‌కు ఫోను చేసి మాట్లాడాను. ఆయన స్పష్టంగా 114 రోజులు అని చెప్పారు. ఈ వ్యాస రచయిత 64 రోజులు అని రాశారు.

భగత్ సింగ్, బటుకేశ్వర దత్తులు సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరింది ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించుకున్న రెండు క్రూర నిర్బంధ చట్టాలకు నిరసనగా. అందులో ఒకటి (ట్రేడ్ డిస్ప్యూట్ బిల్) పారిశ్రామిక వివాదాల చట్టం. ఇది కార్మికుల కనీస హక్కులకు వ్యతిరేకంగా తీసుకువచ్చినది. రెండవది (పబ్లిక్ సేఫ్టీ బిల్) పౌర భద్రతా చట్టం. ఇది ప్రజలకు ఉండే సహజమైన పౌర స్వేచ్ఛలను చట్టబద్ధంగా అణచివేయడానికి సంకల్పించినది. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ముఖ్యుల సమావేశంలో సెంట్రల్ అసెంబ్లీలో బాంబుల దాడి గురించి సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. భగత్ సింగ్ అసెంబ్లీ హాలులో బాంబులు వేయటంలో పాల్గొనాలని మొదటి రోజు నిర్ణయంలో లేదు. సుఖదేవ్ దానిపై తిరిగి గట్టిగా చర్చించిన పిదప భగత్ సింగ్ పేరు ఖరారు అయింది. అప్పటికే కార్మిక నాయకులను, ముఖ్యంగా కమ్యూనిస్టు నాయకులను కాన్పూరు, మీరట్ కుట్ర కేసుల పేరుతో బ్రిటిష్ ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించి కార్మిక ఉద్యమాన్ని అణచివేస్తున్న నేపథ్యంలో ఈ బాంబుల దాడిని చూడాలి. వారు వెదజల్లిన 'చెవిటి వారికి వినబడేటట్టు చేయాలంటే పెద్ద శబ్దాలు అవసరమవుతాయి' అనే వాక్యంతో ప్రారంభమయ్యే కరపత్రంలో పైన పేర్కొన్న చట్టాలను, కార్మిక నాయకుల అరెస్టుల గురించి ప్రస్తావించి ఉన్నారు. కరపత్రం చివర 'విప్లవం వర్ధిల్లాలి!' అనే నినాదం మాత్రమే ఉండినప్పటికీ, వారిరువురూ కార్మిక వర్గం వర్ధిల్లాలి! బ్రిటిష్ సామ్రాజ్యవాదం నశించాలి!! విప్లవం వర్ధిల్లాలి!!! అనే నినాదాలను తమ నోటి ద్వారా సెంట్రల్ అసెంబ్లీ గేలరీ నుండి వినిపించారు. అంతేకాకుండా 'అందరికీ స్వేచ్ఛ నొసగే, ఒక మనిషిని మరొక మనిషి దోచుకునే అవకాశాన్ని అసాధ్యం చేయగల మహా విప్లవాల బలిపీఠంపై వ్యక్తుల త్యాగాలు అనివార్యం!' అనేది ఆ కరపత్రంలోని చివరి వాక్యం. అసెంబ్లీలో బాంబుదాడుల కేసుపై ఢిల్లీ సెషన్స్ కోర్టులో 6 జూన్ 1929 నాడు, 13 జనవరి 1930న లాహోర్ హైకోర్టులో భగత్ సింగ్ చేసిన వాదనలు చాలా ముఖ్యమైనవి. ఆయన మాటల్లోనే... 'విప్లవం నుంచి మేము ఆశించే ప్రయోజనం ఏమిటంటే ఎటువంటి ప్రమాదాలు లేని శ్రామిక వర్గ నియంత్రత్వానికి పట్టంగట్టే సామాజిక వ్యవస్థను స్థాపించటం! అప్పుడు పెట్టుబడిదారీ విధానపు బాధల నుంచి యుద్ధం వల్ల సంభవించే వినాశనాల నుంచి కష్టాల కడగళ్ల నుంచి విశ్వ సమాజాన్ని రక్షించుకోవచ్చు. ఇది మా ఆదర్శం. ఈ తాత్వికత నుంచి ప్రేరణ పొంది మేము దృఢమైన హెచ్చరిక చేశాం.' భగత్ సింగ్ చేసిన లాహోర్ హైకోర్టు ప్రకటనను న్యాయ శాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉంది. అలాగే, మార్చి 23 కేవలం 'షహీద్ దివస్'గా మాత్రమే కాక లౌకికవాద సాంస్కృతిక ప్రతీకగా దేశమంతా చెప్పుకునే రోజుగా ఉండాలి.

తాము సాండర్స్‌ను హత్య చేయలేదని భగత్ సింగ్ బృందం కోర్టులో ఎప్పుడూ వాదించలేదు. బ్రిటీష్ రాజ్యపు బూటకపు విచారణ తంతును బహిర్గతం చేయడానికి భగత్ సింగ్ ప్రయత్నించాడే తప్ప వారి ముందు ఏ రూపంలోనూ లొంగడానికి పూనుకోలేదు. తాను ఉరికంబం ఎక్కబోయే చివరి క్షణాలలో కూడా 'లెనిన్ గురించి క్లారా జెట్కిన్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని చదువుతూ యువతరానికి లెనిన్‌ను అనుసరించమని భగత్ సింగ్ ఒక సందేశం అందించాడు.



నరేష్ తన వ్యాసంలో...'తన కొడుకును కేసు నుంచి బయట పడేయడానికి భగత్‌సింగ్ తండ్రి చాలా ప్రయత్నించారు. అయితే తండ్రి ప్రయత్నాలను వారించిన భగత్ సింగ్ దానివల్ల ప్రయోజనం ఉండదని ఖండితంగా చెప్పాడు. మమ్మల్ని విడిచిపెట్టే ఉద్దేశం బ్రిటిష్ ప్రభుత్వానికి లేదు కాబట్టి దీనిపై దొంగ సాక్ష్యాలను సృష్టించి విచారణను వేగంగా పూర్తిచేయడానికి ఏర్పాటు చేస్తుందంటూ తెల్లదొరల అంతరంగాన్ని ముందే పసిగట్టి తండ్రికి తెలియజేశారు భగత్‌సింగ్.' అని ఉంది. వాస్తవానికి భగత్ సింగ్ తండ్రికి రాసిన ఉత్తరంలో 'సిద్ధాంతాలను బలిపెట్టే అంత విలువైనది కాదు నా జీవితం!' 'ఈ కేసులో ప్రతి పనీ ఒక (నిర్దుష్టమైన) ఎత్తుగడను అనుసరించి నడుచుకుంటూ వస్తున్నాం. నా ప్రతి పనీ ఆ ఎత్తుగడను అనుసరించి మా సిద్ధాంతాలకు మా కార్యక్రమాలకు అనుగుణంగా సాగాలి' అంటాడు భగత్ సింగ్. తండ్రి చేసిన ప్రయత్నాన్ని భగత్ సింగ్ తీవ్రంగా అభిశంసించాడు. 'మీకు బదులు మరొకరు ఎవరైనా ఇలా చేసి ఉంటే అతడిని నేను దేశద్రోహి కన్నా తక్కువగా భావించేవాడిని కాదు. అయితే మీపై ఇలాంటి పదప్రయోగం చేయలేను.' అని భగత్ సింగ్ తన సిద్ధాంతాలకు ఏ మాత్రం భంగం కలగని రీతిలో ప్రవర్తించాడు.

తాము సాండర్స్‌ను హత్య చేయలేదని భగత్ సింగ్ బృందం కోర్టులో ఎప్పుడూ వాదించలేదు. బ్రిటీష్ రాజ్యపు బూటకపు విచారణ తంతును బహిర్గతం చేయడానికి భగత్ సింగ్ ప్రయత్నించాడే తప్ప వారి ముందు ఏ రూపంలోనూ లొంగడానికి పూనుకోలేదు. భగత్ సింగ్ తన తండ్రికి రాసిన ఉత్తరాన్ని, సావర్కర్ బ్రిటిష్ వారికి రాసి ఇచ్చిన లొంగుబాటు పత్రాలతో పోల్చి చూడడం కద్దు. తాను ఉరికంబం ఎక్కబోయే చివరి క్షణాలలో కూడా 'లెనిన్ గురించి క్లారా జెట్కిన్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని చదువుతూ యువతరానికి లెనిన్‌ను అనుసరించమని భగత్ సింగ్ ఒక సందేశం అందించాడన్నది గమనించదగ్గ విషయం.

వ్యాస రచయిత నరేష్, భగత్ సింగ్ గురించిన వాస్తవాలు చెబుతున్నట్లే రాస్తూ కీలకమైన అంశాలను పాఠకుల దృష్టికి రానీయకుండా చేయడం వెనక అవగాహన సమస్యలు మాత్రమే ఉండి, దురుద్దేశాలు లేకుండా ఉంటే మంచిదే!

• దివికుమార్
భగత్‌సింగ్‌పై 'ఉరికంబం సాక్షిగా...' పుస్తక రచయిత

ఈద్ ముబారక్

రంజాన్‌ను పురస్కరించుకుని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఈద్ నమాజ్ జరిగింది. ముస్లిం సోదరులు భారీగా హాజరై నమాజ్ చేశారు.







కనకదుర్గమ్మ

చైత్రమాస వసంత నవరాత్రుల్లో భాగంగా రెండో రోజైన సోమవారం దుర్గమ్మను కనకాంబరాలు, గులాబీలతో అర్చించారు. 6

రూ.250 కోట్ల పబ్లిక్ ట్రస్ట్ భూమి

గోవిందా..!

పటమట గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములకు రెక్కలు

- భూముల అన్యాక్రాంతం.. లీజుదారులు, ట్రస్టీల కుయుక్తులు
- భూములను కాపాడుకోలేని స్థితిలో దేవదాయ శాఖ
- ఏడాది కిందటే నివేదిక ఇచ్చినా చర్యలకు మీనమేషాలు
- లీజుదారుడి వారసుడొకరు రూ.100 కోట్లకు తనఖా
- వైసీపీ హయాంలో వత్తాసు పలికిన వెలంపల్లి, మల్లాది
- తాజాగా ట్రస్ట్ భూములను అమ్ముకోవటానికి ట్రస్టీ ప్రయత్నాలు
- ఆస్తులు అమ్మటం అసాధ్యమని తేల్చిన విచారణాధికారి



పటమటలోని గోవిందరాజుల ట్రస్ట్ భూములు

దేవదాయ శాఖ అధీనంలోని రూ.250 కోట్ల పైబడి విలువ చేసే పటమట గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా ఈ భూములకు రెక్కలొచ్చాయి. పబ్లిక్ ట్రస్టుకు చెందిన భూములను రక్షించాల్సిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు.. కనీసం కిందిస్థాయి అధికారులు నివేదికలు ఇస్తున్నా పట్టించుకోవట్లేదు. లీజుదారుడి వారసులు డాక్యుమెంట్లు సృష్టించి రూ.100 కోట్ల మేర రుణం తీసుకోవడంతో పాటు ట్రస్టుకు చెందిన వారసులు ఈ భూములు తమవంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. కొందరు అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపారన్న ఆరోపణలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గోవిందరాజు వంశీకులు వారి పూర్వీకుల నుంచి సంక్రమించిన పటమటలోని సర్వే నెంబర్ 91/2లోని 5.92 ఎకరాల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. దీనికి సంబంధించిన ధర్మ శాసనం లేకపోవటంతో 1947లో డాక్యుమెంట్ నెంబర్ 949 ద్వారా ఆ ట్రస్ట్ భూమికి సంబంధించి డీడ్ రిజిస్టర్ చేశారు. గోవింరాజుల వంశీకులైన గోవిందరాజు రాఘవరావు, గోవిందరాజు పూర్ణచంద్రరావు, గోవిందరాజు వెంకటేశ్వరరావు, గోవిందరాజు వెంకట దత్తాత్రేయశర్మ, గోవిందరాజు వెంకటేశ్వరరావులు మొత్తం ఐదుగురు రిజిస్టర్డ్ డీడ్ చేసిన వారిలో ఉన్నారు. అప్పటి డీడ్ రిజిస్టర్ ప్రకారం.. ఈ ఆస్తిని జాగ్రత్తగా కాపాడాలని, ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని నాలుగు భాగాలు చేయాలని నిర్దేశించారు. ఒక భాగాన్ని గోవిందరాజుల వంశీకుల్లో కానీ, మరెవరికైనా కానీ, ఆయుర్వేదం, మరేదైనా విద్యనభ్యసించే విద్యార్థికి ఖర్చు చేయాలని నిర్దేశించారు. రెండో భాగాన్ని దివ్యాంగులకు, పేదలకు అన్నదానం నిర్వహించటానికి ఖర్చు పెట్టాలని నిర్దేశించారు. మూడో భాగాన్ని వారి సొంతంగా కానీ, ఇతరుల ద్రవ్యంతో కానీ శివాలయం మిగతా 6లో..

లీజుదారుడి వారసుల రూ.100 కోట్ల రుణం

ట్రస్టుకు సంబంధించిన భూముల్లోని ఓ లీజుదారుడు అనారోగ్య సమస్యల కారణంగా మృతిచెందారు. ఈ క్రమంలో ఆ లీజుదారుడి వారసుడు ఈ భూమి పేరుతో వేరే డాక్యుమెంట్లు సృష్టించి ఓ జాతీయ బ్యాంకులో రూ.100 కోట్ల రుణం తీసుకున్నట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణులు వీరికి అండగా నిలవటంతో ఈ వ్యవహారం మరుగున పడింది. ఆ తర్వాత బ్యాంకుకు డీఫాల్టర్ కావటంతో ఆ బ్యాంకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం వడ్డీతో కలిపి డీఫాల్టర్ అయిన వ్యక్తి రూ.200 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. ఈ ల్యాండ్ పబ్లిక్ ట్రస్టుకు సంబంధించినదని తెలుసో, తెలియకో కానీ, ఇప్పటివరకు దేవదాయ శాఖ అధికారులను బ్యాంక్ యాజమాన్యం సంప్రదించలేదని తెలుస్తోంది. ఈ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్షన్ వేసే పరిస్థితి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

పులిగడ్డలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు
- మృతులది గుంటూరు జిల్లా తెనాలిగా గుర్తింపు





అరుణ మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది, మృతుడు మోహన్‌బాబు (ఇన్‌సెట్లో)

వారసుడు పుట్టాడని ఆనందంగా దైవ దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఉసురు తీసింది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలుజేసింది. ఈ హృదయ విదారక ఘటన అవనిగడ్డ మండలం పులిగడ్డ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది.

అవనిగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఐటీసీ(ఇండియా టొబాకో కంపెనీ) ఉద్యోగిగా పని చేస్తున్న గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతానికి చెందిన గిడుగు సందీప్‌కు రెండు నెలల క్రితం కుమారుడు పుట్టగా, మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భార్య, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులతో కలసి ఆల్టో కారులో సోమవారం మోపిదేవికి బయలుదేరారు. పులిగడ్డ - పెనుమూడి వారధి, టోల్ గేట్ల నడుమ కాకినాడ నుంచి పామాయిల్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని కారు రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీటులో ఉన్న సందీప్ తండ్రి జి.ఆర్.మోహన్‌బాబు(60), వెనుక కూర్చున్న తల్లి అరుణ (55) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక(5), తల్లి ఒడిలో ఉన్న షణ్ముఖ్(2 నెలలు), డ్రైవింగ్ సీటులో ఉన్న సందీప్ తీవ్రంగా మిగతా 6లో..

పాపం పసివారు





మృతులు సాత్విక, షణ్ముఖ్

కోల్డ్ స్టోరేజీ బాధిత రైతుల్లో

ఉత్కంఠ

- పద్దులు సిద్ధం చేస్తున్న యాజమాన్యం
- నేడు మరో విడత సమావేశం

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట) : కోల్డ్ స్టోరేజీలో రైతులు దాచుకున్న పంటకు ధర కట్టి అందజేయాలని సూత్రప్రాయంగా అంగీకరించిన కోల్డ్ స్టోరేజీ యాజమాన్యంతో మంగళవారం సాయంత్రం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మరో దఫా చర్చలు జరిపేందుకు సిద్ధమవుతోంది. గత శనివారం రాత్రి జరిగిన తొలి సమావేశంలో రైతులకు పరిహారం ఇచ్చేందుకు స్టోరేజీ యాజమాన్యం సూత్రప్రాయంగా అంగీకరించిన విషయం తెలిసిందే. కాగా, ఏఎంసీ కార్యాలయంలో సెక్రటరీ ఎన్వీ నరసింహారావు, తహసీల్దార్ మనోహర్, సీఐ పి.వెంకటేశ్వర్లు సమక్షంలో కోల్డ్ స్టోరేజీ ప్రతినిధి హరి నరసింహారావు.. రైతులు పెట్టుకున్న మిర్చి రకాలకు ధరలు నిర్ణయించారు. తేజా రకానికి క్వింటాల్‌కు రూ.13 వేలు, షార్ప్‌కు రూ.12 వేలు, ఆర్మూరు, క్లాసిక్, బోనగిరి రకాలకు రూ.10,500, లావు తాలుకు రూ.4,500, తేజా రకం తాలుకు రూ.6,500, కందులకు రూ.8 వేలు, బొబ్బర్లకు రూ.7,200, జొన్నలకు రూ.4,500, పెసలుకు రూ.7,500, మినముకు రూ.7 వేలు, శెనగలకు రూ.5 వేల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. తమ వద్ద ఉన్న రైతుల పద్దుల ఆధారంగా వారికిచ్చిన రుణం, అద్దెలు పోనూ విగిలినది ఎంత ఇవ్వాలో తేల్చేందుకు యాజమాన్యం సమయం కోరగా, మూడు రోజుల గడువిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం యాజమాన్యం తాము సిద్ధం చేసిన రైతుల చిట్టాను వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఉత్కంఠ మిగతా 6లో..

పైసామే ప్రమాణాలు

ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత లేకపోయినా ఉన్నట్టు ధ్రువీకరిస్తారు. ఎలాంటి ప్రమాణాలు పాటించకపోయినా హాల్‌మార్క్ గుర్తింపునిస్తారు. నాణ్యత అధ్వానంగా ఉన్నా అద్భుతంగా ఉన్నట్టు తేల్చేస్తారు. ఇదీ బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)లో జరుగుతున్న వ్యవహారం. బయటి ప్రపంచానికి పరిచయం లేకుండా ఎక్కడో ఓ మూలన విసిరేసినట్టుగా ఉండే ఈ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా లంచాల బాగోతం నడుస్తోంది. దీనికి ప్రత్యక్ష నిదర్శనమే తాజాగా బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ ముత్యాల రమాకాంత్ సాగర్‌ను అరెస్టు చేయడం.

అక్రమాలమయంగా బీఐఎస్ కార్యాలయం

- ముడుపులిస్తేనే పలు ఉత్పత్తుల నాణ్యత ధ్రువీకరణ
- హాల్‌మార్క్ ఏజెన్సీల గుర్తింపులోనూ చేతివాటం
- లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన జేడీ
- కొనసాగుతున్న అధికారుల విచారణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెంగళూరుకు చెందిన క్రోనాక్స్ సిలిండర్ల కంపెనీ నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు.. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ ముత్యాల రమాకాంత్ సాగర్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లంచం తీసుకున్నందుకు రమాకాంత్ సాగర్‌ను, ఇచ్చినందుకు కంపెనీ ప్రతినిధిని అరెస్టు చేశారు. దీనిపై సీబీఐ అధికారులు విచారణ సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే బీఐఎస్ రాష్ట్ర శాఖ కార్యాలయం విజయవాడలోని ఏపీఐఐసీ కాలనీలో నడుస్తోంది. ఇక్కడ సిబ్బంది చాలా స్వల్పంగా ఉంటారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఉత్పత్తులకు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు లేకపోతే మరోమాట లేకుండా బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించే ఈ అధికారులు.. ఆ తర్వాత తెరవెనుక మంతనాలు నడుపుతున్నారు.

హైదరాబాద్ కేంద్రంగా బేరాలు

రాష్ట్రంలో వివిధ పరిశ్రమలు, కర్మాగారాల్లో తయారైన ఉత్పాదక వస్తువుల నాణ్యతకు సంబంధించి ప్రభుత్వం కొన్ని ప్రమాణాలను నిర్దేశిస్తుంది. వాటి ప్రకారమే ఆ ఉత్పత్తులు మార్కెట్లోకి రావాలి. ఈ ప్రమాణాల ప్రకారం ఉత్పత్తులకు రూపం వచ్చిందా, లేదా అనే అంశాన్ని బీఐఎస్ అధికారులు నిర్ధారిస్తారు. ప్రభుత్వం గుర్తించిన ఉత్పత్తులకు తయారీదారులు కచ్చితంగా బీఐఎస్ నుంచి ధ్రువీకరణ తీసుకోవాలి. ఈ ఉత్పత్తులను పరీక్షించడానికి బీఐఎస్ కార్యాలయంలో ఓ ప్రత్యేక లేబరేటరీ ఉంటుంది. ప్రమాణాలు పూర్తిస్థాయిలో ఉన్న ఉత్పత్తులకు మాత్రమే బీఐఎస్ గుర్తింపునివ్వాలి. ఇక్కడ పనిచేసే అధికారులు ఈ ప్రమాణాలను పక్కన పెట్టేశారు. పైసలు ముట్టిన ఉత్పత్తులకు బీఐఎస్ గుర్తింపును ఇవ్వడం మొదలుపెట్టారు. నగరంలోని కార్యాలయంలో



ముడుపుల బాగోతం తారస్థాయికి చేరిందని కొన్నిరోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ జేడీగా పనిచేస్తున్న రమాకాంత్ సాగర్ హైదరాబాద్ కేంద్రంగా ముడుపుల వ్యవహారాలను సాగిస్తున్నట్టు సీబీఐకి పక్కాగా సమాచారం అందింది. మిగతా 6లో..

విజిలెన్స్

- పోలవరం మట్టి తవ్వకాలపై విచారణ ముమ్మరం
- విజయవాడ రూరల్, గన్నవరం మండలాల్లో మైనింగ్
- వైసీపీ ప్రభుత్వ హయాంలో కాల్వగట్లు మాయం
- కూటమి ప్రభుత్వం రాకతో రంగంలోకి విజిలెన్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోలవరం కాల్వ మట్టి తవ్వకాలపై విజిలెన్స్ విచారణ ముమ్మరంగా జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం మట్టిని అడ్డగోలుగా తవ్వేశారు. విజయవాడ రూరల్, గన్నవరం మండలాల పరిధిలో బరితెగించి మరీ అప్పటి వైసీపీ నాయకుల అనుయాయులు మట్టిని తవ్వుకుపోయారు. పోలవరం కాల్వ కట్ట మీదకు భారీ ఎత్తున ఎక్స్‌కవేటర్లను తీసుకొచ్చి రాత్రీ పగలు తేడా లేకుండా తవ్వేశారు. చూస్తుండగానే గుట్టలను కరిగించేశారు. రోజూ వెయ్యికి పైగా టిప్పర్లలో పోలవరం కాల్వగట్టు మట్టి తరలిపోయేది. అధికారం ఉందన్న అహంకారంతో వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా ఇలా తవ్వుకుపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ వ్యవహారాల లెక్క తేల్చేందుకు విజిలెన్స్‌ను రంగంలోకి దించింది. విజయవాడ రూరల్, గన్నవరం మండలాల పరిధిలో విజిలెన్స్ బృందాలు కొద్దిరోజులుగా కొలతలు తీసుకుంటూ, ఎంత మట్టి తరలిపోయిందో అంచనా వేస్తున్నాయి. ఇరిగేషన్ అనుమతులు కాకుండా.. అనుమతులు లేకుండా సాగించిన తవ్వకాలపై దృష్టి సారించాయి. స్థానికంగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులను కూడా పరిగణనలోకి తీసుకున్నాయి. మరో వారంలో పోలవరం కాల్వగట్టుపై ఎంత మేర అక్రమ మైనింగ్ జరిగిందో విజిలెన్స్ అధికారులు లెక్కలు తేల్చనున్నారు.

సీఎం చంద్రబాబు నందిగామ పర్యటన 5న

నందిగామ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నందిగామ పర్యటన ఖరారైంది. ఏప్రిల్ 5వ తేదీన జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తారు. అనంతరం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పార్టీ ముఖ్యులతో శ్రీకర్ ఫంక్షన్ హాలులో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

'కట్ట'పై టిప్పర్లకు బ్రేక్! 6 2,28,813 పెన్షన్లకు రూ.98.11 కోట్లు



కరకట్ట రోడ్డుపై యథేచ్ఛగా తిరుగుతున్న టిప్పరు (ఫైల్‌ఫొటో)

'కట్ట'పై టిప్పర్లకు బ్రేక్!

» కరకట్టపైకి ఇసుక లారీలు, టిప్పర్లు వస్తే కఠిన చర్యలు

» ఇసుక రీచ్ నిర్వాహకులకు అధికారుల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అవనిగడ్డ కరకట్టపై నుంచి రామలింగేశ్వరనగర్ వైపునకు వచ్చే టిప్పర్ల రద్దీ తగ్గింది. విజయవాడ ట్రాఫిక్ అధికారులు స్క్రూబ్రిడ్జి వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది గట్టి హెచ్చరికలు జారీ చేశారు. దీనితోపాటు టిప్పర్లు కరకట్ట నుంచి వస్తే సీజ్ చేస్తామని ఇసుక రీచ్‌ల నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన ఇసుక లోడ్‌తో కరకట్టపై నుంచి రాకపోకలు సాగించడంపై 'కట్ట కష్టం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై విజయవాడ ట్రాఫిక్ విభాగాధికారులు స్పందించారు. రొయ్యూరు, మద్దూరు, చోడవరం వైపు నుంచి వచ్చే ఇసుక టిప్పర్లను యనమలకుదురు అవతలి వైపు నుంచి దారి మళ్లించారు. ఇసుకతో వచ్చే లారీలు, ట్రాక్టర్లు అయినా, ఖాళీగా లోడ్ కోసం వెళ్లే వాహనాలు అయినా కరకట్ట మీదకు వస్తే కచ్చితంగా సీజ్ చేస్తామని రీచ్‌ల నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేశారు. రీచ్‌లు ఉన్న రొయ్యూరు, మద్దూరు, చోడవరం ప్రాంతాలు పూర్తిగా కృష్ణాజిల్లా పరిధిలో ఉంటాయి. దీనితో అక్కడ పోలీసు అధికారులతో సంప్రదించి విజయవాడ వైపు కరకట్ట మీదుగా వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో 2,28,813 పెన్షన్లకు రూ.98.11 కోట్లు

» క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏప్రిల్ 1న ఎన్టీఆర్ భరోసా కింద 2,28,813 పెన్షన్లకు సుమారు రూ.98.11 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల వద్ద పెన్షన్ల పంపిణీ సజావుగా సాగేలా కృషిచేయాలన్నారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌డీఏ పీడీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదల సేవలో స్ఫూర్తికి అనుగుణంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేలా దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఉదయం 7 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించి, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పంపిణీ సమయంలో ఇబ్బందిలేకుండా ఉండేందుకు పెన్షన్ రకాన్ని బట్టి నగదు మొత్తాన్ని బండిల్‌గా సిద్ధం చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పెన్షన్ పంపిణీ చేయాల్సి వస్తే అందుకు తగిన కారణాన్ని ఎన్టీఆర్ భరోసా మొబైల్ యాప్‌లో నమోదు చేయాల్సి వుంటుందని, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, పాఠశాల లేదా కళాశాలలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు, సిగ్నల్ సమస్య నరేగా పనిప్రాంతం తదితర కారణాలను నమోదు చేయాల్సి వుంటుందన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. టెలీకాన్ఫరెన్సులో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తులసీరెడ్డి, లక్ష్మణరెడ్డి, వడ్డే, అక్కినేని వనజ

జనాభా ఆధారిత పునర్విభజనపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

» రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన

గవర్నర్‌పేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జనాభా ఆధారిత పునర్విభజన (డీ లిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతోందని అఖిలపక్ష సమావేశంలో వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన సమావేశానికి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి చర్చించాలని, తద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ సభ్యుల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదాన్ని నివారించగలమన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ ఛైర్మన్ ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ, జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతోందని ఆరోపించారు. ప్రస్తుతమున్న జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదని, దీన్ని మనమంతా వ్యతిరేకించాలన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల కంటే యూపీ, బిహార్‌కు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తోందన్నారు. లోక్‌సభ సీట్లు కోల్పోతున్న రాష్ట్రాలకు రాజ్యసభ సీట్లు కేటాయించాలని కోరారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, అమెరికా సెనెట్‌లో 100 స్థానాలు ఉన్నాయని, జనాభా పరిమాణంతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికీ ఇద్దరు చొప్పున సెనెట్‌లను కేటాయించారని గుర్తుచేశారు. సీపీఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, బీజేపీ.. దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని, కేంద్ర నిధుల్లో 60 శాతానికిపైగా కేవలం ఏడు రాష్ట్రాలకే కేటాయిస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, సామాజిక విశ్లేషకుడు కె.వసుంధర, కొలనుకొండ శివాజీ తదితరులు ప్రసంగించారు. అనంతరం నాలుగు ప్రధాన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ

ఘంటసాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. మసీదు నుంచి ప్రధాన సెంటర్ మీదుగా బ్యాంక్ సెంటర్‌వరకు ర్యాలీ కొనసాగింది. స్వాతంత్ర్యం కోసం ముస్లింలు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని, ప్రాణాలు సైతం త్యాగం చేశారన్నారు. ఆనాడు ముస్లిం కమ్యూనిటీ కోసం ఇచ్చిన ఆస్తులను కాజేయటానికి కేంద్ర ప్రభుత్వం యత్నం చేస్తోందని విమర్శించారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఘంటసాలలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టామని, వక్ఫ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షులు ఎస్‌కె.భాషా, ఎస్‌కె.మహబూబ్ సుభాని, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

శక్తిరూపిణీ.. నమోస్తుతే

» ఇంద్రకీలాద్రిపై వైభవంగా పుష్పార్చన



దుర్గమ్మకు రెండోరోజున కనకాంబరాలు, గులాబీలతో పుష్పార్చన, పూజల్లో పాల్గొన్న భక్తులు

ఇంద్రకీలాద్రి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్ర మాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని రెండో రోజైన సోమవారం దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో పుష్పార్చన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాజగోపురం నుంచి డీఈవో రత్నరాజు, అర్చకస్వాములు, ఉద్యోగులు పూల గంపలను అమ్మవారి సన్నిధికి తీసుకుని వెళ్లారు. పూజా మండపం (నటరాజ స్వామి ఆలయ ప్రాంగణం)లో ఉదయం 9 గంటలకు పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకస్వాములు అమ్మవారికి లలితా సహస్రనామాలతో పుష్పార్చనను వేదోక్తంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కనకాంబరాలు అంటే ప్రీతి. కనకాంబరాలతో పాటు అమ్మవారి శక్తి రూపం ఎర్రటి రంగు పూలను అర్చించటం జరుగుతుంది. ఈ క్రమంలో గులాబీలను అమ్మవారికి సమర్పించారు. కాగా అర్చకులు, ఉద్యోగులపై డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారికి పూజలు నిమిత్తం పూజా మండపం వద్దకు వెళ్లే సమయంలో అమ్మవారి దర్శనానికి సినీనటుడు పృథ్వీరాజ్ విచ్చేయగా డీఈవో ఆగి మాట్లాడారు. అర్చకులు, ఉద్యోగులు పూజా కార్యక్రమానికి సమయం అవుతుందని వేదిక వద్దకు వెళ్లడంపై తాను వచ్చే వరకు ఆగలేరా.. డీఈవో అంటే లెక్కలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



పుష్పార్చనకు పూలు తీసుకువెళుతున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, అధికారులు, అర్చకులు, భక్తులు



భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి : ఈవో

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈవో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ కౌంటర్లలో పెద్దఎత్తున భక్తుల నుంచి ఫిర్యాదులు రావటంతో సోమవారం ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది భక్తుల నుంచి డబ్బులు వసూలు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ కౌంటర్ కాంట్రాక్టర్ తన సిబ్బందిని క్యూలైన్‌ల వద్ద ఏర్పాటు చేసి భక్తులను తనిఖీ చేయటమేవిటని ప్రశ్నించారు. భక్తులను తనిఖీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులను తనిఖీ చేసిన సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఈవో ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ ఆలయంలో పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించి అమ్మవారి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





ద్వీపంలో భారీ ఎత్తున చెట్లను కట్టర్లతో తొలగిస్తున్న సిబ్బంది

భవానీ ద్వీపానికి మోక్షం

» ముందుగా పునరుద్ధరణ పనులు.. తర్వాత అభివృద్ధికి చర్యలు

» భారీ చెట్లు, ఇసుక మేటల తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భవానీ ద్వీపం పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. వరదల కారణంగా అతలాకుతలమైన ద్వీపాన్ని మరల అభివృద్ధి దిశగా నడిపించటానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. 'ఆపరేషన్ భవానీ ద్వీపం' పేరుతో భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్(బీఐటీసీ), ఏపీటీడీసీ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఏపీటీడీసీ ఎండీ నూకసాని బాలాజీ భవానీ ద్వీపాన్ని సందర్శించి జరుగుతున్న పనులను సమీక్షించారు. చేపట్టవలసిన అంశాలపై తగిన సూచనలు చేశారు. భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ ఈడీగా ఉమామహేశ్వరరావు తిరిగి రావటం వల్ల గతంలో ఇక్కడ చేపట్టిన పనులకు సంబంధించి పూర్తి అవగాహన ఉండటం కలిసొస్తోంది. వరదల కారణంగా కకావికలమైన భవానీ ద్వీపాన్ని ముందుగా పునరుద్ధరించి సాధారణ స్థితికి తీసుకువచ్చి ఆ తర్వాత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. ముందుగా ద్వీపం పునరుద్ధరణ పనులు చేపట్టారు. వరదలకు భారీగా కొట్టుకు వచ్చిన ఇసుక గుట్టల తొలగింపు పనులు చేపట్టారు. ఎకరాల విస్తీర్ణంలో మేట వేసుకుపోయిన ఇసుకను తొలగించటానికి పెద్ద ఎత్తున జేసీబీలను ఉపయోగిస్తున్నారు. ఇసుకను పూర్తిగా బయటకు తరలిస్తున్నారు. అలాగే చెట్లు పడి పాత్‌వేలన్నీ కూడా కనిపించకుండా పోయాయి. చెట్లు కూడా ఎకరాల విస్తీర్ణంలోనే ఉన్నాయి. దీంతో ట్రీ కట్టర్స్‌ను పిలిపించి ఆధునిక యంత్రాలతో పాత్‌వేల మీద ఉన్న చెట్లను తొలగించే పనులు చేపడుతున్నారు. ఒకటి, రెండు నెలల్లో పనులు పూర్తి చేసిన తర్వాత.. అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎంత భారీ వరద వచ్చినా భవానీ ఐల్యాండ్ దెబ్బతినకుండా ఉండేలా ఫైల్ షీటింగ్, ఫెన్సింగ్ స్టోన్ ఫార్మేషన్, రిటైనింగ్ వాల్ వంటి అంశాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నారు.రీటెయినింగ్ వాల్ ఏర్పాటు చేయాలంటే బాగా ఖరీదైన వ్యవహారం కావటంతో షీట్ ఫైలింగ్ కానీ, ఫెన్సింగ్ స్టోన్ ఫార్మేషన్ వంటి విధానాలను అవలంబించాలని భావిస్తున్నారు. భవానీ ద్వీపంలో వినోదాత్మక ప్రాజెక్టులపై దృష్టి సారించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు.



భవానీ ద్వీపంలో పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఏపీటీడీసీ అధికారులు

దైవ దర్శనానికి వెళుతూ అనంతలోకాలకు..

(5వ పేజీ తరువాయి)

గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారుకు ఇరుక్కుపోయిన మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్విక, సందీప్, పల్లవిలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు సీటు వెనుక పసికందు

క్షతగాత్రులందరినీ ఆస్పత్రికి తరలించటం పూర్తయిందని భావించిన పోలీసులు ప్రమాద స్థలం నుంచి కారును వెనక్కి తీయగా, కారులో సీటు వెనుక పడిన రెండు నెలల పసికందు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పసికందును తీసుకొచ్చారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి అరగంట కావడంతో పసికందును కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తీవ్రంగా గాయపడిన స్వాతికకు రెండు మార్లు వైద్యులు సీపీఆర్ చేశారు.



ఆసుపత్రిలో పసికందుకు చికిత్స చేస్తున్న వైద్యులు

అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో బెలూన్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే సాత్విక మృతి చెందింది. సందీప్ భార్య పల్లవి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను, కాలు, పక్కటెముకలకు తీవ్ర గాయాలైన సందీప్‌ను కూడా మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నా వాళ్లు ఎక్కడ?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్ షాక్‌లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపు తానెవరు, ఎక్కడి నుంచి వస్తుంది కూడా చెప్పలేకపోయిన సందీప్ కొద్దిసేపటి తర్వాత తాము గుంటూరు జిల్లా తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు తెలిపారు. నాకేమైంది.. ఇక్కడెందుకు ఉన్నాను.. నా వాళ్లు ఎక్కడ అంటూ సందీప్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు, వైద్య సిబ్బంది తల్లిదండ్రులు, కుమార్తె, కుమారుడు మరణించారని సమాధానం చెప్పలేక కంటతడి పెట్టుకున్నారు. సందీప్ ఫోన్‌కు తెలిసిన వారి నుంచి ఫోన్ రావడంతో వారు తెనాలి చెంచుపేటకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారి బంధువులను అవనిగడ్డ రావాల్సిందిగా సూచించారు. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ నాగమణిలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మచిలీపట్నం తరలించారు. జి.ఆర్.మోహన్‌బాబు, అరుణ, షణుఖ్ మృతదేహాలను అవనిగడ్డ మార్చురీకి తరలించగా, మచిలీపట్నం వెళ్తూ మార్గమధ్యలో మృతి చెందిన సాత్విక మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

గోవిందా..!

(5వ పేజీ తరువాయి)

నిర్మించాలని పేర్కొన్నారు. శివాలయం కట్టే వరకు యనమలకుదురు కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామికి ఏటా కార్తీక, మాఘమాసాల్లో గోవిందరాజు వంశీకుల గోత్రాలతో రోజూ ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన చేయించాలని పేర్కొన్నారు. ఇక నాల్గో భాగాన్ని గో సంరక్షణ కోసం ఒక్క ఆవునైనా ఆ స్థలంలో ఉంచి పశుపోషణకు వినియోగించాలన్న నియమం పెట్టారు. కాలక్రమంలో ఈ సంస్థ దేవదాయ చట్టం 1966, సెక్షన్ 38 ప్రకారం రిజిస్టర్ అయింది. ట్రస్టీ ఆధీనంలో ఉండగానే ఈ భూమిని లీజుకిచ్చారు. తొలుత ఈ భూమిలో ఓ ఎకరాన్ని ఓ ప్రైవేట్ వ్యక్తికి సంవత్సరానికి రూ.500 చెల్లించే ప్రాతిపదికన లీజుకిచ్చారు. మరో ఎకరాన్ని ఆలయం నిర్మాణం కోసం వదిలారు. మిగిలిన 3.92 ఎకరాలను ఆంధ్రా ఆయిల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, సురేంద్ర కాటన్ ఆయిల్ మిల్స్ వారికి ఏడాదికి రూ.3,800 లీజు ప్రాతిపదికన ఇచ్చారు.

విక్రయానికి ట్రస్టీ విశ్వప్రయత్నాలు

గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టీగా ఉంటున్న వారు కూడా 1.92 ఎకరాలను అమ్మటానికి నిర్ణయించుకున్నారు. దీనికోసం వారు విజయవాడ కోర్టులో కేసు వేశారు. ఆ భూమిని అమ్ముకోవటానికి ఆర్డర్ కూడా తెచ్చుకున్నారు. 1947లో గోవిందరాజుల వంశీయులు ఈ భూములను ధర్మ కార్యకలాపాలకే వినియోగించాలని నిర్దేశించారు. పైన చెప్పుకొన్నట్టుగా ఈ భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా నాలుగు భాగాలుగా చేసి ఏం చేయాలన్న దానిపై స్పష్టత ఇచ్చారు. అప్పట్లో ఈ భూముల పరిరక్షణకు సంబంధించి ధర్మశాసనం లేకపోవటంతో గోవిందరాజుల వంశీకులంతా కలిసి రిజిస్టర్ డీడ్ రాశారు. ఇవన్నీ ఉన్నప్పటికీ ఏ ప్రాతిపదికన ట్రస్టీ భూములను అమ్ముకోవడానికి కోర్టుకు వెళ్లడం గమనార్హం.

ట్రస్టీ భూస్వామి కాలేడు : అసిస్టెంట్ కమిషనర్‌కు నివేదికలో ఈవో

గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములకు సంబంధించి విచారణ చేపట్టిన మచిలీపట్నం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈవో... ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌కు నివేదికను అందించారు. దీనిప్రకారం పబ్లిక్ ట్రస్టుగా ఉన్న ఈ సంస్థ భూములను ఎప్పటికీ ప్రైవేట్ ట్రస్టుగా మార్చే అవకాశం లేదని స్పష్టతనిచ్చారు. పబ్లిక్ ట్రస్ట్ ఆస్తులకు సంబంధించి సీలింగ్ చట్టం వర్తింపుపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దేవదాయ చట్టం 30/87లోని సెక్షన్ 1, 2ను అనుసరించి గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు దేవదాయ చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. విజయవాడ కోర్టులో ఆ భూమిని విక్రయించుకోవటానికి అనుమతి పొందటమనేది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు భిన్నమని వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో పలు హైకోర్టు తీర్పులను కూడా ఆయన ఉదహరించారు. పబ్లిక్ ట్రస్టుకు సంబంధించిన భూములను ప్రైవేట్ ట్రస్టుగా భావించడం తగదని, ట్రస్టీ ఎప్పటికీ భూస్వామి కాలేడని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు విరుద్ధంగా, ఏదో ఒక ఆర్డర్‌ను ఆధారంగా చేసుకుని పబ్లిక్ ట్రస్ట్ ఆస్తిని అమ్మడం అనేది క్రిమినల్ చర్యగా పేర్కొన్నారు. ట్రస్టీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ట్రస్టీకి నోటీసులిచ్చి తాత్కాలికంగా తొలగించి, మరొకరిని నియమించాల్సిన అవసరం కూడా ఉందని సూచించారు. సంస్థకు జరిగిన నష్టాన్ని ట్రస్టీ నుంచి రాబట్టాలని కూడా ఆయన ఆ నివేదికలో విజ్ఞప్తి చేశారు.

రేపు ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన : ఫ్యాప్టో

గవర్నర్‌పేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యలపై ఏప్రిల్ 2న విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, సెక్రటరీ జనరల్‌లు అలపాల సుందరయ్య, ఇంటి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి, పీఆర్సీ కమిషనర్ నియామకం చేయాలని, ఈలోగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్న డిమాండ్‌లతో పాటు అపరిష్కృత సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలకు ఫ్యాప్టో పిలుపు నిచ్చినట్టు వెల్లడించారు.

నేడు సోషల్ పరీక్షకు ఏర్పాట్లు చేయండి

» డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి సోషల్ పరీక్ష రాసే విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తాగునీటి ఏర్పాట్లు చేయాలని డీఈవో రామారావు తెలిపారు. ఎండలు ముదురుతున్న దృష్ట్యా మంగళవారం నిర్వహిస్తున్న పరీక్ష రాసే విద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించాలన్నారు. చివరి పరీక్ష రోజున పుస్తకాల కాగితాలు చించడం అలవాటై పోయిందని, ఈ అలవాటు మాన్పిస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు.

ఎన్ఎస్‌పీ కాలువలో పడి ఉద్యోగి మృతి



నాగేంద్ర (ఫైల్)

విస్సన్నపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌పీ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చిలకమర్రి నాగేంద్ర (45) ఎన్ఎస్‌పీ కాలువలో పడి మృతి చెందాడు. ఆదివారం ఆఫీసుకని బయలుదేరిన భర్త సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్ పని చేయకపోవడంతో అనుమానంతో అతడి భార్య అనూష పోలీసులను సంప్రదించారు. పోలీసుల విచారణలో సోమవారం మద్దులపర్వ ఎన్ఎస్‌పీ లాకుల వద్ద నాగేంద్ర మృతదేహం గుర్తించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఏఎస్సై సక్రు నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో నటుడు శర్వానంద్

మోపిదేవి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సినీ నటుడు శర్వానంద్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందజేశారు.

పైసామే ప్రమాణాలు

(5వ పేజీ తరువాయి)

ప్రమాణాల స్థాయి ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. నాసిరకంగా ఉత్పత్తులను తయారు చేసిన సంస్థలు బీఐఎస్‌లోని అధికారులకు ముడుపులు ముట్టజెప్పి ధ్రువీకరణను పొందుతున్నాయి.

హాల్‌మార్క్ గుర్తింపులో రూ.లక్షలు

బంగారం వస్తువులపై హాల్‌మార్క్ తప్పనిసరైంది. హాల్‌మార్క్ ఉన్న వస్తువులకు మార్కెట్ విలువ ఎక్కువ. ఈ హాల్‌మార్క్‌ను ఇచ్చేందుకు కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. వాటికి లైసెన్స్‌ను బీఐఎస్ ఇస్తుంది. ఈ లైసెన్స్‌ల జారీలోనూ భారీగా ముడుపులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో లైసెన్స్‌కు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం.

ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

నెలకొంది. ఇటు కోల్డ్ స్టోరేజీ నుంచి ఏఎంసీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఏసీకే రికార్డులు, అటు రెవెన్యూ అధికారుల వద్ద రైతులకు కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం ఇచ్చిన స్లిప్పుల ఆధారంగా ఓ జాబితాను సిద్ధం చేశారు. ఈ మూడింటి ఆధారంగా రైతులకు ఎంత మేర బకాయిలు చెల్లించాల్సి ఉందో కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం తేల్చాల్సి ఉంటుంది. కాగా, రైతుల లెక్కలు తేల్చేందుకు కోల్డ్ స్టోరేజీ ప్రతినిధులు గడువు కోరినా అధికారులు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో యాజమాన్యం ప్రకటనపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162,171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

జోరుగా పన్ను వసూళ్లు

కార్పొరేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఇంటిపన్ను, ఖాళీస్థలాల పన్ను బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీతో చివరి రోజు సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రూ.6 కోట్ల వసూళ్లు జరిగాయని విజయవాడ నగరపాలకసంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ ప్రకటించినప్పటి నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రూ.30 కోట్ల వసూళ్లు జరిగాయని ఆయన తెలిపారు.

వచ్చే రంజాన్‌కు ఈద్గా నిర్మాణం పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వచ్చే రంజాన్‌కు ఈద్గా నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 12వ డివిజన్ జన్మభూమి వంతెన వద్ద సూర్యా స్కూల్ సమీపంలో రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



రంజాన్ ప్రార్థనల్లో గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్‌లు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భగా గద్దె మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో ప్రాముఖ్యమైన ఈద్గా నిర్మాణాలకు స్థలాలు ఎక్కడ అవసరమో గుర్తించి నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. ఈ ప్రాంతంలో ఈద్గా నిర్మాణానికి స్థలం సేకరించి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీలకు చెందిన గజం స్థలం కూడా కబ్జాకు గురి కాకుండా చూస్తామన్నారు. లాయర్ మతిన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై ముస్లింలు చాలా ఆందోళనగా ఉన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో నజీర్ అహమ్మద్ హంబ్రీ, పొట్లూరి సాయిబాబు, సాయిన బుజ్జి, ముస్లిం పెద్దలు రహ్మతుల్లా, అబ్దుల్ కాలీబ్, అబ్దుల్ కరీం, పటాన్ హైయత్‌ఖాన్, షేక్ అబినహీమ్, అబ్దుల్ వాహిద్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తు పల్లాలతో ప్రమాదకరం

● బెంజిసర్కిల్ నుంచి పటమట రామాలయం వరకు రోడ్డంతా ఒక్కోచోట ఒక్కోలా ● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: బెంజిసర్కిల్ నుంచి పటమట రామాలయం వరకు రోడ్డు ఎత్తు పల్లాలతో ప్రమాదకరంగా ఉంది. బెంజిసర్కిల్ నుంచి ప్రారంభమయ్యే రోడ్డులో రోడ్డుకు మధ్య ఉన్న డివైడర్ నుంచి ఎడమ వైపు కాస్తా బాగానే ఉంది. కాని సగం నుంచి డ్రెయిన్ వరకు రోడ్డు మూడు నాలుగు అంగుళాల ఎత్తు లేదా పల్లంతో ఒక్కోచోట ఒక్కోలా ఉంటుంది. ఇది రాత్రి వాహనాల వెలుగులో మాత్రమే కనబడుతుంది. మాములు సమయంలో తారు రోడ్డు మొత్తం నల్లగా కనబడుతుంది. దీంతో బస్‌లు, కార్ల వెనుక వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహనదారులకు రోడ్డు స్థితి కనబడక వాహనం ఎడమ వైపు లాగేస్తుండటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి జాగ్రత్త పడాల్సి వస్తోంది. ఒక్కోసారి ద్విచక్రవాహనదారులు బండి అదుపు తప్పి కింద పడి గాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డును సరిచేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



బెంజిసర్కిల్ నుంచి పటమట రామాలయం వరకు ఎత్తు పల్లాలుగా ఉన్న రోడ్డు

దుర్గగుడిలో నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు పలువురు దాతలు ఆలయ అధికారులకు విరాళాలను అందజేశారు. చిలకలూరిపేట, గణపవరానికి చెందిన గ్రంధి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116లు, గుంటూరు జిల్లా వడ్డేశ్వరానికి చెందిన జి.కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు బంగారు గోపురం అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1,00,101లు ఆలయ ఉద్యోగులకు అందచేశారు. ఉద్యోగులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి వేద ఆశీస్సులు అందచేశారు. అనంతరం డిప్యూటీ ఈ.వో ఎం.రత్నరాజు, ఉద్యోగులు దాతలకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

దుర్గగుడి గోపురం తాపడానికి..

హైదరాబాద్‌కు చెందిన వారణాసి శివరామశౌరి, సౌజన్య దంపతులు, కుటుంబ సభ్యులతో సోమవారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి దుర్గగుడి గోపురం బంగారు తాపడానికి అధికారులను కలిసి రూ.లక్ష చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు, అర్చకులు ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న కార్పొరేటర్ అడపా శేషు

కృష్ణలంక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు అన్నారు. సోమవారం రంజాన్ సందర్భంగా కృష్ణలంక పొట్టి శ్రీరాములు హైస్కూల్ సమీపంలో వున్న మసీదుకు వెళ్లి ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రార్థనలు నిర్వహించి అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

● ముస్లిం మతపెద్దల అండదండలతో వుండే వక్ఫ్‌బోర్డును కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వపరం చేయడం దారుణమని అడపా శేషు అన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచించి కేంద్రం పెద్దలతో సంప్రదించాలని ఆయన కోరారు. అనంతరం మసీదు ఎదుట నల్లరిబ్బన్లు ధరించి ముస్లింలతో కలిసి శేషు నిరసన ప్రదర్శన చేశారు. ముస్లిం మతపెద్దలు ఇమామ్, హాజీ, లడ్డు, బాషా, అక్బర్, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కృష్ణలంక నల్లగేటు సెంటర్‌లో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు లొల్లా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు సోమవారం ప్రారంభించారు. తొలిరోజున మజ్జిగ ప్యాకెట్లను స్థానికులకు శేషు అందచేశారు. ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు ఒడుగు సురేష్ వర్మ, చిన్ని, శ్రీను, శేఖర్, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నైతిక విలువలతో జీవితం కొనసాగించాలి

లబ్బీపేట: ప్రతి ముస్లిం ఉపవాసి మాదిరిగానే ఉత్తమ నైతిక విలువలతో జీవితం కొనసాగించాలని మత పెద్దలు మౌలానా మొహమ్మద్ అజీజ్ ఉద్దీన్ సిద్ధిఖీ పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం ఉదయం ఈద్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. భారీగా ముస్లిం సోదరులు ఈ నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెలంతా ఎంతో నిష్టతో పరిశుద్ధ నైతిక జీవితం గడుపుతాడో, మిగిలిన 11నెలలు సైతం అదే జీవితాన్ని గడపాలని అన్నారు. ఇతరుల పట్ల చెడుగా ప్రవర్తించకుండా, చెడుగా మాట్లాడకుండా నైతిక విలువలతో కూడిన జీవితం గడిపేవాడే ముస్లిం అని అన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుతో ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి పాల్గొన్నారు. ఈ ప్రార్థనల్లో నాగుల్ మీరా, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.





నమాజ్‌కు హాజరైన ముస్లిం సోదరులకు రంజాన్ పవిత్రతను వివరిస్తున్న మతపెద్ద



మాట్లాడుతున్న క్రైస్తవ సంఘాల పెద్దలు

పాస్టర్ మృతిపై నిజానిజాలు వెల్లడించాలి

క్రైస్తవ సంఘాల పెద్దలు డిమాండ్

లబ్బీపేట, మార్చి31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ నిజానిజాలు వెల్లడించాలని పలు క్రైస్తవ సంఘాలకు చెందిన మత పెద్దలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ పీస్ ఫోరం ఆధ్వర్యంలో బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని పలు క్రైస్తవ సంఘాల మత పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, అవసరమైతే న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ మృతి కేసును ఛేదించాల్సిన బాధ్యత పోలీసు అధికారులది, ప్రభుత్వానిదేనని, రాష్ట్రంలో ఉన్న క్రైస్తవులపై ఎవరైనా దాడి చేస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు లంకా కరుణాకర్, మన్నా మినిస్ట్రీస్ అధినేత బిషప్ పి.స్వర్ణన్ రాజు, పాస్టర్ భాస్కరరావు, ఏఆర్ స్టీఫెన్‌సన్, పాస్టర్ చాట్లలూధర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన మాస్టర్స్ అథ్లెట్స్‌కు సత్కారం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈనెల 4నుంచి 9వరకు జరిగిన 45వ మాస్టర్స్ అథ్లెటిక్స్ జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన జిల్లాకు చెందిన వారిని ఉగాది సందర్భంగా ఘనంగా సత్కరించారు. స్టేడియంలోని అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వీరిని సత్కరించారు. ఈ పోటీల్లో 13మంది పాల్గొనగా 8మంది మెడల్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పి బి.మెహర్ బాబు మాట్లాడుతూ పతకాలు సాధించిన వీరు నేటి యువ క్రీడాకారులకు ఆదర్శం అని అన్నారు, అనంతరం పతకాలు సాధించిన మాస్టర్స్ అథ్లెట్స్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడుకంది గంగాధరరావు, సెక్రటరీ జి.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన వారితో అసోసియేషన్ సభ్యులు

రాయల్ క్లబ్ సేవలు అభినందనీయం

సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మొగల్రాజపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా ఎదిగిన వారు మరి కొంత మందికి చేయి అందించి వారిని అభివృద్ధి చేయడంలో సహకరించాలని అపుడే సమాజంలో పేదరికం అనేది లేకుండా చేయగలమని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. రాయల్ క్లబ్ అసోసియేషన్ (స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థ) 8వ వార్షికోత్సవం సోమవారం మొగల్రాజపురం అమ్మ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాయల్ క్లబ్ సభ్యులు పేదలకు చేస్తున్న సేవ అభినందనీయం అన్నారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ స్నేహం, సేవ, సహకారం అనే మూడు నినాదాలతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. అనంతరం బొండాడ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బొండాడ రాఘవేంద్రరావుకు రాయల్ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అను గ్రూప్ ఆసుపత్రి చైర్మన్ గాజుల రమేష్, బార్ కౌన్సిల్ సభ్యులు కలిగినీడి చిదంబరం, క్లబ్ కన్వీనర్ పేటేటి పుల్లయ్య, మిరియాల వెంకటేశ్వరరావు, రావిశెట్టి కొండలరావు, యర్రంశెట్టి శివరామకృష్ణ, కార్యదర్శి రంగినీడి వెంకట సుబ్బారావు, కోశాధికారి నూతక్కి సత్యనారాయణ, రాయల్ క్లబ్ విజయవాడ, ఓషో, చింతలపూడి, కైకలూరు, నరసాపురం, ముత్యాలంపాడు, విజయవాడ మహిళా, నరసాపురం మహిళా, అల్లవరం రాయల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తదితరులు

నిరుపయోగంగా కమ్యూనిటీ హాల్

● పేదల శుభకార్యాలకు రవీంద్రకుమార్ హాల్ నిర్మాణం
● వైసీపీ హయాంలో సామాను భద్రపరుచుకునేందుకు వినియోగించిన వైనం
● పార్టీ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న కూటమి

(పటమట, ఆంధ్రజ్యోతి): 11వ డివిజన్ తంగెళ్లమూడి వారి వీధిలో నిర్మించిన కనకమేడల రవీంద్రకుమార్ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా ఉంది. రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ ఎంపీ ల్యాండ్స్ రూ.50 లక్షల నిధులు, విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ నిధులతో నిర్మించారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు శుభ కార్యాలు చేసుకునేందుకు వీలుగా 2020లో ఈ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.

తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిర్లక్ష్యంగా వదిలేసింది. వైసీపీ నాయకుడు ఒక సివిల్ కాంట్రాక్టర్‌కు తన సామాను భద్రపరుచుకునేందుకు ఇవ్వడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మరమ్మతులు చేయించారు.దానిని ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. కానీ ఇప్పటికైనా దాన్ని వినియోగంలోని తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



కనకమేడల రవీంద్రకుమార్ కమ్యూనిటీ హాల్

త్వరలో అందుబాటులోకి

కమిషనర్‌తో మాట్లాడి శుభకార్యాలకు అద్దె నిర్ణయించి బుకింగ్స్ ప్రారంభిస్తాం. త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

-ఉమామహేశ్వరరావు,
ఎస్టేట్ ఆఫీసర్, ఆర్ఐ

పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం

● సూత్రధారులు ఆర్ఐ లైతే... పాత్రధారులు డీలర్లు, ఎండీయూలు
● బియ్యం దళారుల్లో ఒకరిపై గుంటూరు డీఎస్‌ఓ కేసు
● రెండో దళారికి టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో రెండు నెలలు రిమాండ్
● చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఆర్ఐలు

కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి : కృష్ణలంక ప్రాంతంలో రేషన్ బియ్యం (పీడీఎస్) పక్కదారి పడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తూర్పు నియోజకవర్గంలోని పటమట, ఆటోనగర్ లతో పాటు కృష్ణలంక ప్రాంతంలోని 15, 16, 17, 18, 20, 21, 22 డివిజన్లలో ఉన్న రేషన్ డీలర్లు, ఎండీయూల ద్వారా ఇద్దరు దళారులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి హోటళ్లకు, ఇతర వ్యాపారులకు, రైస్‌మిల్లర్లకు చేరవేస్తూ అందినకాడికి దండుకొంటున్నారు. ఎండీయూల వద్ద కిలో పీడీఎస్ బియ్యాన్ని రూ.15 నుంచి 18కు కొనుగోలు చేసి రూ.20 నుంచి 22 రూపాయలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కృష్ణలంక సర్వీసురోడ్డులోని టిఫిన్ సెంటర్ల వారు వీరి నుంచి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇడ్లీ, అట్టు వంటి టిఫిన్లలో వాడుతున్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎన్నిసార్లు దాడులు చేస్తున్నా ఒక్కరు కూడా దొరకడం లేదు. వీరి రాక సమాచారం ముందుగానే కిందిస్థాయి అధికారుల ద్వారా ఎండీయూలకు చేరిపోతుంది. పటమట, కృష్ణలంక ప్రాంత ఆర్ఐల వరకూ ఈ తంతు మొత్తం అందరికీ తెలిసిందే అయినా వారు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక 'ఆంతర్యం' ఏమిటో వారికే తెలియాలి. ఇదే అసరాగా తీసుకొని రామలింగేశ్వరనగర్ నుంచి కృష్ణలంక స్వర్గపురి వరకు వున్న రేషన్‌డీలర్లు, ఎండీయూలను ఓ ఇద్దరు 'పీడీఎస్ బియ్యాన్ని తమకు అమ్మకపోతే అధికారులతో దాడులతో పాటు, విజిలెన్స్ ఎంక్వైరీలు కూడా పడతాయని బెదిరిస్తున్నారంటే వారి హవా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. పీడీఎస్ బియ్యాన్ని కొంటున్న 'నల్ల' బియ్యం దళారులు వీటిని కొందరి రైస్ మిల్లర్లతో పాటు సర్వీసు రోడ్డులోని టిఫిన్ సెంటర్‌లకు కూడా విక్రయిస్తున్నారనేది బహిరంగ రహస్యం.

పీడీఎస్ బియ్యాన్ని ఎండీయూ, డీలర్ల వద్ద కొనే ఓ దళారీ కోడలుకు కృష్ణలంక 21వ డివిజన్‌లో రేషన్ డిపో వుంది. మరొకడి కుమారుడికి 22వ డివిజన్‌లో ఎండీయూ వాహనం వుంది. కోడలు డిపో నుంచి కూడా మామకు పీడీఎస్ బియ్యం బయటి మార్కెట్‌కు తరలిపోతుంటాయి. అలాగే ఎండీయూ వాహనం నుంచి కూడా బియ్యం పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తూర్పు నియోజకవర్గంలోని 90 రేషన్ డిపోలకు గాను దాదాపు 60 నుంచి 70 రేషన్ డిపోలు, 30 మంది ఎండీయూల నుంచి పీడీఎస్ బియ్యాన్ని ఈ ఇద్దరూ బెదిరించి మరీ కొనుగోలు చేసుకుపోతున్నారు. వీరికి పటమట, కృష్ణలంక ఆర్ఐల వత్తాసు వుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరిలో ఒక బియ్యం దళారిని గతంలో గుంటూరు డీఎస్‌ఓ గుంటూరు జిల్లా పెదవడ్లపూడి వద్ద పట్టుకొని కేసు నమోదు చేశారు. మరో దళారి టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయి రెండు నెలలు రిమాండ్‌లో వుండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు వీరి ఆగడాలు నియంత్రించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దళారులకు అండగా వుండే ఉద్యోగుల పాత్రపై విచారణ చేయిస్తాం

పీడీఎస్ బియ్యం కృష్ణలంక, పటమట ప్రాంతంలో పక్కదారి పడుతున్న విషయంపై డీఎస్‌ఓ పాపారావు వివరణ ఇచ్చారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్న వైనంలో ఉద్యోగుల పాత్ర వుంటే వారిపై విచారణ చేయిస్తామన్నారు. కృష్ణలంక, పటమట ప్రాంతాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి టీంలు వేసి ఇన్‌స్పెక్షన్ చేయిస్తామన్నారు.

పాపారావు,
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సీఎం సొంతూరులో సర్వతోముఖాభివృద్ధి



ఇది.. నారా వారి ఊరు

- జడ్పీ హైస్కూలులో ఐఐటీ మద్రాసు పాఠాలు
- యువతకు నైపుణ్య శిక్షణ
- ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్
- గడప గడపకూ తాగునీరు, వంట గ్యాస్

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శేషాచల పర్వతాల పాద భాగంలో పచ్చటి పంటపొలాలు, అడవుల నడుమ ఆవిర్భవించిన నారావారిపల్లె ఒక చిన్న పల్లెటూరు..! తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లె పంచాయతీలో ఓ మజరా గ్రామం. చంద్రబాబు గతంలో 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న సమయంలో టీటీడీ కల్యాణ మండపం, కమ్యూనిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించారు. గతేడాది నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక నారావారిపల్లె అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించడంతో తిరుపతి కలెక్టర్ రంగంలోకి దిగారు. ఇంటింటి సర్వే చేపట్టి కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించి ఆ సమాచారం సీఎం ముందుంచారు. ఆయన సూచనలతో స్వర్ణ నారావారిపల్లె పేరిట సమగ్ర ప్రణాళిక రూపుదిద్దుకుంది. అందులో భాగంగా చంద్రగిరి మండలం కందులవారిపల్లె, ఎ.రంగంపేట, చిన్నరామాపురం పంచాయతీల పరిధిలోని 31 మజరా గ్రామాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లలో.. 2,160 కుటుంబాలకు చెందిన 5,960 మంది జనాభా ఉన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు కుటుంబాల అవసరాలు తీర్చేందుకూ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఈ 2,160 కుటుంబాల్లో 1,830 కుటుంబాలకు సొంత ఇళ్లున్నాయి. 286 కుటుంబాలకు లేవని గుర్తించగా నిబంధనల రీత్యా అర్హత కలిగిన 242 కుటుంబాలకు పీఎంఏవై కింద పక్కా గృహాలు మంజూరు చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి అప్పగిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సదుపాయం లేని 35 కుటుంబాలకు కొద్ది రోజుల్లో వాటిని నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లస్టర్ పరిధిలో 1,202 మందికి వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయి. 137 మంది అర్హులకు మంజూరు కాలేదని గుర్తించారు. 97 మందికి గత నెలలోనే పెన్షన్లు మంజూరు చేశారు. మిగిలిన వారికీ త్వరలో ఇచ్చే ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్లస్టర్ పరిధిలో 87 కుటుంబాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు లేవని సర్వేలో గుర్తించారు. వాటిలో ఇప్పటికే 20 కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వగా.. మిగిలిన వారికి సెప్టెంబరులోపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే 286 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు లేవని తేలగా వారందరికీ వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేశారు.

యువతకు ఉపాధి కోసం శిక్షణ







ఇంటింటి సర్వేలో భాగంగా యువత ఏ రంగంలో శిక్షణ కావాలని కోరుకుంటున్నారో గుర్తించి.. వారికి శిక్షణ కల్పిస్తున్నారు. దానికోసం నారావారిపల్లెలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ గ్రామాల పరిధిలోని 35 మంది మహిళలకు జ్యూట్ బ్యాగ్, ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇచ్చారు. తిరుపతికి చెందిన నారీ ఎన్‌జీవోతో ఒప్పందం కుదిర్చారు. జూడియో సంస్థ మెటీరియల్ ఇస్తే మహిళలు దుస్తులు, కవర్లు కుట్టిచ్చేలా ఒప్పందం కుదిరింది. మరో 33 మంది యువతీయువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. 449 మంది సభ్యులున్న 45 మహిళా సంఘాలకు గత మూడు నెలల్లోనే రూ.6.50 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఆ రుణాల ద్వారా 15 మంది మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు అందజేశారు. వాటికి అవసరమైన రీచార్జింగ్ స్టేషన్ కూడా నారావారిపల్లెలో ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని 7 దుకాణాలకు ఈజీమార్ట్‌తో ఒప్పందం కుదిర్చారు. దుకాణదారులు సరుకుల కోసం తిరుపతికి రాకుండా ఈజీమార్ట్ ద్వారా సరుకులు నేరుగా దుకాణాలకు చేరుతున్నాయి.

ప్రతి ఎకరం బిందు సేద్యం పరిధిలోకి..

300 మంది రైతులు 1,104 ఎకరాలు సాగు చేస్తున్నారు. అందులో అత్యధికంగా మామిడి పంట ఉంది. ఈ మొత్తం వ్యవసాయ భూమిని డ్రిప్ ఇరిగేషన్ పరిధిలోకి తేవాలని సీఎం ఆదేశించారు. ఈ 3నెలల్లోనే 21 మందికి చెందిన 43.5 ఎకరాలకు డ్రిప్ సదుపాయం కల్పించారు. పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఉద్దేశంతో ఫార్మర్స్ ప్రొడ్యూజ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అందులో 250 మంది రైతులు చేరారు. వీరి ఉత్పత్తుల కోసం ఇప్పటి వరకూ దేశంలో పెద్దగా అమలులో లేని ట్రేసబిలిటీ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. పాడి ఆవుల రక్షణ కోసం గోకులాల పేరిట రూ.2.02 కోట్ల నిధులతో 103 షెడ్లు మంజూరు కాగా.. 87 షెడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి కొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. నారావారిపల్లి క్లస్టర్‌లో రోజువారీ పాల ఉత్పత్తి 5,800 లీటర్లు.



స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు

రూ. 155 కోట్లతో అభివృద్ధి పనులు

నారావారిపల్లె క్లస్టర్‌లో రూ.155 కోట్లతో అభివృద్ధి పనులు ప్రతిపాదించగా వాటిలో కొన్ని మంజూరయ్యాయి. ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. గ్రామాల్లో రూ.3.14 కోట్లతో 16 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.6.73 కోట్లతో అవసరమైన చోట్ల డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న ఐదు ఓవర్ హెడ్ ట్యాంకుల పునరుద్ధరణకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. క్లస్టర్ పరిధిలోని 31 హ్యాబిటేషన్లకూ తాగునీరు అందించడానికి రూ. 9.30 కోట్లతో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు పంపించారు. మరోవైపు రూ.120 కోట్లతో హంద్రీనీవా కాలువ నుంచి కళ్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుకు నీరందించే భారీ పథకాన్ని ప్రతిపాదించారు. ఈ నీటితో నారావారిపల్లె పరిధిలోని మొత్తం 1,104 ఎకరాలకు సాగునీరందించే ప్రయత్నం జరుగుతోంది.



ఈ ఆటోతో రోజుకు వెయ్యి సంపాదిస్తున్నా

స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ ఆటోను ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చింది. రూ.3.50 లక్షల విలువ గల ఈ ఆటో 1.50 లక్షలు రాయితీ ఇచ్చారు. దీంతో రోజుకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారు. సీఎం చంద్రబాబు వలన బతుకుతెరువు లభించింది.

- దూపాగు శివ, చిన్నరామాపురం గ్రామం

దేశంలోనే మొదటి కామన్ వర్క్ స్టేషన్: కలెక్టర్ వెంకటేశ్వర్

'నారావారిపల్లె క్లస్టర్‌లో సర్వే సందర్భంగా 48 మంది ఐటీ తదితర ప్రొఫెషనల్స్ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని గుర్తించాం. వీరందరికీ కామన్ వర్కింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల నుంచి ఆ స్టేషన్‌కు వచ్చి పని చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్లేలా సదుపాయాలు కల్పిస్తాం. ఇంటర్నెట్, ఫర్నిచర్, కంప్యూటర్లు అందుబాటులో పెడతాం. అక్కడే కామన్ స్టడీ సెంటర్ కూడా పెడుతున్నాం. ఈ ప్రాంత ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కాలేజీ నుంచి వచ్చాక కామన్ స్టడీ సెంటర్‌కు వచ్చి చదువుకునేలా లైబ్రరీ సహా అన్ని ఏర్పాట్లు చేస్తాం. దేశంలోనే ఈ తరహా ఏర్పాట్లు నారావారిపల్లెలోనే మొదటగా ఏర్పాటు చేయాలని సీఎం పట్టుదలతో ఉన్నారు.'

స్వర్ణ నారావారిపల్లె సాకారానికి చర్యలు

'స్వర్ణ నారావారిపల్లె సాకారానికి ప్రభుత్వం రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేస్తోంది. ప్రతి ఇంటి నుంచీ ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతోంది. ఏ ఇంటి చెత్తను ఆ ఇంట్లోనే ఎరువుగా మార్చేలా హోమ్ కంపోస్టింగ్ విధానం ప్రారంభిస్తున్నాం. అవసరమైన నిర్మాణాలను ఉపాధి హామీ నిధులతో చేపడతాం.'

-సుశీలాదేవి, నోడల్ ఆఫీసర్

స్వయం ఉపాధి కల్పన గొప్ప అవకాశం



మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు ఉచితంగా టైలరింగ్, మహిళలకు డ్రైవింగ్, ఎంబ్రాయిడరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే తపన చాలా గొప్ప విషయం.

- మౌనిక, భీమవరం

మా గ్రామాలకు గొప్ప వరం



మా గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం మూడు సచివాలయాల ప్రజలకు గొప్ప వరంగా భావిస్తున్నాం. సీఎం ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతామనే నమ్మకం ఉంది.

- కుసుమ, శేషాపురం

కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు



ప్రభుత్వ అధికారులు మమ్మల్ని కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు. మేం అభివృద్ధి చెందాలని సాయశక్తులా కృషి చేస్తున్నారు. రోజూ మాతో మాట్లాడుతూ మనోధైర్యం ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలను నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ప్రజలందురూ పాటిస్తే కచ్చితంగా అభివృద్ధి చెందుతాం.

- ప్రశాంతి, నారావారిపల్లె



ప్రతి ఇంటికీ సౌర విద్యుత్

క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లకు పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి అవకాశముందని సర్వేలో తేలింది. రూ.12.63 కోట్ల అంచనాతో అన్ని ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 800 ఇళ్లపై ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. అన్నీ ఏర్పాటు చేస్తే ఏటా రూ.4.86 కోట్ల విలువైన 57.74 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

రంగంపేట స్కూలులో మద్రాసు ఐఐటీ పాఠాలు

ఎ.రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూలుకు మహర్దశ పడుతోంది. సీఎం ఆసక్తితో ఈ స్కూలును శ్రీసిటీ యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. 181 మంది చదువుతున్న ఈ బడిలో కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్, సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పించే ప్రతిపాదనలూ ఉన్నాయి. సీఎంవో, శ్రీసిటీల చొరవతో ఇప్పటికే మద్రాసు ఐఐటీ నిపుణులు 3 నెలలుగా ఇక్కడి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచీ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను గుర్తించి స్కూల్లో చేర్పిస్తారు. నారావారిపల్లె పరిధిలోని పది ప్రాథమిక పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు కల్పించనున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నా కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు

పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక



'ఎల్2:ఎంపురాన్' చిత్రంలో కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై చిత్ర కథానాయకుడు మోహన్ లాల్ క్షమాపణలు చెప్పారు. తాజాగా చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక స్పందించారు. తన కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఎల్2:ఎంపురాన్' తెర వెనుక ఏం జరిగిందో నాకు బాగా తెలుసు. పృథ్వీరాజ్ సుకుమారన్‌ను అన్యాయంగా నిందిస్తున్నారు. తప్పుడు కథనాలు రాస్తున్నారు. వాటిని చూసి ఓ తల్లిగా ఆవేదన చెందుతున్నా. మోహన్‌లాల్, చిత్ర నిర్మాతలు ఎవరూ తమను పృథ్వీరాజ్ మోసం చేశాడని చెప్పలేదు. ఇప్పుడు ఆయనకు, నిర్మాతలకు తెలియకుండా కొందరు నా కుమారుడిని బలిపశువును చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందరి ఆమోదంతోనే చిత్రం తెరకెక్కింది. కానీ సినిమా విడుదలయ్యాక పృథ్వీరాజ్ మాత్రమే జవాబుదారీ ఎలా అవుతాడు' అని ప్రశ్నించారు.

శ్రీరామ నవమి కానుకగా



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా గ్లింప్స్ రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇచ్చింది. శ్రీరామ నవమి కానుకగా ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 6న విడుదల చేస్తున్నట్లు దర్శకుడు బుచ్చిబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

అమ్మలందరికీ అంకితం

కల్యాణ్‌రామ్



నరసరావుపేట పట్టణంలోని రవికళా మందిర్ థియేటర్‌లో సోమవారం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రం నుంచి 'నాయాల్ది' అనే తొలిపాట విడుదల చేశారు. నందమూరి కళ్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని అమ్మలకు అంకితం చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పడుకునే వరకు మన గురించి ఆలోచించే అమ్మలకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు. రాబోయే 20 సంవత్సరాల వరకు ఈ చిత్రం గుర్తుండిపోతుందన్నారు. దర్శకుడు చిలుకూరి ప్రదీప్ మాట్లాడుతూ ప్రేక్షకుల భావోద్వేగాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. చిత్రంలో పల్నాడు పౌరుషం కనిపిస్తుందని చెప్పారు. నందమూరి కళ్యాణ్‌రామ్‌కు స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య కోటప్పకొండ త్రికోటేశ్వరుని చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి)

పూరి మార్క్‌తో



విభిన్నమైన.. విలక్షణమైన పాత్రలతో జాతీయ స్థాయిలో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. కొత్తదనం నిండిన కథలతో అలరించే దర్శకుడు పూరి జగన్నాథ్. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రాబోతోంది. చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. 'ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ కథను రాశారు. ఆయన తనదైన శైలిలో తెరకెక్కించనున్నారు. నటుడిగా విజయ్ సేతుపతిలోని కొత్త కోణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని యూనిట్ తెలిపింది. చార్మీ కౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు.

ఆకట్టుకునే ఓ తండ్రి కథ



దిగ్గజ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కీలకపాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'లైఫ్'(లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేశ్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మించారు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈనెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చరణ్ సహకారం వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాలో తండ్రి గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం' అన్నారు. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెకించిన చిత్రం ఇదని చరణ్ చెప్పారు.

ఈ స్థాయి విజయం ఊహించలేదు

కల్యాణ్ శంకర్



తన తొలి చిత్రం 'మ్యాడ్'తో దర్శకుడిగా సూపర్‌హిట్ అందుకున్నారు కల్యాణ్ శంకర్. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'మ్యాడ్ స్క్వేర్'ను నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో భారీ హిట్ దిశగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు కల్యాణ్. "మొదటి భాగం యువతకు ఎక్కువ చేరువైంది. కానీ రెండో భాగం యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకూ చేరువవ్వడం ఆనందంగా ఉంది. సినిమాకు మంచి స్పందన వస్తుందని ఊహించాం. కానీ, ఈ స్థాయి విజయం అందుకుంటుందని అస్సలు ఊహించలేదు. ఈ సినిమాలో కథ ఉండదు.. కేవలం వినోదం మాత్రమే ఉంటుంది అని ప్రేక్షకులను ముందుగానే సిద్ధం చేయడం కలిసొచ్చింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్, విష్ణుల నటన, వినోదం, భీమ్స్ సిసిరోలియో సంగీతం, నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ విజయం ప్రేక్షకుల ప్రేమాభిమానాలకు అంకితం" అని చెప్పారు.

ఉత్కంఠభరితంగా సాగే...



'అక్కడొకడుంటాడు' ఫేమ్ శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం'. జి.వి.కె దర్శకత్వంలో కె.ఎస్.శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు జి.వి.కె మాట్లాడుతూ "ప్రస్తుతం హారర్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ప్రతీ క్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ప్రేక్షకులను తప్పక మెప్పిస్తుంది. హారర్ చిత్రాల్లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త పాత్రలో...



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా మరో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. గోపీ ఆచార దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మించనున్నారు. సోమవారం, ఈ చిత్రాన్ని ప్రకటించిన సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. సుహాస్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూలై నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమాకు సంబంధించిన ఇతర తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని త్వరలోనే ప్రకటిస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం 'ఓ భామా అయ్యోరామ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు సుహాస్.

కుటుంబ కథా చిత్రం



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్-భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ కుటుంబ కథా చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేయడానికి ఈ చిత్రం ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం' అని అన్నారు. దర్శకులు నితిన్-భరత్ మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ 'తన క్యారెక్టర్‌లో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయి' అని తెలిపారు.

మరింత చేరువవుతా

వైష్ణవి చైతన్య



'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. సిద్ధు జొన్నలగడ్డతో బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఆమె నటించిన 'జాక్' ఈ నెల 10న విడుదలవుతోంది. అలాగే, ఆనంద్ దేవరకొండతో ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, 'జాక్' సినిమా ప్రమోషన్స్‌లో మీడియాతో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు ఆమె. "ఇప్పటివరకూ అన్నీ సీరియస్ పాత్రలే చేశాను. 'జాక్'లో డ్యూయల్ రోల్ పోషించాను. ఇందులో ఓ పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రంతో కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతాను" అని చెప్పారు.

శక్తిమంతమైన పాత్రలో...



'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్ జంటగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో దర్శకుడు, నటుడు బండి సరోజ్‌కుమార్ 'క్రిస్టోఫర్ నోలన్' అనే ఓ శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, చిత్రంలో ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామమారుతి.ఎం, సంగీతం: కాలభైరవ.

వంధ్యత్వం



పిల్లల కోసం ఇలా సిద్ధం!

మట్టిలో విత్తనం నాటుకుని, మొలకెత్తి మహావృక్షంగా ఎదిగి, పండ్లను అందించాలంటే అందుకు ఎన్నో అంశాలు అనుకూలించాలి. గర్భధారణకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. పండంటి బిడ్డలకు తల్లితండ్రులు కావాలనుకుంటే, పెళ్లయ్యాక కాదు, పెళ్లికి ముందు నుంచే, స్త్రీపురుషులిద్దరూ శారీరకంగా సన్నద్ధం కావాలంటున్నారు వైద్యులు.

పెళ్లవగానే పిల్లలు పుట్టేసే పరిస్థితులు తగ్గిపోయాయి. ప్రస్తుతం వంధ్యత్వానికి కారణాలు మహిళల్లో, పురుషుల్లో ఇద్దర్లో సమానంగా ఉంటున్నాయి. పెళ్లీడు దాటిన తర్వాత పెళ్లిళ్లకు సిద్ధపడడం, అస్తవ్యస్థ జీవనశైలులను అనుసరించడం, జీవనశైలి సంబంధిత రుగ్మతలు (మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్) కలిగి ఉండడం, భౌతిక సాన్నిహిత్యానికి తగిన సమయం కేటాయించలేకపోవడం, స్త్రీపురుషుల్లో పునరుత్పత్తి సమస్యలు... ఇలా గర్భధారణ సాధ్యపడని అంశాలు అనేకం ఉంటున్నాయి.



- మహిళల్లో: మహిళల్లో పెరిగే వయసుతో పాటు అండాల నాణ్యతతో పాటు, వాటిలోని జన్యు పదార్థం నాణ్యతలు కూడా తరిగిపోతూ ఉంటాయి. వీటికి తోడు థైరాయిడ్, అధిక రక్తపోటు, మధుమేహం, పిసిఒడి లాంటి సమస్యలు కూడా తోడవుతూ ఉంటాయి.

- పురుషుల్లో: పెరిగే వయసుతో పాటు దురలవాట్ల వల్ల వీర్యకణాల నాణ్యత, కదలికలు తగ్గిపోతాయి. వీర్య నాణ్యతపరంగా 2000 సంవత్సరం నాటి విలువలకూ ఇప్పటి విలువలకూ ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. సాధారణంగా పురుషుల వీర్యంలో 40 మిలియన్ల వీర్యకణాలు ఉండేవి. కానీ ప్రస్తుతం ఈ ప్రమాణాన్ని 20 మిలియన్లకు పరిమితం చేసినా, ప్రస్తుత పురుషుల్లో వీటి సంఖ్య 12, 13 మిలియన్ల మేరకే ఉంటోంది.

పరీక్షలతో కారణాన్ని కనిపెట్టి...

పిల్లలు కలగకపోవడానికి స్త్రీపురుషుల్లో కారణాలను కనిపెట్టడం కోసం ఇద్దరికీ పరీక్షలు అవసరమవుతాయి. హార్మోన్ పరీక్షతో మహిళల అండాల నాణ్యతను పరీక్షించడంతో పాటు, స్కాన్ ద్వారా ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్, పిసిఒఎస్ లాంటివి లేవనీ, గర్భాశయ, ఫెలోపియన్ ట్యూబ్ సమస్యలు లేవనీ నిర్థారించుకోవాలి. అలాగే వీర్య పరీక్షతో వీర్యకణాల సంఖ్య, నాణ్యత, కదలికలను విశ్లేషించుకుని తగిన చికిత్సలు అందించి మూల కారణాలను సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. అలాగే కొందర్లో థైరాయిడ్ సమస్యలు ఉండవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు కూడా ఉండి ఉండవచ్చు. వీటిని కూడా మందులతో అదుపులోకి తెచ్చుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులను కూడా సరిదిద్దుకోవాల్సి ఉంటుంది.

ఎంత తరచుగా...

పెళ్లైన మూడు నెలలకే గర్భం దాల్చలేదనే కంగారుతో వైద్యుల దగ్గరకు పరుగులు పెట్టకూడదు. ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేని జంట, ఏడాది పాటు ఎలాంటి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించకుండా శారీరకంగా కలుస్తున్నప్పటికీ గర్భధారణ జరగనప్పుడు మాత్రమే పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలి. అలాగే దంపతులు ఏడాది పాటు, వారానికి కనీసం రెండు సార్లైనా శారీరకంగా కలుస్తూ ఉండాలి. ఈ నియమాలన్నీ పాటించినా ఏడాది వరకూ గర్భం దాల్చనప్పుడు తప్పనిసరిగా వైద్యులను కలిసి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. వారానికి రెండుసార్లు కలిస్తే సరిపోతుందనే సాకుతో వేర్వేరు ప్రదేశాల్లో విడివిడిగా ఉంటూ, వారాంతాల్లో కలవడం కూడా సరి కాదు. గర్భధారణకు శారీరక సహకారం ఎంత అవసరమో, మానసిక సంతృప్తి కూడా అంతే అవసరం. కాబట్టి దంపతులిద్దరూ ఒకే చోట కలిసి ఉండాలి.



పెళ్లీడు ఇదే!

అమ్మాయిలు 25 నుంచి, 30 ఏళ్ల లోపు, అబ్బాయిలు 30 ఏళ్ల లోపు పెళ్లి చేసుకోవడం అవసరం. ఈ వయసు గర్భధారణకు అన్ని విధాలా అనుకూలమైనది.

ముందస్తు పరీక్షలతో...

గర్భధారణకు శరీరం అనుకూలంగా ఉందో లేదో ఎవరికి వారు పెళ్లికి ముందే తెలుసుకోవడం అత్యవసరం. ఇందుకోసం పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును తెలిపే పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం వైద్యులు సూచించే రక్తపరీక్ష, స్కానింగ్, వీర్య పరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి. అలాగే శరీరంలో దాగిన క్లైవిడియన్, హెచ్ఐవి, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లను కనిపెట్టడం కోసం ఇన్‌ఫెక్షన్ స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఈ పరీక్షా ఫలితాల్లో సమస్య ఉన్నట్టు తేలినప్పుడు సమర్థమైన చికిత్సతో సరిదిద్దుకున్న తర్వాతే పెళ్లికి సిద్ధపడాలి. 25 నుంచి 30 ఏళ్ల వయసున్న పెళ్లి కాని యువతులందరూ ఇలా ప్రతి ఏటా పరీక్షలు చేయించుకుంటూ శరీరం మీద ఓ కన్నేసి ఉంచాలి. 30 ఏళ్ల నుంచి పెళ్లి కాని అబ్బాయిలు కూడా ప్రతి ఏటా వీర్య పరీక్షతో పాటు, ఇతరత్రా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

యువతులు ముందు నుంచే...

భవిష్యత్తులో దాల్చబోయే గర్భం తాలూకు బీజాలు, సదరు బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పుడే పడతాయి. కాబట్టి పిల్లలు నెలలు నిండకుండా పుట్టడం, బరువు తక్కువతో పుట్టడం లాంటి పరిస్థితులు తలెత్తకుండా గర్భిణులు జాగ్రత్త పడాలి. ఇలాంటి పరిస్థితుల్లో పుట్టిన ఆడపిల్లలు, టీనేజీ వయసుకు చేరుకునేటప్పటికి పిసిఒడి, ఒబేసిటీ, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలకు లోనవుతారు. పొంచి ఉండే ఈ ముప్పులకు తోడు నేటి తరం ఆడపిల్లల్లో శారీరక వ్యాయామం లోపించడం, ఆహారపుటలవాట్లు అస్తవ్యస్థం కావడం లాంటివి గర్భధారణను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. కాబట్టి టీనేజీ వయసు నుంచే ఆరోగ్యాన్ని కాపాడుకునే చర్యలు మొదలుపెట్టాలి. నెలసరి ప్రారంభంలో తలెత్తే సమస్యలను ప్రారంభంలోనే సరిదిద్దుకోవాలి. నెలసరి క్రమం మీద దృష్టి పెట్టాలి. ఏ చిన్న మార్పును గమనించినా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. మరీముఖ్యంగా టీనేజీ అమ్మాయిల్లో రక్తహీనత సర్వసాధారణమైపోతోంది. దీంతో వ్యాధినిరోధకశక్తి తగ్గి, శరీరం ఇన్‌ఫెక్షన్లకు లోనై పునరుత్పత్తి వ్యవస్థతో పాటు, మిగతా ఆరోగ్య వ్యవస్థల పనితీరులన్నీ కుంటుపడతాయి. కాబట్టి రక్తహీనతను నివారించుకోవడం కోసం ఆకుకూరలు, గుడ్లు, మాంసం, వేరుసెనగలు, బెల్లం చిక్కీలు, నువ్వులు, ఖర్జూరం తీసుకుంటూ ఉండాలి. అవసరాన్ని బట్టి రక్తహీనతను నివారించే మాత్రలు, ఇంజెక్షన్లను తీసుకోవాలి.

ఐవిఎఫ్ ఎప్పుడు?

పునరుత్పత్తి సమస్యలను చికిత్సతో సరిదిద్దలేని సందర్భాల్లో అంతిమ ప్రత్యామ్నాయంగా ఐవిఎఫ్‌ను (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) ఎంచుకోవచ్చు. ఈ ప్రక్రియను ఎలాంటి సందర్భాల్లో ఎంచుకోవాలంటే...

- అండాల నాణ్యత పూర్తిగా క్షీణించినప్పుడు
- వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు
- లైంగిక సమస్యలు ఉన్నప్పుడు
- ఫెలోపియన్ ట్యూబులు రెండూ మూసుకుపోయినప్పుడు
- దంపతులు ఇద్దర్లో గర్భధారణకు సాధ్యపడని పరిస్థితులు నెలకొని ఉన్నప్పుడు, దానం చేసిన అండాలు లేదా వీర్యకణాల ద్వారా గర్భం దాల్చే అవకాశాలున్నాయి.

డాక్టర్ పి. నీలిమ
హెచ్ఒడి - అబ్‌స్ట్రెట్రిక్స్ అండ్ గైనకాలజీ,
రెనోవా హాస్పిటల్స్,
సనత్ నగర్, హైదరాబాద్.



పరిశోధన



క్యాన్సర్‌ను కనిపెట్టే 'మైక్రో రోబోట్స్'

శరీరంలో క్యాన్సర్ నిర్ధారణ బయాప్సీ ద్వారానే సాధ్యమని మనందరికీ తెలుసు. అయితే శరీరం మీద ఎలాంటి కోత లేకుండా అప్పటికప్పుడే క్యాన్సర్‌ను పసిగట్టే 'మైక్రో రోబోట్స్' త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి.

కోతకు ఆస్కారం లేకుండా త్రీడి స్కాన్ ద్వారా పెద్ద పేగు క్యాన్సర్‌ను కచ్చితంగా పసిగట్టే మైక్రో రోబోట్స్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇప్పటివరకూ పెద్ద పేగు క్యాన్సర్‌ను నిర్ధారించడం కోసం పేగుల్లోకి చేరుకుని ముక్కను సేకరించి, బయాప్సీ చేయవలసి వస్తోంది. దీని ఫలితం చేతికి అందడానికి రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది. కాబట్టి క్యాన్సర్ చికిత్స ఆలస్యమై వ్యాధి మరింత ముదిరిపోయే ముప్పు పెరుగుతోంది. ఇలా వ్యాధినిర్ధారణ, చికిత్సల కోసం వేచి చూసే సమయాన్ని తగ్గిస్తూ, లీడ్స్, గ్లాస్గో, ఎడిన్‌బర్గ్ శాస్త్రవేత్తలు తాజాగా ఈ మైక్రో రోబోట్స్‌ను అభివృద్ధి చేశారు. సర్జరీ ద్వారా కేన్సర్ సోకిన కణజాలాన్ని సేకరించడానికి బదులుగా ఈ మైక్రో రోబోట్స్, శరీరంలోకి పాకుతూ వెళ్లి, క్యాన్సర్ సోకిన భాగాల చిత్రాలను వైద్యులకు అందిస్తాయి. 21 మిల్లీమీటర్ల పరిమాణాన్ని కలిగి ఉండే ఒలాయిడ్ మ్యాగ్నెటిక్ ఎండోస్కోప్ రోబోట్స్ క్యాన్సర్ సోకిన భాగాన్నీ, క్యాన్సర్ గడ్డ పరిమాణాన్నీ కనిపెట్టడంతో పాటు ఒకే ప్రయత్నంలో సూటి చికిత్సను కూడా అందించే సాంకేతిక సహాయకారులుగా ఉపయోగపడే వీలున్నట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

డ్రైవర్స్ నీ

మోకీళ్లు ఒత్తిడికి గురైతే...

రోజుకు గంట పాటు మాన్యువల్ కార్లను నడిపే వాళ్లు సరైన శరీర భంగిమను అనుసరించకపోతే, 'డ్రైవర్స్ నీ' అనే మోకీళ్ల సమస్యతో బాధపడక తప్పదు. ఈ సమస్య ఎందుకు బాధిస్తుందంటే...

కారు నడిపేటప్పుడు తరచూ యాక్సిలరేటర్, బ్రేక్, క్లచ్‌లను నొక్కడం కోసం కాళ్లను కదుల్చుతూనే ఉంటాం. అయితే ఇలా కదిల్చేటప్పుడు మన శరీర భంగిమ సక్రమంగా లేకపోతే, మోకాళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది. తరచూ పెడల్స్‌ను... ప్రత్యేకించి బ్రేక్, యాక్సెలరేటర్‌లను నొక్కేటప్పుడు మోకీలు, దాని చుట్టూరా ఉండే టెండాన్లు ఒత్తిడికి లోనవుతాయి. ప్రతి రోజూ గంటల తరబడి కార్లను నడిపేవారిలో మోకాలి చుట్టూరా ఉన్న కండరాలు బిగుతుగా మారి, వాపు, నొప్పి మొదలవుతాయి. కదలికలకు ఎక్కువ ఆస్కారం లేకపోవడం, నమ్యత లోపించడం వల్ల మోకీళ్లు ఒక భంగిమకే పరిమితమై ఒత్తిడికి లోనవుతాయి. దాంతో దీర్ఘకాలంలో నొప్పితో కూడిన కీళ్ల సమస్యలు మొదలై మెట్లు ఎక్కేటప్పుడు, మోకాళ్లను వంచినప్పుడు, కుర్చీలో నుంచి లేచి నిలబడేటప్పుడు నొప్పి వేధిస్తుంది. ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే...

- డ్రైవర్ సీటు, స్టీరింగ్‌కు మరీ దూరంగా ఉండకూడదు
- పెడల్స్‌ను నొక్కేటప్పుడు పాదం, మోకాలికి 30 డిగ్రీల కంటే ఎక్కువ కోణంలో ఉండకూడదు
- మోకాళ్లు సీటు అంచులో ఉండేలా చూసుకుంటే, వాటిని కదిలించడానికి వీలుంటుంది



- ఎక్కువ దూరాలు కారు నడిపేటప్పుడు, ప్రతి 45 నిమిషాలకు ఒకసారి కారు ఆపి, దిగి కొద్ది దూరం నడవాలి
- మోకాళ్లు ఎలాంటి అసౌకర్యం లేకుండా 90 డిగ్రీలకు వంచగలిగేంత ఎత్తులో సీటు ఉండేలా చూసుకోవాలి
- మోకాళ్ల కండరాలను దృఢపరిచే వ్యాయామాలు చేస్తూ ఉండాలి. సీటులో కుషన్లను వాడుకోవడం, కూర్చునే భంగిమ సక్రమంగా ఉండేలా చూసుకోవడం, నీ సపోర్ట్‌లను వాడుకోవడం వల్ల మోకీళ్ల మీద ఒత్తిడి పడకుండా నివారించుకోవచ్చు.

మన జీర్ణాశయం తిన్న ప్రతి పదార్థాన్నీ క్షణాల్లో జీర్ణించుకోలేదు. కొన్ని పదార్థాలు పూర్తిగా జీర్ణమవడానికి కొన్ని రోజుల సమయం పడుతుంది. ఫలితంగా కొందర్లో అజీర్తి, కడుపుబ్బరం లాంటి సమస్యలు మొదలవుతాయి. అలాంటి క్లిష్టమైన పదార్థాలు ఏవంటే...

అజీర్తి ఆమడదూరంలో...

రెడ్ మీట్: ఈ భారీ మాంసకృతులను శరీరం పూర్తిగా జీర్ణించుకోడానికి 72 గంటల సమయం పడుతుంది. ఈ మాంసం సాంద్రత ఎక్కువ కాబట్టి దీన్ని మన జీర్ణ వ్యవస్థ సులభంగా విచ్ఛిన్నం చేసుకోలేదు. దాంతో రెడ్ మీట్ తరచుగా తింటున్నప్పుడు, జీర్ణాశయంలో జీర్ణరసాలు సరిపడా ఉత్పత్తి కానప్పుడు... కడుపుబ్బరం, పొట్టలో అసౌకర్యం, జీర్ణ ప్రక్రియ మందగించడం లాంటి సమస్యలు వేధిస్తాయి.



తెలుసుకుందాం

కొవ్వుతో కూడిన సంక్లిష్టమైన పదార్థాలు: కొవ్వులు, జిడ్డుతో కూడిన సంక్లిష్టమైన పదార్థాలను జీర్ణించుకోడానికి మన శరీరం ఎక్కువ సమయం తీసుకుంటుంది. బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైలు అరగడానికి ఎక్కువ సమయం తీసకుని జీర్ణ సమస్యలను తెచ్చి పెడతాయి. అలాగే బర్గర్లు, ఫ్రైడ్ చికెన్, పిజ్జాలలో ఉండే అత్యధిక సంతృప్త కొవ్వులు కడుపుబ్బరం, కడుపులో అసౌకర్యం, డయేరియాలకు కారణమవుతాయి. వాటిలోని అదనపు సోడియం, కృత్రిమ చక్కెరలు, తీపి పదార్థాలు కూడా జీర్ణ ప్రక్రియను ప్రభావితం చేస్తాయి.

స్వీట్లు, శీతల పానీయాలు: డోనట్స్, కేక్స్, బిస్కెట్లు లాంటి తీపి పదార్థాలు పేగుల్లోని చెడు బ్యాక్టీరియాకు ఆహారంగా మారతాయి. ఆ బ్యాక్టీరియా ఆయా పదార్థాల్లోని చక్కెరలను కుళ్లబెట్టడం మూలంగా కడుపుబ్బరం వేధిస్తుంది. కాబట్టి పేగులు ఇబ్బంది పడకుండా ఉండడం కోసం పదార్థాలకు అల్లం చేర్చుకోవాలి. బ్రొకొలి, చిలకడ దుంపలు లాంటి అత్యధిక పీచు కలిగిన కూరగాయలను జోడించుకోవాలి. అలాగే ఆరోగ్యకరమైన మూలాలు కలిగిన కొవ్వులు, ప్రొటీన్, సంక్లిష్ట పిండిపదార్థాలను ఎంచుకోవాలి.

అజీర్తితో పొట్టలో అసౌకర్యం వేధించినప్పుడు ఎక్కువ నీళ్లు తాగాలి. శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి. అలాగే అత్యధికంగా శుద్ధి చేసిన పదార్థాలు తినడం మానేయాలి.

మైక్రోగ్రీన్స్‌తో మెరుగైన ఆరోగ్యం

మొలకలు ఆరోగ్యకరం. అయితే 'మైక్రో గ్రీన్స్'లో వాటిని మించిన పోషకాలుంటాయి. వాటి గురించి తెలుసుకుందాం!

పెసలు, అలసందలు, సెనగలు... వీటిని నానబెట్టి, అంగుళం మేరకు మొలకలు పెరగగానే తినేస్తూ ఉంటాం. వీటిలో పోషకాలకు కొదవ ఉండదు. అయితే మరింత మెరుగైన, విలువైన పోషకాలను పొందడం కోసం మైక్రో గ్రీన్స్ కూడా తినడం అలవాటు చేసుకోవాలి. సూపర్‌ఫుడ్స్‌గా పేరు పొందుతున్న మైక్రోగ్రీన్స్ ఎలా పెంచుకోవాలో, ఎలా వాడుకోవాలో తెలుసుకుందాం!

ధనియాలను చల్లి కొత్తిమీర మొక్కలను వంటల్లో వాడుకోవడం మనకు అలవాటే! అయితే వీటితో పాటు ఇంకొన్ని రకాల మైక్రోగ్రీన్స్‌ను కూడా సులభంగా ఇళ్లలోనే పెంచుకోవచ్చు. పోషక విలువలు కలిగిన మైక్రోగ్రీన్స్ వంటకాలకు రుచి, రంగులను అందిస్తాయి. వీటిని వంటకాల అలంకరణకు వాడుకోవచ్చు. స్మూదీల్లో కలుపుకోవచ్చు. పచ్చిగా కూడా తినొచ్చు. మొలకల నుంచే మైక్రోగ్రీన్స్ పెరుగుతాయి. అయితే మొలకలు అంటే, అప్పుడే మొలకెత్తే దశలో ఉన్న విత్తనాలు. మొలకెత్తడం మొదలుపెట్టిన రెండో రోజే వాటిని వాడుకోవచ్చు. కానీ మొలకలు మైక్రోగ్రీన్స్‌గా మారాలంటే వాటికి ఆకులు పెరగాలి. మొదటి రెండు ఆకులు పెరిగినప్పుడు ఆ మొక్క మైక్రోగ్రీన్‌గా మారుతుంది.

ఆరోగ్య ప్రయోజనాలు

మైక్రోగ్రీన్స్‌తో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఖనిజలవణాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వీటిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి కీలకమైన జీవక్రియలకు తోడ్పడతాయి. శరీరం తనలోని ఫ్రీ ర్యాడికల్స్ అనే అస్థిరమైన వ్యర్థ అణువులను బయటకు పంపించడంలో యాంటీ ఆక్సిడెంట్ల సహాయపడతాయనే విషయం అందరికీ తెలిసిందే! సహజ సిద్ధ శరీర ప్రక్రియలు, కాలుష్యం ఫలితంగీ ఈ ఫ్రీ ర్యాడికల్స్ శరీరంలో పెరుగుతూ ఉంటాయి. కణ నష్టానికి దారి తీసి అంతిమంగా క్యాన్సర్ లాంటి వ్యాధులకు కారణయమ్యే ఈ అణువును సహజసిద్ధంగానే శరీరం కొంత మేరకు నివారించుకుంటున్నప్పటికీ, కొన్ని శరీరంలో పేరుకుపోతూ ఉంటాయి. ఆహారంతో అందే యాంటీఆక్సిడెంట్లు మరీ ముఖ్యంగా వృక్షాధారిత యాంటీఆక్సిడెంట్లు వీటి నివారణకు ఎంతో బాగా తోడ్పడతాయి. పైగా మైక్రోగ్రీన్స్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని పరిశోధనల్లో కూడా రుజువైంది. బ్రాసిలికా కుటుంబానికి చెందిన బ్రొకొలి లాంటి మైక్రోగ్రీన్స్‌లో ఫెనోలిక్ యాంటీఆక్సిడెంట్, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. లెట్యూస్‌లో, కరోటినాయిడ్ యాంటీఆక్సిడెంట్, విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది.



తోటకూర, సబ్జా, మెంతులు, బ్రొకొలి, బీట్‌రూట్, బఠాణీ, స్విస్ చార్డ్, చియా విత్తనాలతో మైక్రో గ్రీన్స్ పెంచుకుని వాడుకోవచ్చు. మైక్రోగ్రీన్స్‌ను ఇళ్లలోనే ఎండ సోకే చోట సులభంగా పెంచుకోవచ్చు.

ఇలా పెంచుకోవాలి

మైక్రోగ్రీన్స్‌ను మట్టిలో లేదా టిష్యూ పేపర్, మట్టి పాత్రలో పెంచుకోవచ్చు. అయితే మొలకలకు భిన్నంగా వీటికి ఎండ అవసరమవుతుంది. మైక్రోగ్రీన్స్ పెరగడానికి రకాన్ని బట్టి, ఒకటి నుంచి మూడు వారాల సమయం పడుతుంది. ఏ మూలిక లేదా కూరగాయ విత్తనాల నుంచి అయినా మైక్రోగ్రీన్స్‌ను పెంచుకోవచ్చు. వాటి రుచి మొక్క రకం మీద ఆధారపడి ఉంటుంది. తోటకూర, సబ్జా, మెంతులు, బ్రొకొలి, బీట్‌రూట్, బఠాణీ, స్విస్ చార్డ్ విత్తనాలతో మైక్రోగ్రీన్స్ పెంచుకుని వాడుకోవచ్చు. మైక్రోగ్రీన్స్‌ను ఇళ్లలోనే ఎండ సోకే చోట సులభంగా పెంచుకోవచ్చు. ఇందుకోసం...

- ఒక ప్లేటు లేదా ట్రే మీద మట్టిని పలుచగా పరుచుకుని, విత్తనాలు చల్లుకోవాలి
- నీళ్లు చల్లుకుని ఎండ సోకే చోట పెట్టుకోవాలి
- ప్రతి రోజూ నీళ్లు చల్లుకుంటూ మట్టిని తేమగా ఉంచుకోవాలి
- రెండు నుంచి మూడు వారాలకు మొక్కలు పెరిగి కోతకు సిద్ధమైపోతాయి
- మట్టి అంటకుండా మొక్కలను కత్తిరించుకున, శుభ్రంగా కడిగి వాడుకోవాలి.
- మట్టికి బదులుగా టిష్యూ పేపర్ లేదా మట్టి పాత్రలను కూడా వాడుకోవచ్చు

ఇలా వాడుకోవాలి

పోషకాలను కలిగి ఉండే మైక్రోగ్రీన్స్ వంటకాల రుచిని కూడా పెంచుతాయి. వీటిని ఎలా తినాలంటే....

- సలాడ్స్, సూప్స్, చపాతీ, బ్రెడ్, పిజ్జాల మీద చల్లుకుని తినొచ్చు
- పండ్ల రసాలు, స్మూదీల్లో కలుపుకుని తాగొచ్చు
- కూరల్లో కలుపుకోవచ్చు
- గుడ్డుసొనతో కలిపి ఆమ్లెట్ వేసుకోవచ్చు



బిజినెస్

ఎంఎస్‌ఎంఈల టర్నోవర్, పెట్టుబడుల పరిమితి పెంపు

నేటి నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) పెట్టుబడి, టర్నోవర్ పరిమితులు గణనీయంగా పెంచుతూ చేసిన సవరణలు మంగళవారం (ఏప్రిల్ 1) అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ నిర్వచనాన్ని ఇటీవల సవరించింది. వాటి వృద్ధి, విస్తరణ అవకాశాలు మెరుగు పడి ఉపాధి కల్పనకు ఈ సవరణ దోహద పడుతుంది.

- రూ.2.5 కోట్ల పెట్టుబడి గల కంపెనీలు ఇక నుంచి మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లుగా పరిగణనలోకి వస్తాయి. గతంలో ఈ పరిమితి రూ.1 కోటి ఉండేది. వీటి టర్నోవర్ పరిమితిని కూడా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు.
- రూ.25 కోట్ల పెట్టుబడి గల సంస్థలు చిన్న పరిశ్రమలుగా వర్గీకరణలోకి వస్తాయి. గతంలో ఇది రూ.10 కోట్లుండేది. వాటి టర్నోవర్ పరిమితిని రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పెంచారు.
- రూ.125 కోట్ల పెట్టుబడితో ప్రారంభమయ్యే సంస్థలను మధ్యతరహా పరిశ్రమలుగా గుర్తిస్తారు. గతంలో ఈ పరిమితి రూ.25 కోట్లుండేది. వీటి టర్నోవర్ పరిమితిని రూ.500 కోట్లకు పెంచారు.

చిన్న షేర్లదే హవా

2024-25లో 8 శాతం పెరిగిన బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ

మిడ్‌క్యాప్ సూచీ 5.61% అప్

సెన్సెక్స్ 5% వృద్ధి కంటే అధికం



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం స్టాక్ మార్కెట్లో చిన్న షేర్ల హవా కొనసాగింది. ప్రధాన కంపెనీల కంటే అధిక రిటర్నులు పంచాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 5.10 శాతం వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 8 శాతం ఎగబాకింది. మిడ్‌క్యాప్ సూచీ 5.61 శాతం పెరిగింది. గత అక్టోబరు నుంచి ఈ ఫిబ్రవరి వరకు వరుసగా ఐదు నెలల పాటు భారీగా దిద్దుబాటుకు లోనైన మార్కెట్ సూచీలు.. మార్చిలో మళ్లీ రివ్వున ఎగిశాయి. దీర్ఘకాలం పాటు అమ్మకాలకు పాల్పడిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మళ్లీ మార్కెట్లో కొనుగోళ్లు పెంచడంతో పాటు రిటైల్ మదుపర్ల దన్నుతో సూచీలు మళ్లీ కోలుకున్నాయి. మార్కెట్ రికవరీ ర్యాలీలోనూ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు ప్రధాన సూచీని మించి వృద్ధి చెందాయి. మార్చిలో సెన్సెక్స్ 5.76 శాతం పెరగగా.. స్మాల్‌క్యాప్ సూచీ 8.25 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 7.61 శాతం పుంజుకున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి బీజేపీ గెలుపొందడం, యూఎస్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలతో 2024-25 ప్రథమార్ధంలో మార్కెట్లో రికార్డుల ర్యాలీ కొనసాగింది. గత ఏడాది డిసెంబరు 12న బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. గత సెప్టెంబరు 24న మిడ్‌క్యాప్ సూచీ 49,701.15 వద్ద, అదే నెల 27న సెన్సెక్స్ 85,978.25 వద్ద సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠాలను నమోదు చేశాయి.

అయితే, దీర్ఘకాలిక బుల్‌రన్ కారణంగా చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుండటం, అంతర్జాతీయ అనిశ్చితులు, కార్పొరేట్ కంపెనీల నిరాశాజనక త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు అక్టోబరు నుంచి మన మార్కెట్లోని పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలు పెట్టారు. దాంతో ద్వితీయార్ధంలో మార్కెట్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. గత 29 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా వరుసగా ఐదు నెలలు ప్రామాణిక సూచీలు భారీగా దిద్దుబాటుకు లోనయ్యాయి. కాకపోతే, ద్వితీయార్ధం చివరి నెలలో మార్కెట్ మళ్లీ వేగంగా పుంజుకోవడంతో సూచీలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్వల్ప వృద్ధినైనా నమోదు చేయగలిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 24.85 శాతం వృద్ధి చెందగా.. మిడ్‌క్యాప్ సూచీ ఏకంగా 62.38 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 59.60 శాతం ఎగబాకాయి.

డిసెంబరు నాటికి విదేశీ అప్పులు రూ.61.38 లక్షల కోట్లు

ఏడాది కాలంలో 10.7 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: గత డిసెంబరు చివరి నాటికి భారత విదేశీ అప్పులు వార్షిక ప్రాతిపదికన 10.7 శాతం పెరిగి 71,790 కోట్ల డాలర్లకు చేరాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఈ విలువ సుమారు రూ.61.38 లక్షల కోట్లు. 2023 డిసెంబరు నాటికి మన విదేశీ రుణ భారం 64,870 కోట్ల డాలర్లు (రూ.55.46 లక్షల కోట్లు)గా ఉంది. త్రైమాసిక ప్రాతిపదికన పోలిస్తే, 2024 సెప్టెంబరు చివరి నాటికి 71,270 కోట్ల డాలర్లుగా (రూ.60.93 లక్షల కోట్లు) ఉన్న విదేశీ రుణ భారం.. డిసెంబరు చివరికల్లా మరో 0.7 శాతం పెరిగింది. 2024 ముగిసేసరికి జీడీపీలో విదేశీ రుణభారం నిష్పత్తి 19.1 శాతంగా నమోదైంది. గత సెప్టెంబరు చివరినాటికిది 19 శాతంగా ఉంది. మన ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ కంపెనీలు, బ్యాంక్‌లు, ఇతర ఆర్థిక సంస్థలు, వ్యక్తులు విదేశీ రుణదాతల నుంచి సేకరించిన అప్పులన్నీ ఈ పరిధి లోకి వస్తాయి. గత ఏడాది చివరి నాటికి మొత్తం విదేశీ రుణ భారంలో అత్యధికంగా డాలర్లలో తీసుకున్న అప్పు వాటాయే 54.8 శాతంగా ఉంది. రూపాయల్లో తీసుకున్న విదేశీ రుణ వాటా 30.6 శాతంగా, జపాన్ యెన్‌లలో తీసుకున్న అప్పు 6.1 శాతంగా, యూరోల్లో తీసుకున్న రుణాలు 3 శాతంగా ఉన్నాయి.

2024 సెప్టెంబరుతో పోలిస్తే డిసెంబరు చివరినాటికి మొత్తం విదేశీ రుణాల్లో కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల వాటా తగ్గగా.. ప్రభుత్వయేతర రంగాల వాటా పెరిగింది. మొత్తం విదేశీ రుణంలో ఆర్థికేతర సంస్థలు చెల్లించాల్సిన బకాయిల వాటా 36.5 శాతంగా ఉండగా.. సెంట్రల్ బ్యాంక్ మినహా డిపాజిట్లు స్వీకరించే బ్యాంకింగ్ సంస్థలు చెల్లించాల్సిన వాటా 27.8 శాతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటా 22.1 శాతంగా, ఇతర ఆర్థిక సేవల సంస్థల వాటా 8.7 శాతంగా ఉంది.

రెనో చేతికి నిస్సాన్ ఇండియా వాటా

న్యూఢిల్లీ: భారత్‌లోని జాయింట్ వెంచర్ సంస్థ రెనో నిస్సాన్‌లో జపాన్ భాగస్వామి నిస్సాన్‌కు చెందిన వాటాలన్నింటినీ కొనుగోలు చేస్తున్నట్టు ఫ్రాన్స్‌కు చెందిన ఆటో దిగ్గజం రెనో ప్రకటించింది. ప్రస్తుతం ఈ జేవీలో నిస్సాన్‌కు 51% వాటా ఉంది. ఈ వాటా కొనుగోలుతో ఈ సంస్థ పూర్తిగా రెనో సొంతం కానుంది. ఈ మేరకు ఉభయ సంస్థల మధ్య షేర్ల కొనుగోలు ఒప్పందం కుదిరినట్టు రెనో వెల్లడించింది. అయితే ఈ లావాదేవీ విలువ ఎంత అన్నది వెల్లడించలేదు. అయితే రెనో.. నిస్సాన్ టెక్నాలజీ అండ్ బిజినెస్ సెంటర్ ఇండియాను (ఆర్‌ఎన్‌టీబీసీఐ) మాత్రం ఉమ్మడిగానే నిర్వహించనున్నట్టు తెలిపింది. ఈ విభాగంలో నిస్సాన్‌కు 49%, రెనో గ్రూప్‌నకు 51% వాటాలున్నాయి.

అంతర్జాతీయ పరిణామాలే కీలకం!

నేటి నుంచి సరికొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతోంది. గడచిన కొద్ది నెలలుగా మార్కెట్లు మదుపరులకు ఏ మాత్రం అనుకూలంగా లేవు. తీవ్రమైన అనిశ్చితి నెలకొని ఉంది. మరికొన్ని రోజులు ఈ పరిస్థితి తప్పకపోవచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు ఏప్రిల్ తొలి వారంలో అమల్లోకి రానున్నాయి. మరోవైపు ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష, అమెరికా ఆర్థిక గణాంకాలు కూడా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. వీటిని బట్టి మదుపరులు పొజిషన్స్ తీసుకోవటం మంచిది. మూమెంటమ్‌ను పరిశీలిస్తే పీఎస్‌యూ బ్యాంకులు, ఫైనాన్స్, ఎనర్జీ, హెల్త్‌కేర్, కమోడిటీస్ రంగాలు బుల్లిష్‌నెస్‌ను కనబరిచే వీలుంది.

స్టాక్ రికమండేషన్స్

టాటా కన్స్యూమర్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం వరకు దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రూ.880 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు తాజాగా హయ్యర్ హైఫామ్ చేసింది. చివరి రెండు సెషన్లలో 5 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.1,001 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.990 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,080 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.960 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బ్రిటానియా: ప్రస్తుతం రూ.4,600 స్థాయిలో సపోర్ట్ తీసుకున్న ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. చివరి నాలుగు సెషన్లు లాభాల్లోనే ముగిసింది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.4,936 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,900 స్థాయిలో ప్రవేశించి రూ.5,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,855 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

అపోలో హాస్పిటల్స్: ఈ ఏడాది ఆరంభం నుంచి డౌన్ ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరులో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. రూ.6,000 స్థాయిలో రెండుసార్లు సపోర్ట్ తీసుకుని అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ప్రస్తుతం 50 రోజుల మూవింగ్ యావరేజెస్ పైన కదలాడుతోంది. గత శుక్రవారం రూ.6,616 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.6,600 వద్ద పొజిషన్ తీసుకుని రూ.7,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్‌సీటీసీ: గత ఏడాది జూలై నుంచి ఈ షేరు డౌన్ ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం భారీ వాల్యూమ్ నమోదవుతుండటంతో అక్యుములేషన్ జరుగుతోందని భావించవచ్చు. పైగా చివరి పది సెషన్లలో 11 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.727 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770/820 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీ కార్డ్: నష్టాల మార్కెట్లోనూ మంచి లాభాలు నమోదు చేసిన షేరు ఇది. చివరి మూడు నెలల్లో 26 శాతం, చివరి నెల రోజుల్లో 5 శాతం, గత వారం 3 శాతం మేర పెరిగింది. గత ఏడాది సెప్టెంబరు నాటి రూ.820 స్థాయిని అధిగమించిన ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.881 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.850 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,020 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.820 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మధ్యప్రదేశ్‌లో ఏజీఐ గ్రీన్‌ప్యాక్ కొత్త ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏజీఐ గ్రీన్‌ప్యాక్ మధ్యప్రదేశ్‌లో రూ.700 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అత్యధిక ఉత్పాదకత, అధిక సామర్థ్యం ఉండే ఈ ప్లాంట్ ఏర్పాటుతో తమ కంటైనర్ గ్లాస్ తయారీ సామర్థ్యం 25% పెరుగుతుందని వెల్లడించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పని చేస్తున్న ప్లాంట్‌కు ఇది మరింత బలం చేకూర్చేదిగా ఉంటుందని కంపెనీ సీఎండీ సందీప్ సోమానీ తెలిపారు.

- కన్స్యూమర్ ఉత్పత్తుల వ్యాపారాన్ని విభజించే (డీమెర్జర్) కాంపోజిట్ పథకాన్ని హిండ్‌వేర్ హోమ్ ఇన్నోవేషన్ లిమిటెడ్ ప్రకటించింది. ఇందులో భాగంగా హెచ్‌హెచ్‌ఐఎల్ లిమిటెడ్, హిండ్‌వేర్ లిమిటెడ్ పేరుతో రెండు కంపెనీలను ఏర్పాటు చేయనుంది. హెచ్‌హెచ్‌ఐఎల్ పూర్తిగా కన్స్యూమర్ ఉత్పత్తుల వ్యాపారంలో ఉండనుండగా హిండ్‌వేర్ లిమిటెడ్ శానిటరీ వేర్, ప్లాస్టిక్ పైప్స్ సహా బిల్డింగ్ ఉత్పత్తుల వ్యాపారంలో ఉండనుంది.
- లారిడ్జ్ నడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ (గతంలో ఎల్ అండ్ టీ స్విచ్‌గేర్).. వ్యవసాయ రంగంలో ఆటోమేషన్ ప్రోత్సహించేందుకు కనెక్టెడ్ సొల్యూషన్స్‌ను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఐఓటీ ఆధారిత ఉత్పత్తులతో పాటు స్మార్ట్‌కామ్ పేరుతో ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను విడుదల చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	470
వరంగల్	457	గోదావరి	460
చిత్తూరు	520	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	152
కరీంనగర్	146	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	117
కర్నూలు	146	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	122
గోదావరి	152		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	91,910 ▲	84,250 ▲	1,13,000 ▼
విజయవాడ	92,500 ▲	87,000 ▲	1,00,300 ▼
విశాఖపట్నం	89,310 ▲	81,870 ▲	1,00,880 ▲
రాజమండ్రి	91,910 ▲	84,250 ▲	1,03,700 ▼
ప్రొద్దుటూరు	92,050 ▲	85,240 ▲	1,02,000 ▲
ముంబై	89,164 ▲	81,674 ▲	1,00,892 ▲

స్పోర్ట్స్



జొకోకు మెన్సిక్ ఝలక్

మియామీ గార్డెన్స్ (ఫ్లోరిడా): కెరీర్‌లో 100వ టూర్ టైటిల్ గెలుచుకోవాలన్న టెన్నిస్ దిగ్గజంనొవాక్ జొకోవిచ్ ఆశలకు టీనేజర్ జాకబ్ మెన్సిక్ గండి కొట్టాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన మియామీ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల మెన్సిక్ 7-6 (4), 7-6 (4)తో నొవాక్‌ను ఓడించి కెరీర్‌లో తొలి ఏటీపీ టైటిల్ అందుకున్నాడు.

సీఓఈలో చేరిన శాంసన్



బెంగళూరు: రాజస్థాన్ రాయల్స్ తరపున వికెట్ కీపింగ్ చేసేందుకు ఆ జట్టు కెప్టెన్ శాంసన్ ఎదురు చూస్తున్నాడు. దీంట్లో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ టెస్టు కోసం అతను బెంగళూరు వచ్చాడు. కుడిచేతి చూపుడు వేలికి సర్జరీ తర్వాత సంజూకు ఐపీఎల్‌లో బ్యాటర్‌గా ఆడేందుకు మాత్రమే గతంలో అనుమతిచ్చారు. దీంతో రాజస్థాన్ తొలి మూడు మ్యాచ్‌ల్లో సంజూ ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగాడు. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ కోసం మరోసారి పరీక్షలో పాల్గొననున్నాడు. ఒకవేళ అతడికి కీపింగ్ క్లియరెన్స్ లభిస్తే శనివారం పంజాబ్‌తో మ్యాచ్‌లో జట్టు కెప్టెన్‌గానూ వ్యవహరిస్తాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
ఢిల్లీ	2	2	0	0	4	1.320
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
గుజరాత్	2	1	1	0	2	0.625
పంజాబ్	1	1	0	0	2	0.550
ముంబై	3	1	2	0	2	0.309
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
కోల్‌కతా	3	1	2	0	2	-1.428

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

హాకీ ఆసియా కప్‌నకు రాజ్‌గిర్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీకి బిహార్‌లోని రాజ్‌గిర్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2026 హాకీ ప్రపంచ కప్‌నకు అర్హతగా భావిస్తున్న ఈ టోర్నీ ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 7 వరకు జరగనుంది.

విండీస్ టెస్టు కెప్టెన్సీకి బ్రాత్‌వైట్ రాజీనామా

టీ20 సారథిగా హోప్

సెయింట్ జాన్స్: వెస్టిండీస్ టెస్టు జట్టు కెప్టెన్‌గా క్రెయిగ్ బ్రాత్‌వైట్ (32) తప్పుకొన్నాడు. నాలుగేళ్లపాటు విండీస్ జట్టుకు బ్రాత్‌వైట్ సారథ్యం వహించాడు. కాగా, వన్డే కెప్టెన్‌గా ఉన్న షాయ్ హోప్‌కు టీ20 పగ్గాలు కూడా అప్పగించారు. ఇప్పటిదాకా రోవ్‌మన్ పావెల్ టీ20 సారథిగా ఉన్న సంగతి తెలిసిందే. జూన్‌లో స్వదేశంలో ఆస్ట్రేలియాతో విండీస్ టెస్టు సిరీస్ ఆడనుంది. మరికొద్ది రోజుల్లో టెస్టులకు కొత్త సారథిని ప్రకటిస్తామని క్రికెట్ వెస్టిండీస్ తెలిపింది. 2021లో జేసన్ హోల్డర్ స్థానంలో బ్రాత్‌వైట్ నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో 27 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై విండీస్ టెస్టు మ్యాచ్ నెగ్గింది.

రియాన్ పరాగ్‌కు రూ.12 లక్షల జరిమానా



గువాహటి: చెన్నైతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ బౌలర్లు నిర్ణీత సమయానికి ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోయారు. దీంతో నిబంధనల ప్రకారం జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్‌పై రూ.12 లక్షల జరిమానా విధించారు. ఇక, గుజరాత్‌తో మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగానే ముంబై జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపైనా జరిమానా పడిన విషయం తెలిసిందే.

సచిన్, విశాల్ నేరుగా సెమీస్‌కు

ఫస్నాగ్వసు (బ్రెజిల్): ఆరంభ వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత స్టార్లు సచిన్ (60 కిలోలు), విశాల్ (90 కిలోలు)లకు తొలి రౌండ్‌లో బై లభించింది. దాంతో ఈ ఇద్దరు బాక్సర్లు నేరుగా సెమీఫైనల్ నుంచే తలపడనున్నారు. భారత్ నుంచి మొత్తం 10 మంది బాక్సర్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. నరేందర్ బేర్వల్ భారత బృందానికి నాయకత్వం వహిస్తున్నాడు.

పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్?

న్యూఢిల్లీ: భారత్-ఇంగ్లండ్ ద్వైపాక్షిక సిరీస్ విజేతకు ప్రదానం చేసే మన్సూర్ అలీఖాన్ (ఎంఏకే) పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్ ఇచ్చే యోచనలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఉన్నట్టు సమాచారం. ఇంగ్లండ్-భారత్ మధ్య టెస్టు మ్యాచ్ జరిగి 75 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని 2007లో ఈ ట్రోఫీని ఆరంభించారు. అయితే, ఈసీబీ నిర్ణయంపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా లేదు. కానీ, ఈ ట్రోఫీ స్థానంలో ఇరు దేశాలకు చెందిన ఇద్దరు దిగ్గజ క్రికెటర్ల పేరున కొత్త ట్రోఫీని ఆవిష్కరిస్తారని తెలుస్తోంది. పటౌడీ కుటుంబ సభ్యులకు ఈ మేరకు సమాచారం ఉందట. టెస్టు సిరీస్‌లో భాగంగా జూన్-జూలైలో భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనుంది.



అశ్వని కుమార్ (3-0-24-4)

1 ఐపీఎల్ అరంగేట్రంలోనే నాలుగు వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అశ్వని కుమార్. అలాగే ఐపీఎల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో తన మొదటి బంతికే వికెట్ తీసిన నాలుగో బౌలర్‌గానూ నిలిచాడు.

ఎవరీ అశ్వని కుమార్?

ఈ సీజన్‌లో ముంబై పరిచయం చేసిన మరో సంచలనం 23 ఏళ్ల లెఫ్టామ్ పేసర్ అశ్వని కుమార్. ఈ పంజాబ్ కుర్రాడు తన అరంగేట్ర మ్యాచ్‌లోనే పదునైన పేస్‌తో రహానె, రింకూ, మనీష్, రస్సెల్‌ల వికెట్లు తీసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. వాస్తవానికి అశ్వని డెత్ బౌలర్ స్పెషలిస్టు. 2023-24 షేర్ ఏ పంజాబ్ టీ20 టోర్నీలో అతను ఎక్కువ వికెట్లు తీసిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో అశ్వని నైపుణ్యాన్ని పసిగట్టిన ముంబై ఇండియన్స్ జట్టు వేలంలో రూ.30 లక్షలకే అతడిని దక్కించుకుంది. అయితే చివరి సీజన్‌లో అశ్వనిని పంజాబ్ కింగ్స్ జట్టులోకి తీసుకున్నా బెంచ్‌కే పరిమితం చేయడం గమనార్హం.

కొత్త కుర్రాడు పడగొట్టాడు

4 వికెట్లతో సత్తా చాటిన అశ్వని కుమార్

ముంబై బోణీ ● కోల్‌కతా చిత్తు

రికెల్టన్ మెరుపు ఇన్నింగ్స్

ముంబై: ఈ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు విజయం రుచి చూసింది. రెండు వరుస ఓటములతో డీలా పడిన ఈ జట్టు సొంత మైదానంలో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అరంగేట్ర పేసర్ అశ్వని కుమార్ (4/24) చిరస్మరణీయ ప్రదర్శనతో మురిపించాడు. అటు బ్యాటింగ్‌లో ఓపెనర్ రికెల్టన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 62 నాటౌట్) చెలరేగడంతో ముంబై మరో 43 బంతులుండగానే 8 వికెట్ల తేడాతో నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 16.2 ఓవర్లలో 116 పరుగులకు కుప్పకూలింది. రఘువంశీ (16 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 26), రమణ్‌దీప్ సింగ్ (12 బంతుల్లో ఓ ఫోర్, 2 సిక్సర్లతో 22) మాత్రమే ఆకట్టుకున్నారు. ముంబై పేసర్ దీపక్ చాహర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 12.5 ఓవర్లలోనే 121/2 స్కోరు చేసి సులువుగా నెగ్గింది. సూర్యకుమార్ (9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 27 నాటౌట్) వేగంగా ఆడాడు. రస్సెల్‌కు రెండు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా అశ్వని కుమార్ నిలిచాడు.

రికెల్టన్ జోరు: స్వల్ప ఛేదనను ముంబై అలవోకగా పూర్తి చేసింది. ఓపెనర్ రికెల్టన్ మైదానం నలువైపులా షాట్లతో తుదికంటా నిలిచాడు. తొలి ఓవర్‌లో పేసర్ జాన్సన్ ఒక్క పరుగే ఇచ్చినా.. తర్వాత లయ అందుకున్న రికెల్టన్ ఎక్కడా తగ్గలేదు. మూడో ఓవర్‌లో 4,6.. నాలుగో ఓవర్‌లో 4,6,4తో చెలరేగాడు. రోహిత్ (13)తో తొలి వికెట్‌కు 46 పరుగులు జోడించాడు. పవర్‌ప్లేలోనే 55/1 స్కోరు సాధించిన ముంబైని ఆ తర్వాత కూడా కోలల్‌తా బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. స్పిన్నర్ నరైన్ ఓవర్‌లోనూ రెండు వరుస సిక్సర్లతో ఆకట్టుకున్న రికెల్టన్ 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. విల్ జాక్స్ (16) తర్వాత బరిలోకి దిగిన సూర్యకుమార్ 4,4,6తో 13వ ఓవర్‌లో మ్యాచ్‌ను ముగించేశాడు.

పేసర్ల ఉచ్చులో..: వాంఖడే అంటేనే బ్యాటింగ్‌కు స్వర్గధామం అంటారు. కానీ అద్భుత బ్యాటింగ్ లైనప్ కలిగిన కోల్‌కతా బ్యాటర్లు.. ముంబై బౌలర్ల ధాటికి తుస్సుమన్నారు. రహానె సేనకు అరంగేట్ర లెఫ్టామ్ పేసర్ అశ్వని కుమార్ చుక్కలు చూపించాడు. అలాగే ఇతర పేసర్లు బౌల్ట్, చాహర్ కట్టుదిట్టమైన బంతులకు కేకేఆర్ బ్యాటర్లకు ఆరంభం నుంచే దిక్కుతోచలేదు. దీంతో పరుగులు కాదు కాదా.. కనీసం వికెట్లు కాపాడుకోలేని పరిస్థితి ఎదురైంది. రఘువంశీ మాత్రమే అత్యధికంగా 16 బంతులు ఎదుర్కోగలిగాడు. తొలి ఓవర్‌లోనే అదిరే అవుట్ స్వింగర్‌తో ఓపెనర్ నరైన్‌ను బౌల్ట్ డకౌట్ చేశాడు. ఇక చివరి మ్యాచ్‌లో 97 రన్స్‌తో రాణించిన మరో ఓపెనర్ డికాక్ (1)ను చాహర్ అవుట్ చేయగా 2/2 స్కోరుతో కేకేఆర్ కష్టాలు మొదలయ్యాయి. ఇక అశ్వని తన తొలి బంతికే కెప్టెన్ రహానె (11) పనిబట్టి తన రాకను ఘనంగా చాటుకున్నాడు. ఈ దశలో రఘువంశీ భారీ షాట్లకు వెళ్లి ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ మరో ఎండ్‌లో వెంకటేశ్ అయ్యర్ (3)ను చాహర్ వెనక్కి పంపడంతో కేకేఆర్ పవర్‌ప్లేలో 41/4 స్కోరుతో ఇబ్బందికర స్థితిలో పడింది. రఘువంశీని హార్దిక్ పెవిలియన్ చేర్చాక.. మిగతా బ్యాటర్లు అశ్వనిని ఎదుర్కోవడంలో తడబడ్డారు. ఆరో వికెట్‌కు 29 పరుగులు జోడించి కుదురుకుంటున్న దశలో రింకూ సింగ్ (17), మనీశ్ పాండే (19)లను 11వ ఓవర్‌లో అశ్వని వెనక్కి పంపాడు. అయినా క్రీజులో రస్సెల్ (5), రమణ్‌దీప్ ఉండడంతో భారీ స్కోరుపై కేకేఆర్ ఆశలు వదులుకోలేదు. కానీ అశ్వని తన తర్వాతి ఓవర్‌లోనే ప్రమాదకర రస్సెల్‌ను బౌల్డ్ చేసి ముంబై శిబిరంలో సంతోషం నింపాడు. రమణ్‌దీప్ రెండు సిక్సర్లతో 100 రన్స్ దాటించినా 17వ ఓవర్‌లో అతడిని శాంట్నర్ అవుట్ చేయడంతో కోల్‌కతా ఆట ముగిసింది.

ఐపీఎల్‌లో నేడు

లఖ్‌నవూ X పంజాబ్	వేదిక: లఖ్‌నవూ	రా.7.30


రికెల్టన్ (62 నాటౌట్)

1 ఒకే ప్రత్యర్థి (కోల్‌కతా)పై ఒక వేదికలో ఎక్కువ విజయాలు (10) సాధించిన జట్టుగా ముంబై

స్కోరుబోర్డు

కోల్‌కతా: డికాక్ (సి) అశ్వని కుమార్ (బి) చాహర్ 1, నరైన్ (బి) బౌల్ట్ 0, రహానె (సి) తిలక్ (బి) అశ్వని కుమార్ 11, రఘువంశీ (సి) నమన్ ధిర్ (బి) హార్దిక్ 26, వెంకటేశ్ (సి) రికెల్టన్ (బి) చాహర్ 3, రింకూ (సి) నమన్ ధిర్ (బి) అశ్వని కుమార్ 17, మనీష్ పాండే (బి) అశ్వని కుమార్ 19, రస్సెల్ (బి) అశ్వని కుమార్ 5, రమణ్‌దీప్ (సి) హార్దిక్ (బి) శాంట్నర్ 22, హర్షిత్ (సి) నమన్ ధిర్ (బి) విఘ్నేశ్ 4, జాన్సన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం: 16.2 ఓవర్లలో 116 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-25, 4-41, 5-45, 6-74, 7-80, 8-88, 9-99, 10-116; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-23-1, దీపక్ చాహర్ 2-0-19-2, అశ్వని కుమార్ 3-0-24-4, హార్దిక్ 2-0-10-1, విఘ్నేశ్ 2-0-21-1, శాంట్నర్ 3.2-0-17-1.

ముంబై: రోహిత్ (సి) హర్షిత్ (బి) రస్సెల్ 13, రికెల్టన్(నాటౌట్) 62, విల్ జాక్స్ (సి) రహానె (బి) రస్సెల్ 16, సూర్యకుమార్ (నాటౌట్) 27, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 12.5 ఓవర్లలో 121/2; వికెట్ల పతనం:** 1-46, 2-91; **బౌలింగ్:** జాన్సన్ 2-0-14-0, హర్షిత్ 2-0-28-0, వరుణ్ 3-0-12-0, రస్సెల్ 2.5-0-35-2, నరైన్ 3-0-32-0.


వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతంపై సీఎంతో సమావేశమైన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు

వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కార్యాచరణ

» సీఎంతో భేటీ అయిన కేంద్ర ఉక్కు సహాయ మంత్రి, అధికారులు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఈ మేరకు భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం సోమవారం సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు. స్టీల్ ప్లాంట్ పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించడం, ప్రస్తుతం పనిచేస్తున్న రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లతోపాటు మూడో ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో సీఎం చర్చించారు. ప్లాంట్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి అవసరమైన సాయాన్ని రాష్ట్రప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పాండే, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీ సీఎండీ అమితవ ముఖర్జీ పాల్గొన్నారు.

మోదీ ఉపాధి... బాబు చేయూత: పురందేశ్వరి



అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 'దేశంలో కోటి మందికి ఉపాధి చూపాలని టాప్ 500 కంపెనీలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. రాష్ట్రంలోని పేదలకు ధనికులు చేయూత అందించాలని సీఎం చంద్రబాబు కోరుతున్నారు. ఇది దేశంలోని యువతకు, రాష్ట్రంలోని పేదలకు వరం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లాల నూతన అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సంస్థాగత అంశాలు-రాజకీయ కార్యాచరణపై ఆమె చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ... 'ఏడాది క్రితం వరకూ రాష్ట్రంలో విద్వేషం, విధ్వంసం మాత్రమే కనిపించేవి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఏపీకి భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపించేది. కానీ డబులింజన్ సర్కార్ వల్ల కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. రహదారులకు కొత్త రూపు వచ్చింది. మోదీ, బాబు, పవన్ సమన్వయంతో పోలవరం, అమరావతి నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని పార్టీ నేతలకు పురందేశ్వరి దిశా నిర్దేశం చేశారు.

పేదలు బాగుపడడం వైసీపీకి ఇష్టం లేదు: టీడీపీ

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ సైకో మూకలు పీ4పై చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వైసీపీ నేతలకు ప్యాలెస్‌లు కట్టుకొని పేదలను విస్మరించడం అలవాటు. పేదలు బాగుపడటం వారికి ఇష్టం లేదు' అని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ మాట్లాడారు. 'వైసీపీ నేతలు సూపర్ సిక్స్‌కు, పీ4కి ముడిపెడుతూ అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారు. పీ4 లాంటి విషయాలు అవినీతి కేసుల్లో ఏ-1, ఏ-2లుగా ఉన్న వారికి అర్థం కావు' అని అశోక్‌బాబు విమర్శించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ... 'సూపర్ 6ని పక్కదారి పట్టించడానికే పీ4 తీసుకువచ్చారని అబద్ధాలు ప్రచారం చేయడం వారి అవగాహన లేమికి నిదర్శనం. పేదలు బాగుపడటం వైసీపీ నేతలకు ఇష్టం లేదు' అన్నారు.

గ్రీష్మకు సీఎం అభినందనలు

తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో విశాఖపట్నంకు చెందిన యువ స్కేటర్ దొంతారా గ్రీష్మ మూడు విభాగాల్లో బంగారు పతకాలను సాధించడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో స్పందించారు. గ్రీష్మ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారంటూ అభినందనలు తెలిపారు.

రేపు బీటీ, సోము ప్రమాణస్వీకారం

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన బీటీ నాయుడు(టీడీపీ), సోము వీర్రాజు(బీజేపీ) బుధవారం ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. మండలి చైర్మన్ మోషేన్ రాజు వీరితో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన బీద రవిచంద్ర 4న, కావలి గ్రీష్మ 15న ప్రమాణస్వీకారం చేయనున్నారు. జనసేన నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కె.నాగబాబు ప్రమాణస్వీకార తేదీ ఇంకా ఖరారు కాలేదు.

అరకు కాఫీ పై ఆనంద్ మహీంద్ర పోస్టు

అరకు లోయ నుంచి పారిస్ నడిబొడ్డు వరకు అరకు కాఫీ ప్రయాణం స్ఫూర్తిదాయకమని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. పారిస్‌లో అరకు కేఫ్‌ను ప్రారంభం సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఎక్స్‌లో చేసిన పోస్టుపై సీఎం పైవిధంగా స్పందించారు. ఏపీ ఉత్పత్తికి అంతర్జాతీయ గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

బోధనాసుపత్రుల్లో ఖాళీల భర్తీ: సత్యకుమార్

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులను వాక్‌ఇన్ ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన సమీక్షలో సూపర్ స్పెషాలిటీ కేటగిరికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మొత్తం 682 పోస్టుల్లో 341 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి వివిధ విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ అర్హత కలిగిన 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఎంపిక చేసి నియమించినట్లు చెప్పారు. ప్రస్తుతం గత ప్రభుత్వం మంజూరు చేసిన 157 అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల్లో 79 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 160 ప్రొఫెసర్ పోస్టుల్లో 84 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వీటిని భర్తీ చేయడానికి వచ్చే వారం ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు.

బయోటెక్నాలజీ అభివృద్ధికి సహకారం: జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బయోటెక్నాలజీ రంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ సోమవారం తెలిపారు. సృజనాత్మక ఆవిష్కరణలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అనేక బయోటెక్ ఇంక్యుబేటర్లు, పరిశోధనా సంస్థలకు ఏపీ వేదికగా నిలుస్తోందని అన్నారు.

ఆ మూడు టోల్ చార్జీలు తగ్గాయి

జగ్గయ్యపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి నుంచి 3టోల్ గేట్లలో చార్జీలు స్వల్పంగా తగ్గనున్నాయి. జీఎంఆర్ నుంచి టోల్ గేట్ల నిర్వహణ నేషనల్ హైవే ఆథారిటీ పరిధిలోకి వచ్చాయి. దీంతో చిల్లకల్లు, పంతంగి, కొర్లపాడు టోల్ ధరలను ఎన్‌హెచ్ఏఐ తగ్గించింది. కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికల్స్‌కు చిల్లకల్లు వద్ద రానుపోను రూ.10, పంతంగి వద్ద రూ.45, కొర్లపాడు వద్ద రూ.25 తగ్గాయి. అయితే, టోల్‌ప్లాజాకు 20 కి.మీ. పరిధిలోని గ్రామాల వాహనాలకు నెలవారీ పాస్ చార్జీ రూ.10 పెరిగింది.

శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి

» కురుబ లింగమయ్య హత్యను ఖండిస్తున్నా: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య హత్యను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. 'రాష్ట్రంలో మళ్లీ పడగ విప్పిన ఫ్యాక్షన్ రాజకీయానికి తాజాగా రాప్తాడులో లింగమయ్య బలయ్యారు. వైసీపీ కార్యకర్తల మీద, నాయకుల మీద దాడులు సహజమయ్యాయి. రామగిరి మండల ఉపఎన్నికల్లో జరిగిన అరాచకాల వెనుక పోలీసు వైఫల్యం ఉంది. లింగమయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుంది' అని ఆయన అన్నట్లు వైసీపీ 'ఎక్స్'లో తెలిపింది.

గిరి మహిళలకు పవన్ ఉగాది కానుక

సొంత డబ్బుతో మూడు గ్రామాల్లో చీరల పంపిణీ


పవన్ కల్యాణ్ పంపించిన చీరలు చూపిస్తున్న మహిళలు

అనంతగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ఉగాదిని పురస్కరించుకుని తన సొంత డబ్బుతో మూడు గిరిజన గ్రామాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేసి ఔదార్యం చాటుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని బల్లగరువు, వెలగలపాడు, కొరపర్తి గ్రామాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యక్తిగత కార్యదర్శి బాలు.. ఉగాది ముందు రోజు (శనివారం) సందర్శించారు. పవన్ కల్యాణ్ పంపించారంటూ 250 మంది గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దీంతో గిరిమహిళలు ఎంతగానే సంబరపడ్డారు. పవన్ కల్యాణ్ చల్లగా ఉండాలని దీవించారు. డిసెంబరు 21న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయా గ్రామాలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే అక్కడి మహిళలకు ఉగాది పర్వదినం సందర్భంగా చీరలు పంపించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విద్యాసాగర్, పీఆర్ డీఈఈ రామం, అనంతగిరి ఎంపీడీవో ఏవీవీ కుమార్, తహసీల్దార్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను మోసం చేసిన వైసీపీ: మంత్రి టీజీ భరత్

» అధికారికంగా వాసవీమాత
ఆత్మార్పణ దినం: ఎంపీ అంబికా

అనంతపురం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 'ఆర్యవైశ్యులను గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. అందుకే 11 సీట్లకే పరిమితమైంది' అని మంత్రి టీజీ భరత్ విమర్శించారు. అనంతపురంలోని వైశ్య హాస్టల్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వసతి గృహం ఆవరణలో నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఆయనతోపాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. హాస్టల్‌లో ఆధునికీకరించిన గదులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... 'గత వైసీపీ పాలనలో ఆర్యవైశ్య మహాసభను నిర్వీర్యం చేయాలని చూశారు. అది వారి వల్ల కాలేదు. టీడీపీ హయాంలో కియ పరిశ్రమ ఏర్పాటుతో అనంతపురం జిల్లా రూపురేఖలే మారిపోయాయి. పక్కనే ఉన్న కర్నూలు జిల్లా కన్నా ఇక్కడి భూముల ధరలు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయి. ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది' అని అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఎన్నడూలేని విధంగా చంద్రబాబు నాయకత్వంలో వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.


చిత్తూరు జిల్లా యాదమరి మండలం ఓటివారి పల్లెలో నిర్మాణంలో ఉన్న మినీగోకులం


పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఇనిమెట్లలో నిర్మించిన జడ్పీహెచ్ఎస్ రోడ్డు

పల్లెల్లో పనుల సందడి!

(మొదటి పేజీ తరువాయి)

బలోపేతం చేసింది. రూ.10వేల కోట్ల ఉపాధి నిధులు ఖర్చుచేసి తిరిగి గ్రామీణులకు 'ఉపాధి'ని సుస్థిరం చేసింది. ఉపాధి పథకం అమలులో ఒకప్పుడు ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉండగా, గత వైసీపీ హయాంలో అట్టడుగుకు చేరింది. అయితే, కూటమి ప్రభుత్వం తిరిగి 1వస్థానాన్ని తిరిగి సాధించేందుకు అహర్నిశలూ కృషి చేసింది. గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండదండలందించి మినీ గోకులాలను నిర్మించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు తీసుకున్నారు. 10 నెలల్లోనే 26 వేల మినీ గోకులాలను నిర్మించారు. పంచాయతీ పాలనలో కేరళను ఆదర్శంగా తీసుకున్న పవన్ పక్కా ప్రణాళికలతో అభివృద్ధిని సాకారం చేస్తున్నారు.

ఆర్‌జీఎస్ఏలో రెండో స్థానం

గ్రామ పాలనను గాడిలో పెట్టేందుకు ఉపముఖ్యమంత్రి నేతృత్వంలోని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు నిరంతరం శ్రమించారు. రాష్ట్రానికి చెందిన కేరళ కేడర్ ఐఏఎస్ అధికారి కృష్ణతేజ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక పంచాయతీరాజ్‌శాఖ రూపురేఖలను సమూలంగా మార్చారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణాలతో పాటు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి జీపీడీపీ మార్గదర్శకాల ప్రకారం పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో 35 వేలకు పైగా పనులు చేపట్టడం విశేషం. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్ఏ) అమల్లో మన రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. ఒకప్పుడు 26వ స్థానంలో ఉన్న రాష్ట్రం.. పవన్ కల్యాణ్ చర్యలు, అధికారుల చొరవతో రెండో స్థానానికి చేరుకుంది. రాష్ట్ర వాటా చెల్లించడానికి ఇష్టం లేని జగన్ సర్కార్ గత ఐదేళ్లలో ఈ పథకం కింద ఒక్క పైసా కూడా నిధులు సాధించలేకపోయింది. ఈ పథకం ద్వారా శిక్షణా కేంద్రాలు, మౌలిక వసతులకు నిధులు రాకుండా ఆగిపోయాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల చొరవ, ఉపముఖ్యమంత్రి సిఫారసులతో తిరిగి ఈ పథకం కింద నిధులు విడుదలయ్యాయి. ఇదిలావుంటే, గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 13,218 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారు.

పంచాయతీరాజ్‌లో సంస్కరణలు

పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ వ్యవస్థలన్నీ ఒకే చోట ఉండాలని నిర్ణయించారు. జిల్లా స్థాయిలో జడ్పీ సీఈఓ, డీఎల్‌డీఓ, డీపీఓ, పీఆర్ ఇంజనీరింగ్ ఎస్ఈ కార్యాలయాలన్నింటినీ ఒకే కాంపౌండ్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీంతో పాటు పంచాయతీరాజ్‌లోని అన్ని విభాగాల్లోనూ పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేశారు. తొలిసారి ప్రతి ఏటా డీపీసీ ఏర్పాటు చేసి పదోన్నతుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇక, ప్రతి ఇంటికీ కొళాయి నీరు ఇవ్వాలన్న సంకల్పంతో కేంద్రం తెచ్చిన 'జల్‌జీవన్ మిషన్' ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో కేంద్రం నుంచి కేవలం రూ.2,254 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. పైగా నీటి వనరులు లేని చోట కొళాయిలు ఏర్పాటు చేయడంతో ఆ నిధులు వృథా అయ్యాయి. దీనిపై అధ్యయనం చేసిన పవన్ కల్యాణ్.. తిరిగి ఈ పథకాన్ని మొదటి నుంచి ప్రారంభించారు. 2028 కల్లా మొత్తం 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కొళాయి నీరు అందించాలని సంకల్పించారు.

ఏఐఐబీ పనులు తిరిగి ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) రుణం రూ.5 వేల కోట్లతో గత ప్రభుత్వం చేపట్టిన పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సిన 30 శాతం వాటా ఇవ్వకపోవడం, ఏఐఐబీ విడుదల చేసిన నిధులను సైతం కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ఇతర ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఏఐఐబీ కూడా రుణం నిలిపేసింది. కూటమి ప్రభుత్వం ఏఐఐబీ అధికారులతో ఉపముఖ్యమంత్రి చర్చించి వారిని ఒప్పించారు. ఈ ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టారు. గిరిజన ప్రాంతాల్లో ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూపు ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్లపనులు ప్రారంభించారు.

పల్లె పండుగ!

'పల్లె పండుగ' పేరుతో 4 వేల కిలో మీటర్ల మేరకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టింది. నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్లను నిర్మించారు. అదేవిధంగా 20,500 మినీ గోకులాలను నిర్మించి సరికొత్త రికార్డు సృష్టించారు. పశుగ్రాసం కోసం ఉపాధి నిధులను వ్యయం చేయడంలో ప్రభుత్వం ముందుంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 736 ఎకరాల్లో మాత్రమే పశుగ్రాసం అభివృద్ధి చేస్తే, పది నెలల్లో ప్రస్తుత ప్రభుత్వం 3 వేల ఎకరాల్లో పశుగ్రాసం అభివృద్ధి చేసింది. అదేవిధంగా కోటిన్నరకు పైగా మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయడం గమనార్హం.

స్వర్ణ పంచాయతీ పోర్టల్

గతంలో పంచాయతీల్లో పన్నుల వసూళ్ల వ్యవహారం వివాదంగా మారి పారదర్శకత లోపించింది. వసూలు చేసిన పన్నులు పంచాయతీల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించిన దాఖలాల్లేవు. దీనిని గమనించిన ప్రభుత్వం గ్రామాల్లో పన్నుల వసూళ్ల ప్రక్రియను ఆన్‌లైన్ చేస్తూ.. 'స్వర్ణ పంచాయతీ పోర్టల్'ను ప్రారంభించింది. పంచాయతీల పన్నుల వసూళ్లలో కూడా గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం ముందంజలో ఉంది. గత ఏడాది రూ.618 కోట్లు పన్నులు వసూలు కాగా, ఈ పది నెలల్లో రూ.819 కోట్లు వసూలు చేశారు.




అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి విస్తరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్. చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

అచ్యుతాపురం సభలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

జోడెద్దుల్లా

అభివృద్ధి, సంక్షేమం

» వాటికి సమప్రాధాన్యం ఇస్తున్నాం

» ఐదేళ్లలో ఎలమంచిలి, అనకాపల్లి రూపురేఖలు మార్చే బాధ్యత మాది: లోకేశ్

అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని ఐటీ మంత్రి లోకేశ్ అన్నారు. గత పాలకులు ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా.. తాము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రూ.243 కోట్ల అంచనాతో చేపట్టిన అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి (14 కిలోమీటర్లు) విస్తరణ పనులకు సోమవారం ఆయన అచ్యుతాపురంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయన్నారు. వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు చేసి.. ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నామని.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్ అందించడం లేదని చెప్పారు. 'అన్న క్యాంటీన్లు తెరిపించి పేదల ఆకలి తీరుస్తున్నాం. మహిళలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. మరో రెండు నెలల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. యువగళం పాదయాత్ర సందర్భంగా వచ్చినప్పుడు అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో ఉన్న గోతులను స్కేలు పెట్టి కొలవాల్సి వచ్చింది. అధికారంలోకి రాగానే గోతులు పూడ్చేందుకు నిధులు మంజూరు చేశాం. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో స్థానిక ప్రజలు, షాపుల యజమానులకు ఇబ్బంది లేకుండా కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూస్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలి. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలంతా సహకరించాలి. ఈ ప్రాంతానికి ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు, బల్క్ డ్రగ్ పార్క్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వస్తున్నాయి. పెద్దఎత్తున వస్తున్న పరిశ్రమలతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఐదేళ్లలో అనకాపల్లి, ఎలమంచిలి రూపురేఖలు మార్చే బాధ్యత తీసుకుంటాం' అని తెలిపారు. కూటమి కార్యకర్తలు కసితో ప్రజల కోసం అహర్నిశలూ కష్టపడాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యేలకు తెలియజేసి పరిష్కరించుకోవాలని పిలుపిచ్చారు.

లోకేశ్‌కు ఘనస్వాగతం

అధికారంలోకి వచ్చాక తొలిసారి అచ్యుతాపురం వచ్చిన లోకేశ్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ప్రగడ నాగేశ్వరరావు, తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సిస్కో' నుంచి రవీంద్రారెడ్డి ఔట్!

రాష్ట్ర ప్రాజెక్టుల నుంచి పక్కన పెట్టిన సంస్థ

» ఇటీవల సిస్కో బృందంతో లోకేశ్ వద్దకు రవీంద్ర

» గతంలో టీడీపీ నేతలపై దూషణలు చేసిన ఇప్పాల

» రవీంద్రరెడ్డి విషయం తెలిసి సీరియస్ అయిన లోకేశ్


» సిస్కో యాజమాన్యానికి మంత్రి ఓఎస్‌డీ లేఖ

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నేతలపై అసభ్యకర పోస్టులతో చెలరేగిపోయిన ఇప్పాల రవీంద్ర రెడ్డిని సిస్కో యాజమాన్యం రాష్ట్ర ప్రాజెక్టుల నుంచి పక్కన పెట్టింది. గత నెల 25న సిస్కోతో ఏపీ ప్రభుత్వం సిస్కోతో ఒప్పందం చేసుకుంది. ఆ సమయంలో రవీంద్ర రెడ్డి కూడా అక్కడ ప్రత్యక్షమయ్యారు. సిస్కోలో టెరిటరీ సేల్స్ మేనేజర్‌గా చేస్తున్న రవీంద్రరెడ్డి సదరు సమావేశం సమన్వయ బాధ్యతలు చూశారు. లోకేశ్‌తో కలిసి ఫొటోలు దిగారు. ఈ వ్యవహారంపై టీడీపీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల వేదికగా భగ్గుమన్నారు. రవీంద్రారెడ్డి నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ.. ఆయన వైసీపీ హయాంలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, పలువురు పార్టీ నేతలపై పెట్టిన అసభ్యకరమైన పోస్టులను లోకేశ్ 'ఎక్స్' ఖాతాకు ట్యాగ్ చేశారు. దీంతో లోకేశ్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే సిస్కో ప్రతినిధులతో మాట్లాడి, రవీంద్రారెడ్డి ఇకపై ఏపీకి సంబంధించిన ప్రాజెక్టుల్లో పాల్గొనకుండా చూడాలని తన పేషీ అధికారులను ఆదేశించారు. లోకేశ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన మంత్రి ఐటీ విభాగం ఓఎస్‌డీ వినాయకసాయి చైతన్య సిస్కో యాజమాన్యానికి ఘాటుగా లేఖ రాశారు. గతంలో టీడీపీ నేతల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రవీంద్ర రెడ్డి పెట్టిన అసభ్యకరమైన పోస్టుల ను ఆ లేఖకు జత చేశారు. "రవీంద్ర రెడ్డికి ఏపీలో సిస్కో చేపట్టిన ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం ఉందని మేం భావించడం లేదు. ఏపీలో చేపట్టబోయే ఏ ప్రాజెక్టులోనూ ఆయనను భాగస్వామి చేయవద్దు" అని సిస్కో యాజమాన్యాన్ని ఆ లేఖలో కోరారు. దీనిపై స్పందించిన సిస్కో యాజమాన్యం రవీంద్ర రెడ్డిని ఏపీ ప్రాజెక్టుల నుంచి తప్పించినట్లు సోమవారం లోకేశ్ పేషీకి సమాచారం ఇచ్చింది.

సీబీజీ ప్లాంటుకు 'తొలి' అడుగు

» రేపు కనిగిరిలో లోకేశ్, అనంత్ అంబానీ శంకుస్థాపన

» రాష్ట్రవ్యాప్తంగా 500 సీబీజీ ప్లాంట్లు: గొట్టిపాటి


అనంత్ అంబానీ

అమరావతి, పీసీపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కంప్రెస్ట్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటులో కీలక ముందడుగు పడనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు కానున్న 500 సీబీజీ ప్లాంట్లలో భాగంగా మొదటి దానికి బుధవారం శంకుస్థాపన జరగనుంది. ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతంలో స్థాపించనున్న తొలి సీబీజీ ప్లాంటుకు మంత్రి నారా లోకేశ్‌తో కలిసి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ ఈ నెల 2న శంకుస్థాపన చేయనున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం వెల్లడించారు. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో బుధవారం భూమిపూజ చేయనున్న ప్లాంట్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రిలయన్స్ గ్రీన్ ఎనర్జీ రాష్ట్రవ్యాప్తంగా 500 సీబీజీ ప్లాంట్లు స్థాపించనుందని, వీటి కోసం ఆ సంస్థ ప్రైవేటు భూములను లీజుకు సేకరిస్తుందని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో బీడు భూములను కూడా లీజుకు తీసుకోవడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని వివరించారు. ఈ ప్లాంట్ల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలూ దక్కుతాయని అన్నారు. రైతులు కౌలుకు ఇచ్చినా ఏటా రూ.4వేల నుంచి రూ.5వేలు కూడా దక్కని భూములను గుర్తించామని అన్నారు. ప్రభుత్వ భూములకు ఎకరాకు రూ.15వేలు, ప్రైవేటు భూములకు ఎకరాకు రూ.31 వేలు చెల్లిస్తుందని వివరించారు. ప్రస్తుతం కనిగిరి ప్రాంతంలో 100 టన్నుల సామర్థ్యంతో సీబీజీ ప్లాంటు నిర్మాణాన్ని చేపడుతుందని, త్వరలోనే గిద్దలూరు, మార్కాపురం, దర్శి, కొండపిలోనూ ఏర్పాటు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. ఆయన వెంట కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఉన్నారు.





కర్నూలులోని ఈద్గాలో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు



▸▸ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు

అమరావతి, నంద్యాల కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో వేడుకలు చేసుకున్నారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈద్గాలో వేలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మసీదులు, ఈద్గాలు కిక్కిరిశాయి.

నేడు ఐచ్ఛిక సెలవు

▸▸ ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం మంగళవారం ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ముస్లింలంతా సోమవారం రంజాన్ పండుగ జరుపుకొన్నారు. దాదాపు నెల రోజుల పాటు ఉపవాస దీక్షల్లో ఉన్న వారంతా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. దీంతో ఏప్రిల్ 1 తేదీని ఆప్షనల్ హాలీడేగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు సీఈవో ప్రభుత్వానికి విన్నవించారు. ఆయన విన్నపం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టెన్త్ సోషల్ పరీక్ష యథాతథం

▸▸ ఐచ్ఛిక సెలవు వర్తించదు

పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం (నేడు) యథావిధిగా జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణపై ఎలాంటి అపోహలు లేకుండా సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించారు. రంజాన్ పండగ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులకు ఐచ్ఛిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చారు.

కరువు గుప్పిట 51 మండలాలు

▸▸ ఆరు జిల్లాల పరిధిలో గుర్తింపు

అమరావతి, మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్‌లో వర్షాభావం నెలకున్న ఆరు జిల్లాల్లోని 51 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 37 తీవ్ర కరువు, 14 మధ్యస్థ కరువు మండలాలుగా గుర్తించారు. సోమవారం ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తీవ్ర కరువు మండలాల జాబితాలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల; శ్రీసత్యసాయిజిల్లా రొద్దం; కర్నూలుజిల్లా ఆస్పిరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి; అనంతపురం జిల్లా బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, ఎల్లనూరు, యాడికి; ప్రకాశంజిల్లా పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు,మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బెస్తవారిపేట; కడప జిల్లా దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, కాశినాయన, ఖాజీపేట,చాపాడు,ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తొండూరు ఉన్నాయి. మధ్యస్థ కరువు మండలాలుగా పత్తికొండ (కర్నూలు); విడపనకల్లు (అనంతపురం); మైలవరం (కడప); తనకల్లు (శ్రీసత్యసాయి జిల్లా);బేతంచర్ల, బనగానపల్లి, సంజామల,ఉయ్యాలవాడ (నంద్యాలజిల్లా); కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, చంద్రశేఖరపురం, పామూరు, రాచర్ల (ప్రకాశం జిల్లా) ఉన్నాయి. ఈ మండలాల రైతులు రుణ సౌకర్యం పొందటానికి, ఇతర సహాయ కార్యకలాపాలు చేపట్టడానికి వీలుగా జిల్లాల గజెట్లు ప్రకటించి, తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ మూణ్నెల్లూ మంటలే!




పెరగనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు .. సాధారణం కంటే అధికంగా వడగాడ్పులు

▸▸ అనేకచోట్ల 45 డిగ్రీలు, కొన్నిచోట్ల అంతకుమించి..

▸▸ వేసవి ఉపశమన ప్రణాళికలు అవసరమంటున్న ఐఎండీ

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రెండు నెలల నుంచి ఎండలు, వడగాడ్పులకు దేశంలో అనేక ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. ఇక రానున్న మూడు నెలల్లో కూడా ఎండ తీవ్రత, వడగాడ్పులు అంతకుమించి ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదుకానున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా హీట్‌వేవ్ జోన్‌లో ఉన్న దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడతాయన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వేసవి నుంచి గట్టెక్కడానికి కేంద్ర, రాష్ట్రాల పరిధిలోని విపత్తుల నిర్వహణ సంస్థలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని భారత వాతావరణ శాఖ తొలిసారిగా సూచనలు చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల వేసవి సీజన్‌కు సంబంధించి సోమవారం భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. మూడు నెలల సీజన్‌లో దక్షిణ భారతంలో పడమర ప్రాంతాలు, తూర్పు భారతం, దానికి ఆనుకుని మధ్య భారతంలో కొన్ని ప్రాంతాలు తప్ప.. దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఉత్తర, మధ్య, తూర్పు భారతం, దానికి ఆనుకుని దక్షిణాది రాష్ట్రాల్లో వడగాడ్పులు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడుల్లోని ఉత్తర ప్రాంతంలో సగటు కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయి. సాధారణంగా ఈ సీజన్‌లో నెలకు ఐదు నుంచి ఆరు రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీస్తాయి. అటువంటిది ఈ ఏడాది ఈ మూడు నెలల సీజన్‌లో ఐదు నుంచి ఎనిమిది రోజులు వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఏప్రిల్ వరకు చూస్తే పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇంకా వడగాడ్పులు తీవ్రంగా ఉండడంతో పాటు సాధారణం కంటే ఎక్కువ రోజులు కొనసాగుతాయి. ఏప్రిల్‌లో దక్షిణ, పడమర, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా, దేశంలోని మిగతా ప్రాంతాల్లో తక్కువగా వర్షపాతం నమోదుకానుంది. ఏప్రిల్‌లో దేశంలో 39.2 మి.మీ. వర్షపాతం నమోదుకావాలి. గడచిన రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షం జాడ లేకపోడంతో నేల పొడిగా మారిందని, దాంతో ఎండలు, గాడ్పులు పెరిగాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలో హీట్‌వేవ్ కోర్ జోన్‌లో 10 అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. మార్చిలో అనేకచోట్ల 40 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే మూడు నెలల కాలంలో అనేకచోట్ల 45 డిగ్రీలు, అక్కడక్కడా మరింత ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న మూడు నెలల్లో ఎండలు, వడగాడ్పుల ప్రభావం నుంచి తట్టుకునేలా కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలు వేసవి ఉపశమన ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్‌లో పేర్కొంది. వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు, ఆరోగ్యపరంగా ఇబ్బందులుపడే వ్యక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎక్కువగా చలువ కేంద్రాలు ఏర్పాటుతోపాటు ఆరోగ్యశాఖను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇవ్వడం, ఎండలు, గాడ్పుల వల్ల ఇబ్బందులపై హెచ్చరికలు జారీచేయడం, నగరాల్లో అర్బన్ హీట్ ఐలాండ్స్‌ను గుర్తించి చలువ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటివి చేయాలని భారత వాతావరణ శాఖ సూచించింది.



ఏప్రిల్ నుంచి జూన్ వరకు, ఏప్రిల్ నెలలో దేశంలో సాధారణం కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయని అంచనా

ఇలా చేయండి..

రానున్న మూడు నెలలు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది.

- ఎండ, వడగాలి ఎక్కువగా ఉన్నప్పుడు వీలైనంత ఇంట్లోనే ఉండాలి. వేడి నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్, కూలర్లు, ఏసీలు వినియోగించాలి.
- ఇంట్లో ఉన్నా, దాహం వేయకపోయినా తరచూ నీరు తాగా లి. సాయంత్రం, రాత్రి వేళ చన్నీటితోనే స్నానం చేయాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ నీళ్లు, కొబ్బరి నీరు తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే.. తెల్లటి కాటన్ వస్త్రాలు ధరించాలి. తలకు టోపీ పెట్టుకోవాలి. లేదా రుమాలు కట్టుకోవాలి. కళ్లద్దాలు పెట్టుకోవాలి.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే మంచినీరు/నిమ్మరసం, మజ్జిగ తాగాలి.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తలతిరగడం వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే.. వడదెబ్బగా గుర్తించి, వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఇవి చేయొద్దు!

- ఎండ, వేడి వాతావరణం ఉన్నప్పుడు బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు, వయో వృద్ధులు బయట తిరగకూడదు.
- బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఎండలో తిరగరాదు.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె, పంచదార వంటి తీపి పదార్థాలు తీసుకోకూడదు.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు శీతల పానీయాలు, ఐస్‌లు, ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ డ్రింక్‌లు తాగడం మానుకోవాలి.
- అధిక ప్రొటీన్, ఉప్పు, కారం, నూనె వస్తువులు తీసుకోకూడదు.

కొడాలి నాని ఆరోగ్యం

తీవ్ర ఆందోళనకరం!

▸▸ మూడు రక్త నాళాలు బ్లాక్

▸▸ సర్జరీ కూడా చేయలేని పరిస్థితి

▸▸ ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలింపు



హైదరాబాద్ సిటీ/మచిలీపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆరోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనను కుటుంబ సభ్యులు సోమవారం హైదరాబాద్ నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. కొడాలి నాని గ్యాస్ట్రిక్ (జీర్ణకోశ) సమస్యతో ఐదు రోజుల క్రితం ఏఐజీలో చేరారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా... గుండెకు సంబంధించి తీవ్రమైన సమస్య ఉన్నట్లు బయటపడింది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మూడు రక్త నాళాలు చాలా వరకు బ్లాక్ అయ్యాయని వైద్యులు నిర్ధారించారు. సాధారణంగా ఇలాం టి పరిస్థితుల్లో బైపాస్ సర్జరీ నిర్వహిస్తారు. అయితే... సర్జరీ చేసేందుకు కొడాలి ఆరోగ్య పరిస్థితి సహకరించదని, చేసినా మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమా దముందని వైద్యులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. మందుల ద్వారా పరిస్థితి మెరుగుపరిచే అవకాశాలను పరిశీలించారు. కానీ... ఫలితం కనిపించలేదు. దీంతో... కొడాలి నానిని సోమవారం ఏఐజీ హైదరాబాద్ నుంచి డిశ్చార్జి చేశారు. కుటుంబం ఆయనను మెరుగైన చికిత్స కోసం బేగంపేట విమానాశ్రయం నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. సుప్రసిద్ధ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండా చైర్మన్‌గా ఉన్న ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో కొడాలి నానిని చేర్పించినట్లు తెలిసింది. అత్యంత సంక్లిష్టమైన కార్డియాక్ సర్జరీలను విజయవంతంగా చేయగలరని డాక్టర్ పాండాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. 2009లో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌కు కూడా ఆయనే శస్త్ర చికిత్స చేశారు.

ఆర్టీఈ ఫీజుల ఖరారుకు కమిటీ

▸▸ నెల రోజుల్లో కొత్త ఫీజులు సిఫారసు

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద పేద విద్యార్థులకు కేటాయించే సీట్లకు సంబంధించిన ఫీజుల ఖరారుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. గత ప్రభుత్వంలో పట్టణాల్లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.6,100 చొప్పున ఆర్టీఈకి ఫీజులు నిర్ణయించారు. ఆ ఫీజులతో సీట్లు కేటాయించడం సాధ్యం కాదని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాలతో ఫీజుల పునఃసమీక్షకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. కమిటీ నెల రోజుల్లో కొత్త ఫీజులను సిఫారసు చేయనుంది. ఆర్టీఈ కింద ప్రైవేటు పాఠశాలలు 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. ఆ ఫీజులను ప్రభుత్వం పాఠశాలలకు చెల్లిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 34వేల మంది విద్యార్థులు ఆర్టీఈ కింద సీట్లు పొంది చదువుతున్నారు. వారికి ప్రభుత్వం ఏడాదికి రూ.62 కోట్లు ఫీజులు చెల్లిస్తోంది.

భూదందాలో బాస్‌లు!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా	ఫ్రీ హోల్డ్ చేసిన భూమి (ఎకరాల్లో)	అక్రమంగా చేసినవి
శ్రీసత్యసాయి	2,57,042	1,30,215
అన్నమయ్య	1,26,227	64,218
తిరుపతి	69,011	34,202
చిత్తూరు	1,59,327	18,690

ఎవరో చెబుతున్న మాట కానేకాదు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ హయాంలో భూముల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిన రెవెన్యూశాఖ తాజాగా సర్కారుకు అందించిన నివేదికలో పేర్కొన్న వాస్తవాలివి. తహసీల్దార్ స్థాయి నుంచి జిల్లాకు సూపర్‌బాస్‌లు గా ఉన్న ఐఏఎస్‌ల వరకు కొందరు ఈ భూ అక్రమాల్లో తిలాపాపం తలాపిడికడు చందంగా పాత్రను పోషించారని రెవెన్యూశాఖ నిగ్గుతేల్చింది. గత జగన్ ప్రభుత్వ హయాంలో చివరి ఏడునెలల కాలంలో అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు ఇచ్చేందుకు తీసుకొచ్చిన ఫ్రీ హోల్డ్ విధానంలో భారీగా అక్రమాలు జరిగిన విషయాన్ని రెవెన్యూశాఖ ఇటీవలే బయటపెట్టిన సంగతి తెలిసిందే. లోతైన విచారణ చేయగా, జగన్ ప్రభుత్వంలోని ఆరుగురు మంత్రులు, తహసీల్దార్, ఆర్డీఓల పాత్ర బయటపడింది. ఇదేకాదు, ఆనాడు జిల్లాకు సూపర్ బాస్‌లుగా పనిచేసిన కొందరు ఐఏఎస్‌ల పాత్రపైనా స్పష్టమైన ఆధారాలు బయటకొచ్చాయి. వైసీపీ నేతల రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వేలాది ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూములు పరాధీనం కావడంలో వారి వైఫల్యం, ఉద్దేశపూర్వక తప్పులు ఉన్నాయని రెవెన్యూశాఖ సర్కారుకు పంపిన నివేదికలో పేర్కొంది.

కంచే చేను మేసింది..

రాష్ట్రంలో అసైన్డ్, ఇనాం, చుక్కల భూమి, షరతు గల పట్టా భూముల విషయంలో ప్రతి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయి. అందులో 13 జిల్లాల పరిధిలో భారీగా అక్రమాలు చోటుచేసుకోగా, అందులో నాలుగు జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. ఊహించని అక్రమాలతో శ్రీ సత్యసాయి జిల్లా టాప్‌లో నిలవగా, దాని తర్వాతి స్థానం అన్నమయ్య జిల్లాదే. చిత్తూరు, తిరుపతి ఆ తర్వాతి వరసలో ఉన్నాయి. ఏతావాతా రాయలసీమలోనే అసైన్డ్ అక్రమాలు కోకొల్లలుగా చోటుచేసుకోవడం గమనార్హం. శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, నెల్లూరు జిల్లాల పరిధిలోని కొన్ని డివిజన్లు, మండలాల్లో కూడా అక్రమంగా భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. అయితే, పైన పేర్కొన్న టాప్ జిల్లాల్లో మాత్రం అతి భారీగా, లక్షల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగించారు. పేదలకు మేలు చేస్తున్నామనే పేరుచెప్పి నాటి వైసీపీ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు, నేతలు భూములను దండుకున్నారు. ఇందుకు నాటి ప్రభుత్వంలో జిల్లాల్లో కీలక పోస్టుల్లో సూపర్‌బాస్‌లుగా ఉన్న ఐఏఎస్ అధికారుల పాత్ర ఉందని తాజాగా నిర్ధారణ అయింది.ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం(పీఓటీ) -1977, రిజిస్ట్రేషన్ చట్టం-1908, భూ ఆక్రమణ చట్టం-1905, చుక్కల భూముల చట్టం-2017లను అమలు చేయాల్సింది ఆ అధికారులే. అయితే, రాజకీయ నేతల ఒత్తిళ్లు, బెదిరింపులకు తలొగ్గి చట్టాల అమలును నీరుగార్చారని రెవెన్యూశాఖ తేల్చింది.

నిబంధనలకు నీళ్లు..

2023 సెప్టెంబరు నుంచి 2024 మార్చి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,59,805 ఎకరాల భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. అయితే, ఇందులో 5, 74,306 ఎకరాలు పీఓటీ చట్టానికి విరుద్ధంగా, జీవో 596ను ఉల్లంఘించి నిషేధ విముక్తి కల్పించారని రెవెన్యూ విచారణలో తేలింది. ఇందులో 2.64 లక్షల ఎకరాలకు అసలు రెవెన్యూ రికార్డులే లేవు. అయినా ఆ భూములను అసైన్డ్ కోటా కింద లెక్కేసి ఫ్రీ హోల్డ్ చేశారని విచారణలో బయటపడింది. కలెక్టర్ల ఉత్తర్వులు లేకుండానే 60వేల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. అంటే ఈ విషయం కలెక్టర్‌లకు తెలిసే జరిగిందా? లేదా? 36వేల ఎకరాలను విస్తీర్ణంతో సంబంధం లేకుండా 22(ఏ) నుంచి తొలగించారు. చట్టంలోని ప్రధాన అంశం 20 ఏళ్ల పూర్తయిన భూములకే ఫ్రీ హోల్డ్ కల్పించాలని. కానీ, రాష్ట్ర వ్యాప్తంగా 38వేల ఎకరాలను, ఆ కండీషన్ పరిధిలో లేకున్నా నిషేధ జాబితా నుంచి తొలగించారని తాజా నివేదికలో రెవెన్యూశాఖ పేర్కొంది. అంటే, ఇవన్నీ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు దగ్గరుండి పర్యవేక్షించడంతోపాటు, పరిశీలించాల్సిన అంశాలు. కలెక్టర్ ఉత్తర్వులు లేకుండా 60వేల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగిస్తుంటే వారు జిల్లాల్లో ఏం చేసినట్లు? అన్న అనుమానలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూశాఖ నివేదిక ప్రకారం 13 జిల్లాల్లో భారీగా అక్రమాలు జరిగాయి. అందులో 4 జిల్లాల్లో శ్రుతి వించేశారు. సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అధికారులు కళ్లు మూసుకున్నారా? వైసీపీ నేతలకు రాసిచ్చేశారా? అన్నట్లుగా అక్రమాలున్నాయి.

కలెక్టర్లది బాధ్యత కాదా?

ఫ్రీ హోల్డ్ చేసే ప్రతి అసైన్డ్ భూమికీ రికార్డు పక్కాగా ఉండాలి. భూమి పొందిన లబ్ధిదారు(అసైనీ) పొజిషన్‌లో ఉండాలి. ఆ భూమి 20 ఏళ్ల క్రితమే అసైన్‌మెంట్ చేసి ఉంటే చట్టప్రకారం ఫ్రీ హోల్డ్‌కు అర్హత ఉన్నట్లు. నిషేధ భూముల జాబితా 22 (ఏ) అమలు, పర్యవేక్షణ బాధ్యతలు జిల్లాలో ఐఏఎస్‌లకే ఉన్నాయి. దీనిపై రెవెన్యూశాఖ 2023 డిసెంబరులో జీవో 596 జారీ చేసింది. అందులోనూ జిల్లా స్థాయిలో కీలక పోస్టుల్లో ఉన్న ఐఏఎస్‌లకే అధికారాలు కట్టబెట్టారు. నిజానికి, జిల్లా స్థాయిలో భూముల అంశంలో కలెక్టర్ అంటే జేసీనే. భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షించుకోవాల్సిన బాధ్యత వారిదే. కానీ తాజా రెవెన్యూ విచారణలో 2.64 లక్షల ఎకరాల భూమికి రికార్డులు లేకున్నా ఫ్రీ హోల్డ్ చేశారు.

ఎవరేమనుకుంటే మాకేంటి?

ఏసీబీ కేసు ఉన్న అధికారికే విజిలెన్స్

రెవెన్యూశాఖలో సరికొత్త వివాదం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"రెవెన్యూశాఖ ఇంకా కంట్రోల్‌లోకి రాలేదు. ఇలాగైతే కష్టం" సీఎం చంద్రబాబు ఇటీవలి కలెక్టర్ల సమావేశంలో చేసిన వ్యాఖ్యలివి. ఈ శాఖను దారిలో పెట్టి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని సీఎం తపనపడుతుంటే, రెవెన్యూ అధికారులు మాత్రం తమదారి తమదే అని నిరూపించుకున్నారు. ఏసీబీ కేసులో ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాలని ఓ అధికారిపై ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటే, ఆ అధికారికే ఏరికోరి సీసీఎల్ఏ(భూపరిపాలన ప్రధాన కమిషనర్) కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ విషయం తెలిసి ఉన్నతాధికారులు విస్తుపోతున్నారు. భారీగా డబ్బు దొరికిన కేసులో ఏసీబీ విచారణను ఎదుర్కోవాల్సిన అధికారికి విజిలెన్స్ విభాగం ఎలా ఇచ్చారు? అన్న చర్చతో ఈ వ్యవహారం వివాదస్పదంగా మారింది. ఏసీబీ కేసులు ఉన్నవారికి భరోసా ఇచ్చేలా పోస్టింగ్ ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్షమందికిపైగా ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారు. వారికి పునరావాసం, పరిహారాలను అందించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసింది. ఇందులో ఓ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించారు. 2017లో పోలవరం ఎస్‌డీసీ కార్యాలయంలో భారీగా నగదు పంపిణీ జరుగుతోందన్న ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు దాడిచేశారు. ఆ సమయంలో సోదాలు జరపగా ఓ డిప్యూటీ కలెక్టర్ స్థాయి కీలక అధికారి వద్ద భారీగా నగదు లభ్యమైంది. దీంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. జవాబుదారీ కాని సొమ్ము దొరికిందని కేసు డైరీలో పేర్కొన్నారు. ఈ కేసుపై విచారణలో భాగంగా ఆ అధికారిపై నమోదైన ఆరోపణలపై కోర్టులో విచారించేందుకు(లీగల్ ప్రాసిక్యూషన్) అనుమతించాలని ఏసీబీ కోరింది. గత ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా విషయాన్ని నాన్చగా, కొత్త ప్రభుత్వం ఇటీవలే ఇందుకు అనుమతించింది. ఇది జరిగిన కొద్దిరోజులకే ఆ అధికారికి సీసీఎల్ఏలో పోస్టింగ్ ఇచ్చారు. అదీ చాలా కీలకమైన పోస్టింగ్. సీసీఎల్ఏ కార్యాలయంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, ఇతర ఉద్యోగుల విజిలెన్స్ కేసులు, సర్వీసు అంశాలు చూసే విభాగం ఆ అధికారికి అప్పగించారు. ఆ అధికారి గురించి గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్, జేసీతో మాట్లాడిన తర్వాతే ఈ పోస్టింగ్ ఇచ్చినట్లు రెవెన్యూశాఖ సమర్థించుకుంటోంది. కానీ, ఆయనకు ఏరికోరి విజిలెన్స్ విభాగం ఎందుకు ఇచ్చారన్న దానికి సమాధానం లేదు. ఏసీబీ కేసులో ప్రాసిక్యూషన్ ఎదుర్కొనే అధికారి, తన కింది కేడర్ అయిన తహసీల్దార్, డీటీల విజిలెన్స్ కేసుల్లో పారదర్శకంగా ఎలా ఉంటారు? ఈ విషయం గురించి 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా, ఓ ఉన్నతాధికారి కావాలనే పోస్టింగ్ ఇప్పించారనే విషయం వెలుగుచూసింది.

మొక్కు తీర్చుకోడానికి వెళ్తూ..

▸▸ లారీని ఢీకొన్న కారు.. ఒకే కుటుంబంలోని నలుగురి దుర్మరణం

▸▸ అవనిగడ్డ సమీపంలో ప్రమాదం... నిద్రమత్తే కారణమా?!



లారీని ఢీకొట్టిన కారు

అవనిగడ్డ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కొడుకు పుట్టాడన్న సంతోషంలో దేవుడికి మొక్కు తీర్చుకునేందుకు కారులో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఐటీసీ ఉద్యోగి.. తన ఇద్దరు బిడ్డలతోపాటు తల్లిదండ్రులనూ కోల్పోయారు. కృష్ణా జిల్లా పులిగడ్డ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గిడుగు సందీప్ హైదరాబాద్‌లోని ఐటీసీ కంపెనీలో పని చేస్తున్నారు. ఇటీవల కుమారుడు పుట్టడంతో కుటుంబ సమేతంగా, మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెనాలి నుంచి సోమవారం కారులో బయలుదేరారు. సాయంత్రం 3 గంటల సమయంలో మోపిదేవి మార్గంలోని పులిగడ్డ-పెనుమూడి వారధి, టోల్‌గేట్ నడుమ ఎదురుగా వస్తున్న లారీని కారు వేగంగా వెళ్లి ఢీకొంది. రహదారిపై ఎడమవైపుగా వెళ్లాల్సిన కారు, కుడి వైపునకు వెళ్లి ఎదురుగా లారీపైకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారును సందీప్ డ్రైవ్ చేస్తుండగా, ముందు సీటులో ఉన్న ఆయన తండ్రి జీఆర్ మోహన్‌బాబు (60), వెనుక కూర్చున్న తల్లి అరుణ (55) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీటులో సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక (5)తో పాటు పల్లవి ఒడిలో రెండు నెలల షణ్ముఖ్ కూడా ఉన్నాడు. తీవ్రంగా గాయపడిన సాత్వికను అవనిగడ్డ నుంచి మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందింది. సందీప్‌కు తీవ్ర గాయాలు కాగా, ఆయన భార్య పల్లవి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో సందీప్ షాక్‌లోకి వెళ్లాడు. కొద్దిసేపు తానెవరో చెప్పలేకపోయిన ఆయన, ఆ తర్వాత తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు వివరించారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు అంతబట్టడంలేదని, బహుశా సందీప్ నిద్రమత్తులో ఉండడంవల్ల జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

మైనర్ మినరల్స్ నిబంధనల్లో జోక్యం చేసుకోలేం

▸▸ జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనర్ మినరల్స్ లీజు కేటాయింపునకు ఆక్షన్ విధానంతో పాటు వార్షిక డెడ్ రెంట్ చెల్లింపు, సెక్యూరిటీ డిపాజిట్ నిబంధనలకు సవరణ చేస్తూ 2022లో గనులశాఖ తీసుకొచ్చిన జీవో 13, 14లను సవాల్ చేసిన వ్యాజ్యాలను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. సెక్యూరిటీ డిపాజిట్‌గా ఎంత సొమ్ము జమ చేయాలన్నది కోర్టు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. అది పూర్తిగా విధానపరమైన నిర్ణయమని తెలిపింది. వార్షిక డెడ్ రెంట్‌కు మూడింతలు నగదు రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాలన్న నిబంధన ఏకపక్షమైనదిగా ప్రకటించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. సవరించిన మైనర్ మినరల్స్ నిబంధనలను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారనే కారణంతో చట్టబద్ధత కలిగిన ఆ నిబంధనలు రద్దు చేయలేమంది. ఈ విషయంలో పిటిషనర్లు నిర్దిష్ట ఉదాహరణలు కోర్టు ముందు ఉంచలేదని పేర్కొంది. పలు మైనింగ్ సంస్థలు, లీజుదారులు వేసిన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. లీజు కేటాయింపునకు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానాన్ని అనుసరించకుండా ఆక్షన్ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ మైనర్ మినరల్స్ ఇండస్ట్రీ, పలువురు మైనింగ్ లీజుదారులు తమ పిటిషన్లలో తప్పుపట్టారు. మూడేళ్ల డెడ్‌రెంట్‌కు సమానమైన సొమ్మును సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలన్న నిబంధనను చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల తుది విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం పిటిషన్లను కొట్టివేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.